


మార్గదర్శకులు
రూ॥ 120/-
పేజీలు: 130
నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★




తెలంగాణ కంపెనీని **ఎపికి తరలించిన కేంద్రం**
ఎఐసిసి ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్

లోపలి పేజీల్లో


సంపుటి 28, సంచిక: 57 | శనివారం | 16-08-2025 | హైదరాబాద్

Published from: **Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar**

పేజీలు: 12 | వెల రూ. 5.00




## అపోహలు, కుట్రలను ఛేదించి

# తెలంగాణను దేశానికి ఆదర్శంగా నిలబెడతాం

- మహనీయుల స్ఫూర్తితో తెలంగాణను అగ్రపథంలో నిలిపేందుకు కృషిచేస్తున్నాం
- ప్రపంచ నగరాలతో పోటీపడే నిర్ణయాలతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నాం
- కృష్ణా, గోదావరి జలాల్లో రాజీపడబోం
- సామాజిక న్యాయం కాంగ్రెస్ డిఎన్ఎలోనే ఉంది
- గోల్కొండ కోట వేదికగా పంద్రాగస్టు వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్ఘాటన

ప్రజాపక్షం/హైదరాబాద్

మహాత్మాగాంధీ సారథ్యంలో సాగిన భారత స్వాతంత్ర్య పోరాటం ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని, అహింసా పద్ధతిలో మహా సంగ్రామాన్ని గెలిచామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. 1947 ఆగస్టు 15న మాజీ ప్రధాని నెహ్రూ చేసిన ప్రసంగం దేశం మొత్తాన్ని ఏకం చేసిందని, మహనీయుల స్ఫూర్తితో తెలంగాణను అగ్రపథంలో నిలిపేందుకు కృషి చేస్తున్నామని,ప్రపంచ నగరాలతో పోటీ పడే నిర్ణయాలతో తెలంగాణను ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం సాహసోపేత నిర్ణయాలతో సాగు తోందని, మరోవైపు పేదల సంక్షేమంలో సరికొత్త చరిత్రను రాస్తున్నామని, సంక్షేమానికి కేరాఫ్ అంటే కాంగ్రెస్ పాలన తరువాయి 2లో

### శూన్యం నుంచి ఉన్నత శిఖలావైపు...

గత ప్రభుత్వం తమకు వారసత్వంగా ఇచ్చిన రూ. 8.21 లక్షల కోట్ల అప్పులకు వడ్డీలను చెల్లిస్తూ, రాష్ట్రాన్ని అభివృద్ధి పథం వైపు నడిపిస్తున్నాం. 6, లక్షల 71 వేల 757 కోట్ల రూపాయల అప్పులు, ఉద్యోగులు, ఇతర పథకాలకు సంబంధించిన బకాయిలు రూ.40 వేల 154 కోట్లు, ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్, సింగరేణి, విద్యుత్ ఇతర విభాగాలకు చెల్లించాల్సిన బకాయిలు రూ.1 లక్ష 9 వేల 740 కోట్లు ఉన్నాయి. గత ప్రభుత్వం చేసిన అప్పును సర్వీస్ చేయడానికి ఇప్పటి వరకు అసలు రూపేణా రూ.1,32,498 కోట్లను చెల్లించాం. వడ్డీలకు రూ.88, 178 కోట్లను మొత్తం కలిపి రూ. 2,20, 676 కోట్లను డెట్ సర్వీసింగ్ చేశాం. ఇంత ఆర్థిక భారం ఉన్నప్పటికీ శూన్యం నుంచి ఉన్నత శిఖరాలవైపు తెలంగాణ రాష్ట్రాన్ని తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నాం.

– సిఎం రేవంత్‌రెడ్డి



# స్వయం సమృద్ధి ఆర్థిక స్వావలంబన

**యుద్ధవిమానాల ఇంజన్ల నుండి ఇంధనం, కృత్రిమ మేథస్సు వరకు అన్ని రంగాల్లోనూ ఇదే లక్ష్యం**

- స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఎర్రకోట నుంచి ప్రధాని నరేంద్రమోదీ పిలుపు
- భవిష్యత్ తరాల కోసం సంస్కరణలకు టాస్క్‌ఫోర్స్
- దీపావళి బహుమతిగా జిఎస్‌టిలో మార్పులు, 'సుదర్శన చక్ర' అనే అత్యాధునిక రక్షణ కవచాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటన
- యువతకోసం 'వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన' పథకం ప్రారంభం

**న్యూఢిల్లీ :** యుద్ధ విమానాల ఇంజన్ల నుండి ఇంధనం, కృత్రిమ మేధస్సు వరకు అన్ని రంగాల్లో స్వయం సమృద్ధి సాధించడం ద్వారా 'సమృద్ధ భారత్' ను నిర్మించాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. తదుపరి తరం సంస్కరణల కోసం ఒక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తామని, దీపావళికి గొప్ప బహుమతిగా జిఎస్‌టి మార్పులను, 'సుదర్శన చక్ర' అనే అత్యాధునిక రక్షణ కవచాన్ని ఏర్పాటు చేస్తామని ఆయన ప్రకటించారు. గ్రీన్ హైడ్రోజన్‌లో భారతదేశం వేల కోట్ల రూపాయలను పెట్టుబడి పెడుతోందని ఆయన ఉద్ఘాటించారు. స్వాతంత్ర్యం శతాబ్ది నాటికి తన అణు విద్యుత్ సామర్థ్యాన్ని 10 రెట్లు పెంచుకుంటుందని ఆయన అన్నారు. కీలకమైన ఖనిజాలలో స్వాతంత్ర్యం కోసం దేశం 1,200 కన్నా ఎక్కువ ప్రదేశాలను అన్వేషిస్తోందని ఆయన అన్నారు. దేశ ఇంధనం, ఎరువుల అవసరాలను తీర్చడానికి భారీ మొత్తంలో డబ్బు మళ్లించడంపై ఆయన విచారం వ్యక్తం చేశారు. ఈ రంగాలలో స్వయం సమృద్ధి సాధించి ఉంటే, ఆ మొత్తాన్ని ప్రజల సంక్షేమం కోసం ఉపయోగించి ఉండవచ్చని తరువాయి 2లో

## ఎర్రకోట నుంచి ఆర్‌ఎస్‌ఎస్‌కు ప్రధాని ప్రశంసలా?

స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో ప్రస్తావనపై భగ్గుమన్న ప్రతిపక్షాలు

స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా ఎర్రకోట నుంచి ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రసంగంలో ఆర్‌ఎస్‌ఎస్‌ను ప్రశంసించడాన్ని ప్రతిపక్షాలు తీవ్రంగా గర్హించాయి. ఇది రాజ్యాంగం, లౌకిక గణతంత్ర స్ఫూర్తిని ఉద్దేశ్యపూర్వకంగా ఉల్లంఘించడమేనని కాంగ్రెస్ మండిపడింది. దేశాన్ని మత పరంగా విభజించే ఉద్దేశంతో ఆర్‌ఎస్‌ఎస్ వంటి సంస్థలను తరువాయి 2లో

# జిఎస్‌టిలో ఇక శ్లాబుల కుదింపు

- ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడి
- 5శాతం, 18శాతం జిఎస్‌టి శ్లాబులను ప్రతిపాదించిన కేంద్రం
- డీమెరిట్ వస్తువులపై 40శాతంతో ప్రత్యేక శ్లాబు




**న్యూఢిల్లీ :** కేంద్ర ప్రభుత్వం జిఎస్‌టిలో రెండు శ్లాబులను అమలు చేసేందుకు రంగం సిద్ధం చేస్తోంది. నిత్యం వాడే వస్తువులపై జిఎస్‌టి రేట్లు తగ్గించి దీపావళి పండుగ నుంచి అమలు చేస్తామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రకటించారు. ఇకపై రెండు స్లాబులే ఉంటాయని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం సవరించిన వస్తు, సేవల పన్ను (జిఎస్‌టి)లో 5శాతం, 18శాతం చొప్పున రెండు పన్ను రేట్లను ప్రతిపాదించిందని ఉన్నత స్థాయి వర్గాలు వెల్లడించాయి. ఈ ఏడాది దీపావళికి ప్రస్తుత పరోక్ష పన్ను విధానాన్ని భర్తీ చేయనున్నట్లు తెలియజేశాయి.12, 28శాతం శ్లాబులను తొలగించాలన్న తన ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం జిఎస్‌టిరేటు తరువాయి 2లో




## ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణకు

# యువత ముందుండాలి

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి పిలుపు

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రజాస్వామ్యం,రాజ్యాంగ పరిరక్షణకు యువత ముందుకు రావాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా హైదరాబాద్, హిమాయత్ నగర్‌లోని మఖ్దూం భవన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జాతీయ జెండాను చాడ వెంకట్ రెడ్డి శుక్రవారం ఆవిష్క రించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్యపద్మ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి, ఈ.టి. నరసింహ, ఐఎఎల్ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా చాడ వెంకట్ రెడ్డి ప్రసంగిస్తూ దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని భారత కమ్యూనిస్టు పార్టీ పిలుపునివ్వడం గర్వకారణంగా భావిస్తున్నామని, ఆనాడు 'స్వాతంత్ర్యం రావాలని, స్వాతంత్ర్యం మా జన్మహక్కు అని, స్వాతంత్ర్యం మాకు సర్వస్వం, విదేశీ పరిపాలన, సంస్థానాల పరిపాలన, రాచరిక పరిపాలన అంతం ద్వారా ప్రజల కోసం ప్రభుత్వం ఏర్పడే దిశగా స్వాతంత్ర్యం కావాలని' అనేక మంది, యోధాను యోధులు తమ ప్రాణాలను అర్పించారన్నారు. సర్దార్ భగత్ సింగ్, రామ్‌దేవ్, సుఖ్‌దేవ్‌లు ప్రాణాలు తరువాయి 12లో

# మూడురోజులు అతి భారీ వర్షాలు



**కొనసాగుతున్న అల్పపీడన ద్రోణి**

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో మరో మూడురోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో శుక్ర, శనివారాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయన్నారు. పశ్చిమ మధ్య బంగాళాఖాతం, దాన్ని ఆనుకొని ఉన్న వాయవ్య బంగాళాఖాతంలో ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తరువాయి 12లో


- భారత కమ్యూనిస్టు పార్టీ పిలుస్తోంది








## హైకోర్టు కంటే సుప్రీంకోర్టు

# ఉన్నతమేమీ కాదు

- జడ్జీలుగా ఎవరిని సిఫార్సు చేయాలో ఆదేశించలేదు
- సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ కార్యక్రమంలో సిజెఐ గవాయ్ వ్యాఖ్య

**న్యూఢిల్లీ :** సుప్రీంకోర్టు కొలీజియం హైకోర్టు కొలీజియంను న్యాయమూర్తి పదవికి ఒక నిర్దిష్ట పేరును సిఫారసు చేయమని ఆదేశించలేదని భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) బిఆర్.గవాయ్ శుక్రవారం స్పష్టం చేశారు. రెండూ రాజ్యాంగ న్యాయసంస్థలేనని, రెండూ మరొకదానికంటే ఉన్నతమైనవి కాదని నొక్కి చెప్పింది. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ (ఎస్‌సిబిఎ) ఆధ్వర్యంలో నిర్వహించిన 79వ స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. సుప్రీంకోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాదులను ఉన్నత న్యాయస్థానాలలో న్యాయమూర్తి పదవికి పరిగణించాలని ఎస్‌బిఎ అధ్యక్షుడు వికాస్‌సింగ్ సుప్రీంకోర్టు కొలీజియంను కోరారు. సిజెఐ బిఆర్.గవాయ్ మాట్లాడుతూ 'అంతిమంగా, సుప్రీంకోర్టు కొలీజియం కూడా పేర్లను సిఫారసు చేయమని హైకోర్టు కొలీజియంను ఆదేశించలేదు. సుప్రీంకోర్టు హైకోర్టుకు ఉన్నత న్యాయస్థానం కాదు' అని గవాయ్ అన్నారు. సుప్రీంకోర్టు, తరువాయి 12లో




# బిజెపికి నైతికత లేదు

- అధికారం కోసం ఏమైనా చేయగలదు
- 65 లక్షల ఓట్లు తొలగిస్తే అభ్యంతరం చెప్పలేదు
- స్వాతంత్ర్య వేడుకల్లో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శ



న్యూఢిల్లీ : అధికార బిజెపి మరోసారి గద్దెనెక్కేందుకు ఎంతటి అనైతికతకైనా వెళ్ళడానికి సిద్ధంగా ఉందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. దేశవ్యాప్తంగా జరిగిన ఎన్నికలలో అనేక అక్రమాలు బయటపడుతున్నాయని పేర్కొన్నారు. ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం ఇందిరా భవన్‌లో శుక్రారం ఖర్గే జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన ప్రసంగించారు. బిహార్ ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్‌ఐఆర్) పేరుతో ప్రతిపక్షాల ఓట్లను బహిరంగంగా తొలగిస్తున్నారని, బతికి ఉన్నవారిని చనిపోయినట్లు చిత్రీకరిస్తున్నాయని మండిపడ్డారు. ఎస్‌ఐఆర్ నుంచి ప్రయోజనం పొందిన బిజెపికి 65 లక్షల మంది ఓట్లను తొలగించినా ఎటువంటి అభ్యంతరం లేదని కాంగ్రెస్ చీఫ్ అన్నారు. దీనిపై తాము చేస్తున్న పోరాటం ఎన్నికల్లో గెలవడానికి కాదని, భారతదేశ ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి, రాజ్యాంగాన్ని రక్షించడానికి అని ఖర్గే అన్నారు. బిహార్ ఓటర్ల జాబితాల సవరణను కాంగ్రెస్ ఎందుకు వ్యతిరేకిస్తుంది అనే విషయమై ఖర్గే స్పందిస్తూ ఇప్పుడు తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

## ప్లాస్టిక్ సంక్షోభ పరిష్కారంపై ఒప్పందం కుదరని చర్చలు

**జెనీవా:** ప్రపంచ ప్లాస్టిక్ కాలుష్య సంక్షోభాన్ని పరిష్కరించడానికి ఒక వ్యూహాత్మక ప్రణాళికను సిద్ధం చేసుకోవడమే లక్ష్యంగా జరిగిన చర్చలు శుక్రవారం జెనీవాలో ఎలాంటి ఒప్పందం కుదరలేదు. యావత్ ప్రపంచాన్ని వెంటాడుతున్న ప్లాస్టిక్ కాలుష్య సంక్షోభాన్ని అంతం చేయడానికి ఒక కీలకమైన ఒప్పందానికి వచ్చేందుకు జెనీవాలోని ఐక్యరాజ్యసమితి కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ప్లాస్టిక్ ఉత్పత్తిని తగ్గించడం, ప్లాస్టిక్‌లను తయారు చేయడానికి ఉపయోగించే విష రసాయనాల వినియోగంపై ప్రపంచ దేశాలు ఒకే చట్టానికి కట్టుబడి ఉండేలా నియంత్రణ సూత్రాలను ఖరారు చేయడం వంటి అంశాలపై సుదీర్ఘ చర్చలు జరిగాయి.

మహాసముద్రాలతో సహా భూగోళాన్ని పట్టిపీడిస్తున్న ప్లాస్టిక్ కాలుష్యంపై చట్టబద్ధంగా అన్ని దేశా లు కట్టుబడి ఉండే ఒప్పందానికి రావాల్సి ఉండగా, అది నెరవేరలేదు.

# పాకిస్తాన్‌లో వరద బీభత్సం




### 214 మంది మృతి.. పిఒకెలో లోతట్టు ప్రాంతాలు జలయమం

**పెషావర్/ఇస్లామాబాద్:** పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పిఒకె)లోని అనేక ప్రాంతాలలో వర్ష బీభత్సం కొనసాగుతున్నది. గత 36 గంటల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో కనీసం 214 మంది మరణించగా, చాలా మంది గల్లంతయ్యారని అధికారులు శుక్రవారం తెలిపారు. గురువారం రాత్రి కురిసిన కుండపోత వర్షాల కారణంగా ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లోని లోయర్ దిర్, బజౌర్, అబోటాబాద్ తదితర జిల్లాల్లో ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటం వంటి సంఘటనలు చోటు చేసుకున్నాయని రెస్క్యూ అధికారులు తెలిపారు. లోయర్ దిర్‌లోని మైదాన్ సోరి పావో ప్రాంతంలో, ఒక ఇంటి పైకప్పు కూలిపోయి ఐదుగురు మరణించగా, మహిళలు, పిల్లలు సహా మరో నలుగురు గాయపడ్డారు. శిథిలాల నుండి ఏడుగురిని రెస్క్యూ సిబ్బంది వెలికితీశారు. కాగా, వారిలో ఐదుగురు చనిపోయినట్లు వైద్యులు ప్రకటించారు. కుండబోత కారణంగా పంజ్‌కోరా నదిలో నీటి మట్టం ఆందోళనకరంగా పెరిగిందని అధికారులు తెలిపారు. బజౌర్ జిల్లాలో, జబ్రారి, సలార్జాయ్ ప్రాంతాలలో ఆకస్మిక వరదలు ముంచెత్తాయి. కొన్ని చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. దీనితో భారీ విధ్వంసం, నష్టం చోటు చేసుకున్నాయి. ఈ ప్రాంతం నుంచి ఇప్పటివరకు తొమ్మిది మృతదేహాలను వెలికితీశారు. తీవ్రంగా గాయపడి నలుగురిని ఆసుపత్రికి తరలించారు. స్థానిక వర్గాల సమాచారం ప్రకారం కనీసం 17 మంది గల్లంతయ్యారు. జబ్రారి గ్రామంలో భారీ వర్షాలతో వరదలు సంభవించాయి. పలు ఇళ్లు, ఇతర నిర్మాణాలు పాక్షికంగా లేదా పూర్తిగా ధ్వంసమయ్యాయి. అనేక మంది గాయపడ్డారు. రెస్క్యూ బృందాలు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని, ఐదు మృతదేహాలను వెలికితీశారు. గాయపడిన వారికి ప్రథమ చికిత్సను అందించి, స్థానిక ఆసుపత్రికి తరలించారు. బజౌర్ జిల్లా అత్యవసర అధికారి అమ్జద్ ఖాన్ కొనసాగుతున్న సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. సలార్జాయ్ సంఘటనలో తొమ్మిది మంది మరణించారని, తీవ్రంగా గాయపడిన ఇద్దరు వ్యక్తులను ఖార్ ఆసుపత్రికి తరలించినట్లు డిప్యూటీ కమిషనర్ షాహిద్ అలీ ధ్రువీకరించారు. కాగా, మన్సెహ్రాలో, కాఘన్ హైవేలోని బస్యాన్ పాయింట్ వద్ద ఉప్పొంగిన ప్రవాహంలో కారు కొట్టుకుపోవడంతో ఇద్దరు వ్యక్తులు మరణించారు. మరో ముగ్గురిని స్థానికులు రక్షించారు. కొనసాగుతున్న వర్షాల సమయంలో అనవసర ప్రయాణాలను మానుకోవాలని లేదా వాయిదా వేసుకోవాలని పర్యాటకులకు అధికారులు సూచించారు. పిఒకెలోని గిల్గిట్‌బాల్టిస్తాన్ పరిధిలో, ఘైజర్ జిల్లాలో ఆకస్మిక వరదలు సంభవించడంతో ఎనిమిది మంది మరణించగా, మరో ఇద్దరు గల్లంతయ్యారని అధికారులు తెలిపారు. వరదలు డజనుకు పైగా ఇళ్లు, అనేక వాహనాలు దెబ్బతిన్నాయి. పాఠశాలలు, ఆరోగ్య విభాగ భవనాలు పాక్షికంగా ధ్వంసమయ్యాయి. కరకోరం హైవే, బాల్టిస్తాన్ హైవేతో సహా ప్రధాన రహదారులపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రట్టిగలి సరస్సు వద్ద విడిది చేసిన 600 మందికి పైగా పర్యాటకులు, రోడ్డు దెబ్బతిన్న కారణంగా అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. వారిని అక్కడి నుంచి తరలించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆకస్మిక వరదల కారణంగా లావత్ నుల్లాపై ఉన్న రెండు అనుసంధాన వంతెనలు కొట్టుకుపోయాయి. ఉబ్బిన జాగ్రన్ నుల్లా కుండల్ షాహిలో ఒక వంతెనను కూలింది.

ఈ నదీతీర ప్రాంతంలో కనీసం మూడు ఇళ్లు వరద నీటిలో కొట్టుకుపోయినట్లు అధికారులు ప్రకటించారు. జీలం లోయ, పాల్కోట్ ప్రాంతాల్లోనూ ఆకస్మిక వరదలు సంభవించాయి. ఫలితంగా రహదారి దెబ్బతిన్నది. వందలాది వాహనాలు ఎక్కడవి అక్కడే నిలిచిపోయాయి. నీలం నదికి భారీగా వరద నీరు వచ్చి చేరుతున్న కారణంగా అధికారులు ముందస్తు హెచ్చరికలు జారీ చేశారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత స్థానాలకు తరలివెళ్లాల్సిందిగా కోరారు. కాగా, ముజఫరాబాద్ జిల్లాలో, సర్లి సచా గ్రామంలో భారీ కొండచరియలు ఒక ఇంటిపై పడడంతో, ఒకే కుటుంబంలోని ఆరుగురు సభ్యులు సజీవ సమాధి అయ్యారని అంటున్నారు. అధికారికంగా ఇంకా ఎవరూ ఈ విషయాన్ని ధ్రువీకరించలేదు.



## ప్రపంచ వ్యవహారాల్లో భారత్ పాత్ర కీలకం



### రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రశంస

**మాస్కో:** ప్రపంచ వ్యవహాల్లో భారత్ ప్రముఖ పాత్ర పోషిస్తున్నదని, అర్థమైన అధికారాన్ని కలిగి ఉండదని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రశంసించారు. కీలకమైన అంతర్జాతీయ సమస్యలను పరిష్కరించడంలో దాని చురుకైన పాత్రను శుక్రవారం భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు పంపిన సందేశంలో ఆయన హైలైట్ చేశారు. అతి ముఖ్యమైన సమస్యలపై భారత్ స్పందనను ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు.

'భారతదేశంతో ప్రత్యేక విశేష వ్యూహాత్మక భాగస్వామ్య సంబంధాలకు మేము విలువ ఇస్తాం' అని పుతిన్ అన్నారు. ఉమ్మడి ప్రయత్నాల ద్వారా, రష్యా–భారత్ వివిధ రంగాలలో నిర్మాణాత్మక ద్వైపాక్షిక సహకారానికి సమగ్రతను సాధించే దిశగా ముందుకు సాగుతునే ఉంటాయని పుతిన్ విశ్వాసం వ్యక్తం చేశారు. 'ఇది మన స్నేహపూర్వక ప్రజల ప్రయోజనాలను పూర్తి చేస్తుంది. ప్రాంతీయ, ప్రపంచ స్థాయిలో భద్రత, స్థిరత్వాన్ని బలోపేతం చేయడానికి అనుగుణంగా ఉంటుంది' అని వ్యాఖ్యానించారు.

### సమష్టిగా ముందుకు..

ఆధునిక ప్రపంచం ఎదుర్కొంటున్న ఎన్నో సవాళ్ల ను అధిగమించడానికి భారత్‌తో కలిసి సమష్టిగా ముందుకు వెళతామని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో పేర్కొన్నారు.

రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు పటిష్టంగా ఉన్నాయని భారత స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షల సందేశంలో వ్యాఖ్యానించారు. ఇరు దేశా ల చారిత్రక సంబంధాలు భవిష్యత్తులోనూ కొనసాగుతాయన్న ధీమా వ్యక్తం చేశారు. శాంతి, సౌభ్రాతృత్వం, అభివృద్ధి అనే లక్ష్యాలతో రెండు దేశాలు పని చేస్తాయని రూబియో అన్నారు.

## ఆదర్శంగా నిలబెడతాం

**(మొదటి పేజీ తరువాయి)**

అని అన్నారు. కొందరు సృష్టిస్తున్న అపోహలను, కుట్రలను ఛేధించి, తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలబెడుతామన్నారు.

''హైదరాబాద్‌లోని గోల్కొండ కోటలో 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన జాతీయ జెండాను సిఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఎం ప్రసంగిస్తూ గోదావరి, కృష్ణా జలాల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని,తెలంగాణ వాటా సాధించే వరకు ఎవరి బెదిరింపులకు లొంగేది లేదని, ఎవరు ఎన్ని కుట్రలు చేసినప్పటికీ, ఆ కుట్రలను ఛేధించి రాష్ట్రానికి రావాల్సిన నీటి వాటాను సాధిస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. 'మన' (తెలంగాణ)భూములు సస్యశ్యామలమైన తర్వాతే మరొకరి నీళ్ల విషయంలో ఆలోచిస్తామని అన్నారు. ప్రస్తుత 'ఆధునిక భారతం' ఐదేళ్లలోనో లేదా పదేళ్లలోనో సాధించిన విజయం కాదని, దీని వెనుక 79 ఏళ్ల కఠోర శ్రమ ఉన్నదని, ఎందరో గొప్ప నాయకుల త్యాగం, చెమట, రక్తం ఉన్నదని గుర్తు చేశారు. మహా నీయుల స్ఫూర్తితో తెలంగాణను అగ్రపథంలో నిలిపేందుకు కృషి చేస్తున్నామని,ఒక వైపు ప్రపంచ నగరాలతో పోటీ పడే లక్ష్యాలు నిర్దేశించుకున్నామని, మరో వైపు పేదల ఆకాంక్షలు తీర్చే సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని, ద్విముఖ విధానంతో తమ ప్రభుత్వం పాలనను సాగిస్తోందని సిఎం తెలిపారు. సామాజిక న్యాయం కాంగ్రెస్ డిఎన్ఏలోనే ఉన్నదని రేవంత్ రెడ్డి తెలిపారు. తొలి విడతగా ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, ఇందుకు రూ.22,500 కోట్లు వెచ్చిస్తున్నామని, రాష్ట్రంలోని నాలుగు ఐటిడిఎ ప్రాంతాల్లో 22,016 ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి చుక్కనీరు రాకపోయినా ధాన్యం దిగుబడిలో రికార్డు సాధించామని, శ్రీశైలం, నాగార్జున సాగర్, శ్రీరామ్‌సాగర్ , కోయిల్‌సాగర్‌తో వరి పండిస్తున్నట్లు సిఎం వివరించారు.

రుణమాఫీ విషయంలో రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామన్నారు. విత్తనాలు వేసేనాటికే రైతుల ఖాతాల్లో రైతుభరోసా ఇచ్చామని, పరిమితులు లేకుండా 9 రోజుల్లోనే రైతుల ఖాతాల్లో రూ.9 వేల కోట్లు జమ చేశామన్నారు. మహాలక్ష్మి పథకం కింద ఇటీవలే 200 కోట్ల జీరో టికెట్ల మైలురాయిని దాటడం తమ విజయాలలో మరో మైలురాయిగా అభివర్ణించారు.

**రేషన్ కార్డులు ఆత్మగౌరవానికి ప్రతీక....**

రేషన్ కార్డులు ప్రజల ఆత్మగౌరవానికి మరో ప్రతీక అని, ఒక భరోసా,భావోద్వేగంగా సిఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. ఆ భరోసా కోసం రాష్ట్ర ప్రజలు పదేళ్లు కళ్లు కాయలు కాచేలా ఎదురు చూశారని, ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాతే ఆ ఎదురు చూపులకు పరిష్కారం లభించిందన్నారు.దేశంలో ఎక్కడాలేని విధంగా 3.10 కోట్ల మందికి సన్నబియ్యం ఇస్తున్నామని, సన్నబియ్యం పథకం కేవలం ఆకలి తీర్చే ఒక పథకం కాదని, ఇదొక పేదల ఆత్మగౌరవానికి ప్రతీకగా రేవంత్ రెడ్డి అభివర్ణించారు. పదేళ్ల తర్వాత చేతిలో రేషన్ కార్డుతో, రేషన్ షాపుల వద్ద సందడి కనిపిస్తోందని, పాడుబడి, మూతబడిన రేషన్ షాపుల తలుపులు మళ్లీ తెరుచుకున్నాయని తెలిపారు. సంక్షేమానికి కేరాఫ్ కాంగ్రెస్ పాలన అని, ఇందుకు చరిత్రే సాక్ష్యమని అన్నారు.

**బిసి రిజర్వేషన్ల బిల్లును ఆమోదించండి**

బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం పంపించిన రెండు బిసి బిల్లులను ఆమోదించాలని సిఎం రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశంలో ఎస్‌సి వర్గీకరణ చేసిన మొదటి రాష్ట్రం తెలంగాణ అని, సుప్రీం కోర్టు తీర్పునకు అనుగుణంగా రాష్ట్రంలోని ఎస్‌సిలో ఉన్న 59 ఉప కులాలను మూడు గ్రూపులుగా విభజించామని, గ్రూప్ 1లో 15, గ్రూప్ 2లో 18, గ్రూప్ 3లో 26 కులాలను చేర్చామన్నారు. మసకబారిన ఆరోగ్య శ్రీ పథకానికి పూర్వవైభవం తీసుకొచ్చామని, 27 ఎకరాల విస్తీర్ణంలో రూ 2,700 కోట్ల వ్యయంతో నయా ఉస్మానియా ఆస్పత్రి భవన సముదాయాన్ని నిర్మిస్తున్నామన్నారు.

**పదేళ్లలో యువతను మత్తుకు బానిసలు చేసే కుట్ర**

గడిచిన పదేళ్లలో యువతను మత్తుకు బానిసలను చేసే కుట్రను తాము ఛేధించామని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో డ్రగ్స్ అనే మాట వినబడటానికి వీలు లేకుండా కఠినంగా వ్యవహరిస్తున్నామని చెప్పారు. 'ఈగల్' పేరుతో ఏర్పాడిన వ్యవస్థ రాష్ట్రం మూల మూలలా నిశితంగా నిఘా పెట్టిందని, డ్రగ్స్ మాయగాళ్ల వెన్నులో వణుకు పుట్టిస్తోందని అన్నారు. 20 నెలల తమ పాలనలో 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామన్నారు. గ్రూప్1,2,3 పరీక్షలను నిర్వహించామని, త్వరలోనే భర్తీ ప్రక్రియను చేపడుతామని సిఎం అన్నారు.

**'కాళేశ్వరం' కూలింది.. ఎస్ఎల్‌బిసి, పాలమూరు పూర్తి చేస్తాం**

నెహ్రూ నిర్మించిన సాగర్, శ్రీశైలం, శ్రీరామ్‌సాగర్‌తోనే నీళ్లు అందుతున్నాయని, గత ప్రభుత్వం కాళేశ్వరం పేరుతో రూ.లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్ కూలిందని సిఎం రేవంత్ రెడ్డి దుయ్యబట్టారు. రూ.లక్ష కోట్లు వృథా చేసి ఇప్పుడు మళ్లీ సెంటిమెంట్ రాజకీయాలు చేస్తున్నారన్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో జరిగిన నష్టాన్ని భర్తీ చేస్తూనే, శాశ్వత హక్కుల సాధనలో విజయం సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వ్యూహాత్మకమైన ప్రణాళికతో పని చేస్తుందన్నారు. దృష్టి మరల్చేందుకు సెంటిమెంట్ రగిలించాలన్న కొందరి కుట్రలను తిప్పికొట్టాల్సిన బాధ్యత తెలంగాణ ప్రజలపై ఉందని అన్నారు. గత ప్రభుత్వం లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్ట్ కూలిపోయిందన్నారు. ఎస్ఎల్‌బిసి, పాలమూరురంగారెడ్డి, డిండి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని, తెలంగాణలో చివరి ఆయకట్టు వరకు నీరందిస్తామని హామీనిచ్చారు.

**దేశ భద్రతకు హైదరాబాద్ నగరం కీలకం**

ఆపరేషన్ 'సిందూర్'కు హైదరాబాద్ నగరం యుద్ధ సామాగ్రిని అందించిందని సిఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. భవిష్యత్‌లో కూడా దేశ భద్రతకు హైదరాబాద్ నగరం కీలకం కానుందన్నారు. హైదరాబాద్ బ్రాండింగ్ పెంచేందుకు చర్యలు చేపట్టినట్టు వివరించారు. మూసీ పునరుజ్జీవంతోనే హైదరాబాద్ వరదకు పరిష్కారం అని చెప్పారు.

ఢిల్లీ, బెంగుళూరు పరిస్థితులు రావొద్దంటే కబ్జాలను అరికట్టాల్సిన అవసరం ఉన్నదని, అందుకు హైడ్రాకు అందరూ సహకరించాల్సి ఉన్నదని కోరారు. రూ.30వేల కోట్ల విలువైన భూములను హైడ్రా కాపాడిందని, కబ్జాలతో కనుమరుగైన బతుకమ్మ కుంటలను కూడా హైడ్రా పునరుద్ధరించిందన్నారు. హైడ్రాను బూచిగా చూపి కొందరు రాజకీయ లబ్ధి పొందాలనుకోవడం దుర్మార్గమన్నారు. ప్రపంచానికే ఆదర్శంగా నిలిచేలా హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. తెలంగాణ రైజింగ్ 2047 విజినరీ డాక్యుమెంట్‌ను డిసెంబర్ 9న ప్రారంభించబోతున్నామన్నారు. జిడిపిలో ప్రస్తుతం 5 శతం ఉన్న వాటాను, పది శాతానికి పెంచుతామన్నారు. పోలీసింగ్ వ్యవస్థలో రాష్ట్ర పోలీసులు ముందు వరుసు నిలువడం గర్వకారణమన్నారు.

## ఆర్థిక స్వావలంబన

**(మొదటి పేజీ తరువాయి)**

ఆయన అన్నారు. దేశ యువతకోసం 'వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన' పథకాన్ని ఎర్రకోట వేదికగా ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించారు. ప్రైవేట్ కంపెనీల్లో కొత్తగా చేరే ఉద్యోగులకు ప్రభుత్వం తరఫున రూ.15వేలు అందించనున్నట్లు చెప్పారు.

ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక స్వార్థం పెరిగిపోతుందని, మనం ఇతరుల గురించి సమయాన్ని వృథా చేసుకోవద్దని మోదీ అన్నారు. ఏ ఇతర దేశం గీతను తగ్గించడానికి మన శక్తిని వృథా చేయకూడదని, మనం పూర్తి శక్తితో మన గీతను పొడవుగా చేయాలని,మనం అలా చేయగలిగితే ప్రపంచం మన సత్తాను అంగీకరిస్తుందని అన్నారు. భారతదేశ 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట వద్ద జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం ప్రధాని మోదీ 103 నిమిషాలు ప్రసంగించారు. ఇంధనంలో స్వయం సమృద్ధి కోసం ఒక జాతీయ డీప్ వాటర్ ఎక్స్‌ప్లోరేషన్ మిషన్, చొరబాటుదారుల వల్ల కలిగే జనాభా మార్పుల తీవ్ర సంక్షోభాన్ని పరిష్కరించడానికి ఒక ఉన్నతసాధికార జనాభా మిషన్ వంటి ప్రకటనలను ఆయన చేశారు.

అమెరికాతో దేశ సంబంధాల్లో ఒక ఒత్తిడి నెలకొన్న నేపథ్యంలో, సెమికండక్టర్లు, సోషల్ మీడియా, ఎరువులు, ఫార్మా వంటి వివిధ రంగాలలో 'స్వదేశీ' (మేడ్ ఇన్ ఇండియా), స్వయం సమృద్ధి, ఆవిష్కరణల కోసం ఆయన పిలుపునిచ్చారు. 2047 నాటికి భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారడానికి అనుగుణంగా సమయబద్ధమైన సిఫార్సులు చేయడానికి సంస్కరణలపై టాస్క్‌ఫోర్స్ పనిచేస్తుందని ఆయన అన్నారు.

సంక్షోభ సమయాల్లో మనం భయపడకుండా, మన సామర్థ్యాలను,విజయాలను మెరుగుపరచుకోవడానికి కృషి చేయడం ప్రస్తుత సమయంలో అవసరమని ప్రధాని పేర్కొన్నారు. భారతీయ తయారీదారుల మంత్రం 'దామ్ కమ్, దమ్ జ్యాదా' (తక్కువ ధర, ఎక్కువనాణ్యత) కావాలని ఆయన అన్నారు.భారతదేశం దీనిని సాధ్యం చేయగలదని ఆయన పేర్కొన్నారు. లెక్కలేనన్ని త్యాగాలతో స్వతంత్ర భారతదేశం కలను సాకారం చేయగలిగితే, లెక్కలేనంత మంది ప్రజల కృషి, సంకల్పం, స్వయం సమృద్ధి ,స్థానిక వస్తువులకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా సంపన్న భారతదేశాన్ని కూడా సాధించవచ్చు అని ఆయన అన్నారు. నాటి తరం 'స్వతంత్ర భారత్' కోసం తమను తాము త్యాగం చేసిందని, ఈ తరం 'సమృద్ధ భారత్' కోసం తమను తాము అంకితం చేసుకోవాలని అన్నారు. భారతదేశాన్ని సంపన్నంగా చేయడానికి కొత్త చర్యలు తీసుకోవడం ప్రస్తుత అవసరమని చెప్పారు. ఇది ఏ ఒక్క రాజకీయ పార్టీ అజెండా కాదని, ఈ దేశం అందరిదని ఆయన అన్నారు.ఇది మన సామూహిక సంకల్పంగా మారితే, మనం ప్రపంచాన్ని తక్కువ సమయంలోనే మార్చివేస్తామని ప్రధాని ఉద్ఘాటించారు.

ఒక లోతైన ఆలోచనతో కుట్రపూరితంగా దేశ జనాభా సంఖ్యను మార్చబడుతోందని, ఒక కొత్త సంక్షోభానికి విత్తనాలు నాటబడుతున్నాయని, దానిని సహించబోమని ఆయన అన్నారు. చొరబాటుదారులు దేశ యువత ఉద్యోగాలను లాక్కుంటున్నారు, అమాయక గిరిజన ప్రజల భూములను ఆక్రమిస్తున్నారు, అమ్మాయిలను ప్రలోభపెడుతున్నారు, ఇది దేశం సహించదని ఆయన పేర్కొన్నారు. ఏ దేశం కూడా చొరబాటుదారులచే ఆక్రమించబడటానికి అనుమతించదన్నారు.చిన్న పరిశ్రమలకు గణనీయంగా పన్ను భారాన్ని తగ్గించే తదుపరి తరం జిఎస్‌టి సంస్కరణలు పనిలో ఉన్నాయని, దీపావళి బహుమతిగా పన్నుల తగ్గింపు పౌరులకు ఉంటాయని మోదీ ప్రకటించారు.

**సింధు జలాల ఒడంబడికను అంగీకరించబోము**

ఉగ్రవాదులను,వారికి ఆశ్రయం కల్పించేవారిని సమానంగా పరిగణిస్తామని, పొరుగు దేశం నుండి భవిష్యత్తులో ఏదైనా దుశ్చర్య జరిగితే భారత సాయుధ దళాలు శిక్షను నిర్ణయిస్తాయని ప్రధాని మోదీ అన్నారు.భారతదేశం చాలా కాలం పాటు అణు బెదిరింపును సహించిందని, కానీ ఇకపై అలా చేయదని ఆయన అన్నారు.

ప్రస్తుత రూపంలో సింధు జలాల ఒడంబడికను భారత దేశం అంగీకరించదని ఆయన స్పష్టం చేశారు. ఈ ఒప్పందం భారతీయ రైతులకు వారి చట్టబద్ధమైన నీటిని పాకిస్తాన్‌కు మళ్లించడం ద్వారా ఊహించలేని నష్టం కలిగించిందని ఆయన అన్నారు.

కీలకమైన వ్యూహాత్మక, పౌర సౌకర్యాలు, మతపరమైన ప్రదేశాలను సురక్షితంగా ఉంచేందుకు ఒక స్వదేశీ రక్షణ వ్యవస్థను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నట్లు మోదీ ప్రకటించారు. 'సుదర్శన్ చక్ర' వ్యవస్థ శ్రీకృష్ణుని నుండి ప్రేరణ పొందిందని, అది శత్రువు నుండి వచ్చే ఏ దాడిని నిరోధించడమే కాకుండా, రెట్టింపు శక్తితో తిరిగి దాడి చేస్తుందని ఆయన అన్నారు.రాజ్యాంగం దేశానికి మార్గదర్శి అని మోదీ ఉద్ఘాటించారు. 1975లో అత్యవసర పరిస్థితిని విధించి రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని హతమార్చిన వారి పాపాలను ప్రజలు ఎప్పటికీ మర్చిపోకూడదని ఆయన కోరారు.

ఆధునిక సాంకేతికతతో సహా వివిధ రంగాలలో దేశాన్ని స్వయం సమృద్ధిగా చేయడానికి తన ప్రభుత్వం అనేక అడుగులు వేసిందని ఆయన చెప్పారు. కానీ భారతదేశం సెమికండక్టర్ పరిశ్రమలో ప్రవేశించే సమస్యను ఐదారు దశాబ్దాల పాటు అన్వేషించినప్పటికీ, ఫైళ్లు చిక్కుకుపోయాయని అన్నారు.సాంకేతికతలో పెట్టుబడి పెట్టిన దేశాలు అగ్రస్థానానికి చేరుకున్నాయని ఆయన అన్నారు. తన ప్రభుత్వం దీన్ని ఆచరణలోకి తీసుకొచ్చిందని, భారతదేశం ఈ సంవత్సరం సెమికండక్టర్ చిప్లను ఉత్పత్తి చేయడం ప్రారంభిస్తుందని ఆయన అన్నారు.


## శ్లాబుల విధింపు

**(మొదటి పేజీ తరువాయి)**

హేతుబద్ధీకరణపై రాష్ట్ర ఆర్థిక మంత్రుల ప్యానెల్‌కు పంపించింది. వారు ప్రస్తుతం దానిపై చర్చించి జిఎస్‌టి కౌన్సిల్ ముందు పెడతారు. కౌన్సిల్ సెప్టెంబర్‌లో సమావేశం కానున్నదని తెలిపారు. నిత్యావసర వస్తువులపై సున్నా లేదా సున్నా శాతం జిఎస్‌టి,రోజువారీ వినియోగవస్తువులపై 5 శాతం, ప్రామాణిక వస్తువులపై 12 శాతం, ఎలక్ట్రానిక్స్, సేవలపై 18శాతం, విలాస, అపరాధ (సిన్) వస్తువులపై 28శాతం వసూలు చేస్తారు. పునరుద్ధరించబడిన జిఎస్‌టి విధానంలో లగ్జరీ, అపరాధ వస్తువులకు రెండు శ్లాబులతో పాటు 40శాతం రేటు ఉంటుందని ఉన్నత స్థాయివర్గాలు తెలిపాయి. పునరుద్ధరించబడిన నిర్మాణం జిఎస్‌టి ద్వారా ఆమోదించబడినప్పుడు ప్రస్తుత 12శాతం శ్లాబ్‌లోని 99 శాతం వస్తువులు 5శాతం బ్రాకెట్‌లోకి మారుతాయి. అదేవిధంగా, ప్రస్తుతం 28శాతంగా వసూలు చేయబడుతున్న దాదాపు 90శాతం వస్తువులు,సేవలు 18 శాతం శ్లాబుకు మారుతాయని ఉన్నత స్థాయివర్గాలు వెల్లడించాయి. 7వస్తువులపై 40శాతం ప్రత్యేక రేటు విధించబడుతుందని, పొగాకు కూడా ఈ రేటు పరిధిలోకి వస్తుందని ఉన్నతస్థాయి వర్గాలు తెలిపాయి.

**పన్ను భారాన్ని తగ్గించేలా రెండు శ్లాబుల జిఎస్‌టి రేటు : ఆర్థిక మంత్రిత్వ శాఖ**

అంతకుముందు, 'తదుపరి తరం' జిఎస్‌టి సంస్కరణలను దృష్టిలో ఉంచుకుని ఎంపిక చేసిన కొన్ని వస్తువులపై ప్రత్యేక రేట్లతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రెండు శ్లాబుల జిఎస్‌టి రేట్ నిర్మాణాన్ని ప్రభుత్వం గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్(జిఓఎం)కు




ప్రతిపాదించిందని శుక్రవారంనాడు ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. రోజువారీ వినియోగ వ్యవస్థపై పన్ను భారాన్ని తగ్గించే విధంగా ఈ జిఎస్‌టి సంస్కరణలు అమలులోకి వస్తాయని తెలిపింది. వస్తువులు, సేవల పన్ను విధానంలో వస్తువులు, సేవలను ప్రామాణికం, 'మెరిట్'గా వర్గీకరించడానికి రెండు శ్లాబులు మాత్రమే ఉండాలని కేంద్ర, రాష్ట్ర ఆర్థిక మంత్రుల ప్యానెల్‌కు ప్రతిపాదించినట్లు ఆర్థిక మంత్రి త్వ శాఖ వెల్లడించింది. ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన రాష్ట్ర మంత్రులతో కూడిన జిఎస్‌టి కౌన్సిల్ సెప్టెంబరులో సమావేశం అయ్యి రేటు హేతుబద్ధీకరణపై మంత్రుల బృందం ప్రతిపాదనను చర్చించనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే ఉద్దేశించిన ప్రయోజనాలు గణనీయంగా సాధించబడేలా ఈ అమలును సులభతరం చేయడానికి అన్ని ప్రయత్నాలూ చేయబడతాయి అని రేటు హేతుబద్ధీకరణ 'గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్'కు సమర్పించబడిన తన ప్రతిపాదనను విడుదల చేస్తూ ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది.ప్రధానమంత్రి నరేంద్రమోదీ 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతిని ఉద్దేశించి ప్రసంగిస్తూ 'తదుపరి తరం' జిఎస్‌టి సంస్కరణలను ప్రకటించారు.

## బిజెపికి నైతికత లేదు

**(మొదటి పేజీ తరువాయి)**

అధికార పార్టీ అధికారంలో ఉండటానికి ఎంత అనైతికతకైనా వెళ్ళడానికి సిద్ధంగా ఉందని, ఎన్నికల్లో పెద్ద ఎత్తున అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయని ఆరోపించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పేరుతో ప్రతిపక్షాల ఓట్లను బహిరంగంగా తొలగిస్తున్నారని, బతికి ఉన్నవారిని చనిపోయినట్లు ప్రకటించారని, ఎవరి ఓట్లను, ఏ ప్రాతిపదికన తొలగిస్తున్నారో చెప్పడానికి ఎన్నికల కమిషన్ సిద్ధంగా లేకపోవడంతోనే దాని నిష్పాక్షికతను అర్థం చేసుకోవచ్చన్నారు. తొలగించిన ఓటర్ల జాబితాను బహిరంగపరచాలని ఎన్నికల కమిషన్‌ను ఆదేశించిన సుప్రీంకోర్టుకు తాము కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. అత్యంత ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే 65 లక్షల మంది ఓట్లను తొలగించేందుకు పాలక పార్టీకి ఎటువంటి అభ్యంతరం లేదన్నారు. ఈ కసరత్తు వల్ల ఎవరు ప్రయోజనం పొందారో స్పష్టంగా తెలుస్తుందన్నారు. ఇడి, సిబిఐ, ఆదాయపు పన్ను శాఖ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను ప్రత్యర్థులకు (ప్రతిపక్ష పార్టీలకు) వ్యతిరేకంగా రాజకీయ ప్రయోజనాల కోసం బహిరంగంగా ఉపయోగించుకున్నారని, దేశ సుప్రీంకోర్టు వారికి అద్దం చూపించాల్సి వచ్చిందని కాంగ్రెస్ చీఫ్ పేర్కొన్నారు. భారతదేశం తన అలైన్‌మెంట్ విధానం కారణంగా సంపాదించిన ప్రత్యేక స్థానాన్ని కోల్పోయిందని ఖర్గే పేర్కొన్నారు. ఈ దేశం కోసం స్వాతంత్ర్య వీరులు చూసిన కల నేడు మన నుండి దూరం అవుతోందన్నారు. భారత ప్రజాస్వామ్యానికి ఆధారం న్యాయమైన ఎన్నికలు అని కాంగ్రెస్ చీఫ్ పేర్కొంటూ, జూన్ 15, 1949న రాజ్యాంగ సభలో బిఆర్ అంబేద్కర్ 'ప్రజాస్వామ్యంలో ఫ్రాంచైజీ అత్యంత ప్రాథమికమైన విషయాలలో ఒకటి. ఓటర్ల జాబితాలోకి చేర్చబడే అర్హత ఉన్న ఏ వ్యక్తినీ... కేవలం పక్షపాతం ఫలితంగా మినహాయించకూడదు' అని చెప్పారని అన్నారు. 1947 ఆగస్టు 15న సాధించిన స్వాతంత్ర్య పోరాటంలో కాంగ్రెస్ పాత్ర గురించి మొత్తం ప్రపంచానికి తెలుసునని ఆయన అన్నారు. స్వాతంత్ర్య పోరాట కథ తమ పార్టీ కథ అని ఆయన అన్నారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య ఉద్యమంలో సహకరించిన, త్యాగాలు చేసిన గొప్ప వ్యక్తులకు నమస్కరిస్తున్నానన్నారు. స్వాతంత్ర్యానంతరం రెండున్నర సంవత్సరాలు అవిశ్రాంత కృషి తర్వాత భారతదేశానికి రాజ్యాంగాన్ని అందించామని, దీనిని బహుశా ప్రపంచంలోని ఏ ఇతర రాజ్యాంగ పత్రంతోనూ పోల్చలేమన్నారు. 'స్వాతంత్ర్యం తర్వాత ఎనిమిది దశాబ్దాల సుదీర్ఘ ప్రయాణంలో, కాంగ్రెస్ ప్రభుత్వాలు, మన దార్శనిక నాయకులు బలమైన భారత దేశానికి పునాది వేశారు' అని ఆయన అన్నారు. రాజ్యాంగాన్ని అత్యున్నతంగా ఉంచడం ద్వారా, ప్రజాస్వామ్య సృష్టిలో ప్రజలకు సమాన స్థానం కల్పించబడిందని, ధనిక, పేద, రాజు, పౌరులు, పురుషులు, మహిళలు, అందరికీ సమాన హక్కులు లభించాయని, 'ఒక వ్యక్తి, ఒక ఓటు, ఒక విలువ'' అని ఆయన అన్నారు.

## ఆర్‌ఎస్ఎస్‌కు ప్రధాని ప్రశంసలా?

**(మొదటి పేజీ తరువాయి)**

పుట్టించినందుకు వందేళ్ళ సందర్భంగా వారు బ్రిటీష్‌వారిని ప్రశంసించాల్సిందని సమాజ్‌వాదీ పార్టీ ఎద్దేవా చేసింది. ఆర్‌ఎస్ఎస్‌ను ప్రశంసించడం ద్వారా ప్రధాని మన అమరవీరుల స్మృతిని అగౌరవపరిచారని సిపిఐ(ఎం) విమర్శించింది. ఢిల్లీలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసిన అనంతరం ప్రధాని మోదీ ఎర్రకోట నుంచి ప్రసంగిస్తూ వందేళ్ల క్రితం పుట్టిన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్ఎస్) తన సేవలతో దేశం గర్వపడేలా చేసిందని, అది సువర్ణ అధ్యాయమని అన్నారు. స్వయం సేవకులు మాతృభూమి సేవలో తమ జీవితాలను అంకితం చేశారని, ఒక విధంగా ఆర్‌ఎస్ఎస్ ప్రపంచంలోనే అతి పెద్ద ఎన్‌జిఒ(స్వచ్ఛంద సంస్థ) అని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలపై విపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. ప్రధాని ప్రసంగంలో అత్యంత సమస్యాత్మకమైన అంశమేమిటంటే ఎర్రకోట నుంచి ఆర్‌ఎస్ఎస్ పేరు ను తీసుకోవడమని ఎఐసిసి ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ తన 'ఎక్స్' ఖాతాలో పేర్కొన్నారు. ఇది రాజ్యాంగ, లౌకిక స్ఫూర్తికి తీవ్ర విఘాతం కలిగించడమేనని అన్నారు. వచ్చే నెల తన 75వ జన్మదినం నేపథ్యంలో, తన పదవీ కాలాన్ని పెంచుకునేందుకు ఆర్‌ఎస్ఎస్‌ను సంతుష్టి చేసుకునే ప్రయత్నంలో భాగం చేసిన నిరుత్సాహపూరిత చర్య అని పేర్కొన్నారు. వందేళ్ళు పూర్తయిన సందర్భంగా ఆ సంస్థ వారు బ్రిటీషువారికి అభినందనలు చెప్పాలని, ఎందుకంటే భారత్‌ను మతాల ఆధారంగా విభజించేందుకు, హిందూ ముస్లింలలో అఘాతం సృష్టించేందుకు వారు కొన్ని సంస్థలను ఏర్పాటు చేసినట్లు తాను విన్నానని, అలాగే కొందరు చరిత్రకారులు కూడా ఇదే విధంగా రాసారని ఎస్‌పి అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ అన్నారు. మహాత్మాగాంధీ హత్య తరువాత ఆర్‌ఎస్ఎస్‌పై నిషేధం విధించారని, మతపరమైన అల్లర్లను ప్రేరేపించడంలో ఆ సంస్థ పాత్రను అనేక మంది చరిత్రకారులు లిఖించారని సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ అన్నారు. అలాంటి ఆర్‌ఎస్ఎస్‌ను ప్రధాని పొగడడం ద్వారా అమరుల జ్ఞాపకాలను అగౌరవపరిచారని, ఇది ఏ మాత్రం ఆమోద యోగ్యం కాదన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## పాకిస్తాన్ యువకుడి అరెస్టు



**ప్రజాపక్షం /హైదరాబాద్:**అక్రమంగా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న ఓ పాకిస్తానీ యువకుడు ఇక్కడి అమ్మాయిని ప్రేమ పేరుతో పెళ్లి చేసుకొని పేరు మార్చి పాకిస్తాన్ తీసుకువెళ్లే ప్రయత్నం చేసాడు. చివరి నిముషంలో పోలీసులకు దొరికిపోయి కటకటాల పాలయ్యాడు.

పాకిస్తాన్ కు చెందిన ఫహద్ అనే యువకుడు హైటెక్ సిటీలోని ఒక సిపాల్ కంపెనీలో పనిచేస్తూ, తన తోటి ఉద్యోగిని ప్రేమపేరుతో వివాహానికి ఒప్పించాడు. ఆమె పేరును మార్చి వివాహం చేసుకున్నాడు. అయితే ఇటీవల ఫహద్ మరో అమ్మాయిని పెళ్లి చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తుండగా ఆమె పోలీసులకు సమాచారం అందించింది. దీంతో ఆ ఇద్దరినీ బంజారాహిల్స్ పోలీసులు అరెస్ట్ చేసారు. కాగా ఫహద్ 1998లో పాకిస్థాన్ నుంచి భారత్‌కువచ్చి హైదరాబాద్‌లో స్థిరపడ్డాడు.

# రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు రాష్ట్ర రాజధాని నగరంలో ఘనంగా జరిగాయి. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో ఉత్సహాపూరిత వాతావరణంలో జెండా పండుగను నిర్వహించారు. విద్యా సంస్థలలో చిన్నారులతో స్వాతంత్ర్య దినోత్సవం కోలాహలంగా జరిగింది. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలతో పాటు కంటోన్మెంట్, గోల్కొండ ఆర్టిలరీలో ఆర్మీ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి. రాజకీయ పార్టీల, ప్రజాసంఘాల కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఎగురవేశారు. గోల్కొండ కోటలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించి, పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ జాతీయ జెండాను ఆవిష్కరించారు. శాసనసభ ఆవరణలో స్పీకర్ ప్రసాద్ కుమార్, శాసనమండలిలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిలు జాతీయ జెండాలను ఎగురవేశారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్, సిపిఐ కార్యాలయంలో పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, తెలంగాణ జన సమితి కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్, బిఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు, బిజెపి కార్యాలయంలో రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ ఒవైసీ, ఆయన సోదరుడు అక్బరుద్దీన్ ఒవైసీలు నగరంలోని పలు ప్రాంతాల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అసదుద్దీన్ ఒవైసీ 'ఎక్స్' వేదికగా దేశ ప్రజలకు 'యౌమ్ ఏ ఆజాదీ ముబారక్'అంటూ శుభాకాంక్షలు తెలిపారు. సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. బిసి కమిషన్ కార్యాలయంలో సభ్యులు రాపోలు జయప్రకాష్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మి , ప్రత్యేక అధికారి జి. సతీష్ కుమార్, డిప్యూటీ డైరెక్టర్ యు. శ్రీనివాస రావు పాల్గొన్నారు.

**పోలీసు శాఖలో..**

79వ స్వాతంత్ర దినోత్సవాల వేడుకల నేపథ్యంలో శుక్రవారం నాడు లక్డికాపూల్‌లోని తెలంగాణ డిజిపి కార్యాయలం, బంజారాహిల్స్‌లోని హైదరాబాద్ పోలీసు కమిషనర్ కార్యాలయం, అవినీతి నిరోధక శాఖ ప్రధాన కార్యాలయం, చంచల్‌గూడలోని జైళ్ల శాఖ కార్యాలయం, బేగంపేట్‌లోని ఎస్ఐబి కార్యాలయం, ఇంటెలిజెన్స్ కార్యాలయం, సిఐడి కార్యాలయాలం, బషీర్‌బాగ్‌లోని సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్, సిసిఎస్, పబ్లిక్ గార్డెన్ ఎదురుగా ఉన్న భరోసా సెంటర్, చంచల్‌గూడ మహిళా జైలు, పురుష జైలులో సంబంధిత అధికారులు జాతీయ జెండాను ఎగురవేసి ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు.

**స్పోర్ట్స్ అథారిటీ కార్యాలయంలో...**

ఎల్‌బిస్టేడియంలోని స్పోర్ట్స్ అథారిటీ కార్యాలయంలో ఛైర్మన్ శివసేనారెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో స్పోరట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్లు, కార్యాలయ సిబ్బంది కోచ్‌లు నాలుగవ తరగతి సిబ్బంది క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు



**అరణ్యభవన్‌లో...**



అరణ్యభవన్‌లోని అటవీశాఖ ప్రధాన కార్యాలయంలో అటవీ దళాల ప్రధాన సంరక్షిణాధికారి ణి డాక్టర్ సువర్ణ జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమం లో పిసిసిఎఫ్‌తో పాటు సీనియర్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

**రైల్ నిలయంలో..**

సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దక్షిణ మధ్య రైల్వే సెలవు దినాల్లో ప్రయాణికుల అదనపు రద్దీని తగ్గించడానికి 1,117 ప్రత్యేక రైలుసర్వీసులను నడిపిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు సత్యప్రకాష్, ఆరోమా సింగ్ ఠాకూర్‌తో పాటు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. లాలాగూడ సెంట్రల్ ఆసుపత్రిలో దక్షిణ మధ్య రైల్వే మహిళా సంక్షేమ సంస్థ అధ్యక్షురాలు వందన శ్రీవాస్తవ జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా రోగులకు పండ్లు పంపిణి చేశారు.







**ఎక్సైజ్ కార్యాలయంలో...**

79వ స్వాతంత్ర వేడుకల సందర్భంగా నాంపల్లిలోని ఎక్సైజ్ కార్యాలయంలో ఎక్సైజ్ కమిషనర్ సి.హరికిరణ్ జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు రాథోడ్ సురేష్, పి.దశరథ్, అనీల్‌కుమార్‌రెడ్డి, వెంకటేశ్వరబాబు, ఆర్.కిషన్, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**పర్యాటక సంస్థలో...**



హిమాయత్‌నగర్‌లోని తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ కార్యాలయంలో టిజిటిడిసి ఎండి ఎ.క్రాంతి జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమం లో టూరిజం శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# రైతాంగాన్ని ఆదుకోవాలి

### సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఈ మధ్యలో కురిసిన అకాల వర్షాలతో అనేక ప్రాంతాల్లో రైతులు తీవ్రంగా నష్టపోయారని వారందరినీ ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని, ఇండ్లు కూలిపోయిన వారందరికీ ఇందిరమ్మ ఇల్లు వెంటనే మంజూరు చేయాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు, మాజీ శాసనసభ్యులు పల్లా వెంకట్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి పల్లా వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఈనెల 20 నుండి 22వ తేదీ వరకు మల్కాజ్‌గిరి జిల్లా గాజులరామారంలో సిపిఐ తెలంగాణ రాష్ట్ర మహాసభలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ మహాసభలకు ఎన్నికైన ప్రతినిధులు అందరూ హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ మహాసభలలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు అమలు తీరును చర్చించుకొని భవిష్యత్తు పోరాట కార్యక్రమాలు రూపొందించడం జరుగుతుందని ఆయన అన్నారు. దేశంలో సిపిఐ వందేళ్ళ ప్రస్థానంతో కార్మికులు కర్షకులు అణగారిన వర్గాల ప్రజలతో కోసం అనేక సమరశీల పోరాటాలు నిర్వహించిన ఘనమైన చరిత్ర ఉందన్నారు. రైతులకు సరిపడా యూరియాను ప్రభుత్వం సరఫరా చేయాలని, అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు, పెన్షన్ లను వెంటనే మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోద శ్రీరాములు, జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శిలు బోలగాని సత్యనారాయణ, చేడే చంద్రయ్య, కార్యవర్గ సభ్యులు కురిమిద్ద శ్రీనివాస్, బండి జంగమ్మ, కొల్లూరి రాజయ్య, కళ్లెం కృష్ణ, ఎండీ ఇమ్రాన్, బచ్చనగొని గాలయ్య, చేక్క వెంకటేష్, బోడ సుదర్శన్, ఉప్పల ముత్యాలు, కుసుమని హరిచంద్ర, ఏశాల అశోక్, పల్లె శేఖర్ రెడ్డి, చిగుర్ల లింగం, పెరబోయిన మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

## డిజిపి జితేందర్‌కు మాతృవియోగం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర డిజిపి డాక్టర్ జితేందర్‌కు మాతృవియోగం కలిగింది. జితేందర్ తల్లి కృష్ణ గోయల్(85) శుక్రవారం ఉదయం కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న కృష్ణ గోయల్.. హైదరాబాద్ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. రేపు ఉదయం మహాప్రస్థానంలో డిజిపి తల్లి అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

**సిఎం సంతాపం..** డిజిపి జితేందర్ తల్లి కృష్ణ గోయల్ మృతిపట్ల ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రఘాడ సంతాపాన్ని తెలియజేశారు. జితేందర్ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అలాగే మంత్రులు, ఐపిఎస్, ఎఐఎస్ అధికారులు, టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ కూడా కృష్ణ గోయల్ మృతి పట్ల సంతాపం తెలియజేశారు. జితేందర్ కుటుంబానికి ఇది తీరని లోటని. ఈ క్లిష్ట సమయంలో వారి తల్లి ఆత్మకు దేవుడు శాంతి ప్రసాదించి, కుటుంబ సభ్యులకు ధైర్యం ఇవ్వాలని వారు ప్రార్థించారు.



## సిపిఐ గద్వాల జిల్లా కార్యదర్శిగా మరోసారి ఆంజనేయులు

**గద్వాల :** సిపిఐ జోగులాంబ గద్వాల జిల్లా కార్యదర్శిగా బి. ఆంజనేయులు మరోసారి ఎన్నికయ్యారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులుగా పెద్దబాబు, ఆశన్న, రంగన్న, బతుకన్న, కృష్ణలను, కౌన్సిల్ సభ్యులను 15 మందిని ఎన్నుకున్నారు. జిల్లా 3వ మహాసభలు వాల్మీకి భవన్ నల్లకుంట గద్వాల పట్టణంలో జరిగాయి.

# స్వాతంత్రాన్ని నిలబెట్టుకోవడం గర్వకారణమైన చరిత్ర

### స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సిఆర్ ఫౌండేషన్ కార్యదర్శి పిజె. చంద్రశేఖరరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్/శేరిలింగంపల్లి :** అనేక సమస్యలను అధిగమించి సాధించుకున్న దేశ స్వాతంత్రాన్ని నిలబెట్టుకోవడం మన అందరికీ గర్వ కారణమైన ఓ చరిత్ర అని సిఆర్ ఫౌండేషన్ కార్యదర్శి, మాజీ ఎంఎల్ సి పి.జే. చంద్రశేఖరరావు అన్నారు. హైదరాబాద్ కొండాపూర్‌లోని చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్‌లో శుక్రవారం 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పి.జె. చంద్రశేఖరరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. సిఆర్ ఫౌండేషన్ కోశాధికారి, వృద్ధాశ్రమం డైరెక్టర్ వి.చెన్నకేశవరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి పి.జె.చంద్రశేఖరరావు, మహిళ సంక్షేమ కేంద్రం కమిటీ డైరెక్టర్ జోస్యభట్ల కల్పన , సిఆర్ పాలీ క్లినిక్ డైరెక్టర్ డాక్టర్ కె.రజని పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా పిజె. చంద్రశేఖర రావు మాట్లాడుతూ మన దేశంలో కంటే తర్వాత స్వాతంత్ర్యం సాధించుకున్న అనేక దేశాలు మనకంటే వనరులు తక్కువగా ఉన్నా, సమశీతోష్ణం లేకపోయినా ఆర్థికాభివృద్ధిలో, జీవన ప్రమాణాల్లో ఎంతో ముందంజలో ఉన్నాయన్నా రు. ఆ దేశాలను చూసి మన పాలకులు గుణ పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరముందని ఆయన పేర్కొన్నారు. జోస్యభట్ల కల్పన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చినప్ప టీ నుంచి ఇప్పటీ వరకు మహిళలు అనేక సమస్యలను ఎదుర్కొంటునే ఉన్నారని అన్నారు. డాక్టర్ రజని మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నప్పటికీ సాధించుకోవాల్సింది , తెలుసుకోవాల్సింది ఎంతో ఉందన్నారు. ఇందుకు మహిళలు బయట ప్రపంచాన్ని ఎప్పటికప్పుడు అంచన వే స్తూ అందుకు అనుగుణంగా ఉద్యమించాలని సూచించారు. విద్యార్థినులు చదువులపై దృష్టిని కేంద్రీకరించి మరి న్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

**సీనియర్ సంపాదకులు ఎబికె ప్రసాద్‌కు ఘన సన్మానం :** గత రెండున్న దశాబ్దాలుగా సిఆర్ ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో నివసిస్తున్న సీనియర్ సంపాదకులు ఎబికె ప్రసాద్ 90వ జన్మదినోత్సవం సందర్భంగా సిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ సైంటిస్ట్ వృద్ధాశ్రమ వాసి మల్లంపాటి వెంకటేశ్వరరావు ఎబికె ప్రసాదరావు పై రాసిన కవితను చదివి ఆయనకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు అరుట్ల మమత, లలిత, సలహామండలి సభ్యులు డాక్టర్ మండవ గోపిచంద్, రాజేందర్‌రావు, తమ్మారెడ్డి తాన్యా, వృద్ధాశ్రమవాసులు రామకృష్ణారెడ్డి, రాజేశ్వరి, మహిళా సంక్షేమ కేంద్రం విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.






### స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితో

# కార్మిక హక్కులకోసం పోరాటం

### ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారతదేశ స్వాతంత్ర్యం ఎంతోమంది త్యాగాల ఫలితమని, ఆ స్ఫూర్తితో కార్మిక హక్కుల సాధనకు కార్మికవర్గం పోరాటాన్ని కొనసాగించాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాల్‌రాజ్ పిలుపునిచ్చారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా హిమాయత్ నగర్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఎటువంటి పాత్రలేని ఆర్ఎస్ఎస్, బిజెపి దేశభక్తి గురించి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. ప్రస్తుత బిజెపి ప్రభుత్వం దేశ సంపదను పెట్టుబడిదారులకు అప్పగిస్తూ దేశద్రోహానికి పాల్పడుతోందని మండిపడ్డారు.

కార్మిక, రైతు చట్టాలను మార్పు చేయడం అందులో భాగమేనని అన్నారు. బడా పారిశ్రామికవేత్తల కోసం కార్మికుల, రైతుల శ్రమను దోచుకునేందుకు చట్టాల్లో మార్పులు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారని, ఈ ప్రయత్నాలకు వ్యతిరేకంగా కార్మిక, రైతాంగ వర్గాలు మరో సమ్మెకు సిద్ధమవుతున్నాయని బాలరాజ్ తెలిపారు. విదేశీ పెట్టుబడిదారుల నుండి దేశాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం. నరసింహ, ఉపాధ్యక్షురాలు పి.ప్రేమ్ పావని, కార్యదర్శి బి. వెంకటేశం, సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎన్.కరుణ కుమారి, ఎఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్. శ్రీకాంత్, ఎఐటియుసి నాయకులు ఎస్. రాజమౌళి, కార్యాలయ కార్యదర్శి జె.వి. కృష్ణ పాల్గొన్నారు.

### వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై

# ఘోర రోడ్డు ప్రమాదం

* రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన లారీ–బస్సు
* 30 మంది ప్రయాణికులకు గాయాలు

**ప్రజాపక్షం/రాయపర్తి:** వరంగల్ జిల్లా రాయపర్తి మండలలం మైలారం గ్రామ శివారు వరంగల్..ఖమ్మం జాతీయ రహదారిపై శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న ఖమ్మం డిపోకు చెందిన ఆర్టీసీ బస్‌ను ఖమ్మం నుంచి వరంగల్ వైపు వెళ్తున్న కంటైనర్ లారీ అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్ డ్రైవర్, కండక్టర్‌తో సహా బస్సులో ప్రయాణిస్తున్న సుమారు 30 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. కాగా బస్సులో సుమారు 44 మందికి పైగా ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. బస్‌ను కంటైనర్ లారీ బలంగా ఢీకొట్టడంతో లారీ డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. క్యాబిన్‌లో ఇరుకున్న డ్రైవర్‌ను పోలీసులు జేసీబీ సాయంతో బయటకు తీసి అంబులెన్స్‌లో హాస్పిటల్‌కు తరలించారు. సంఘటనా స్థలం దగ్గర ట్రాఫిక్ జామ్ అయింది. సుమారు మూడు కిలోమీటర్ల మేర రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న ఎస్సై రాజేందర్ ఆధ్వర్యంలో క్షతగాత్రులను అంబులెన్స్‌లో వర్ధన్నపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో గాయపడిన బస్ డ్రైవర్ కృష్ణయ్య చికిత్స పొందుతూ మృతిచెందినట్లు సమాచారం. ఘటనా స్థలాన్ని జనగా డీసీపీ రాజమహేంద్రనాయక్, వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య, సీఐ శ్రీనివాసరావులు పరిశీలించారు.



**సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే**

ఆర్టీసీ బస్‌ను కంటైనర్ లారీ ఢీకొట్టడంతో ప్రయాణికులు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝూన్సీరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని వర్ధన్నపేట హాస్పిటల్ సూపరింటెండెంట్‌కు సూచించారు.

# 13 జిల్లా కోర్టులకు రూ.1053కోట్లు మంజూరు

### మిగిలిన జిల్లాలకు రూ.891 కోట్లకు ప్రతిపాదనలు

### వెల్లడించిన హైకోర్టు సిజె జస్టిస్ ఎకె సింగ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :**రాష్ట్రంలోని 13జిల్లా కోర్టులకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 1053 కోట్లకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసిందని, మిగిలిన జిల్లాలకు రూ.891 కోట్లకు హైకోర్టు చేసిన ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఏకే సింగ్ ప్రకటించారు. జనగాం, జయశంకర్ భూపాలపల్లి, జోగులాంబ గద్వాల్, కరీంనగర్, మహబూబ్‌నగర్, మంచిర్యాల, ములుగు, నిర్మల్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, వనపర్తి, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో కోర్టు సముదాయాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.1,053 కోట్ల పరిపాలనా అనుమతి మంజూరు చేసిందన్నారు. మిగిలిన జిల్లాలకు రూ.891 కోట్లకు ప్రతిపాదనలకు ఆమోదం లభించాల్సి వుందన్నారు.

హైకోర్టు, జిల్లా కోర్టు ల్లో మౌలిక వసతుల కల్పనకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ప్రకటించారు. దేశ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం హైకోర్టు ఆవరణలో ఆయన జాతీయ జెండాను ఎగురవేశారు.



అనంతరం జరిగిన సమావేశంలో ప్రసంగిస్తూ, ఎంతోమంది మహానుభావుల త్యాగాల ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం లభించిందన్నారు. గత ఏడాదిలో 210 రోజులు కోర్టులు పనిచేస్తే 74,768 కేసులు నమో దు అయ్యాయని, 72,414 కేసులు పరిష్కారం అయ్యాయని చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పులు 3,500, హైకోర్టు తీర్పులు 2 వేలు తెలుగులోకి అనువాదం చేయించినట్లు చెప్పారు. జాతీయ లోక్ అదాలత్‌లో 55,20,379 కేసులు పరిష్కారంతో కక్షిదారులకు రూ.236కోట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. రెగ్యులర్ అదాలత్‌లోనూ 59,310 కేసులు పరిష్కరం కావడంతో రూ.207.98కోట్లు అందజేసినట్లు వివరించారు. అన్ని జిల్లాల్లో ఒకే రకంగా కోర్టు నిర్మాణం కోసం సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం 'న్యాయ నిర్మాణ్'ను అనుసరిస్తున్నామని చెప్పారు ఫ్యామిలీ, పోక్సో కోర్టులతో పాటు దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్ల కోసం ప్రత్యేక ఏర్పాట్లున్నాయని వివరించారు. .

ఎజి ఎ.సుదర్శన్‌రెడ్డి, బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నరసింహారెడ్డి, హైకోర్టు అడ్వొకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.జగన్ మాట్లాడారు. హైకోర్టు న్యాయమూర్తులు, రిజిస్ట్రార్లు, మాజీ న్యాయమూర్తులు జస్టిస్ చల్లా కోదండరామ్, జస్టిస్ జి.రఘురామ్, జస్టిస్ సీవీ రాములు, జస్టిస్ భిక్షపతి, జస్టిస్ జి.యతిరాజు, జస్టిస్ రవికుమార్, జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి, జస్టిస్ గోపాల్‌రెడ్డి ఇతరులు పాల్గొన్నారు.

# డెంగీతో బాలిక మృతి



**ప్రజాపక్షం / వేలేరు :** వేలేరు మండలకేంద్రానికి చెందిన సూత్రపు శాన్వి 7 సంవత్సరాల బాలిక శుక్రవారం హనుమకొండలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిందని తల్లి శృతి,తండ్రి రమేష్, గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తుల వివరాలప్రకారం చిన్నారి శాన్వి గత నాలుగు రోజుల క్రితం అనారోగ్యానికి గురికావడం వలన హనుమకొండలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు చికిత్స నిమిత్తం తీసుకెల్లగా డెంగీ ఫీవర్ వచ్చిందని డెంగీ ఫీవర్‌తోనే చిన్నారి శాన్వి మృతిచెందిందని తెలిపారు.

కాగా హనుమకొండ జిల్లా వైద్యాధికారి డా.అప్పయ్యను,వేలేరు పిహెచ్‌సి వైద్యురాలు డా.మేఘనను చరవాణిలో సంప్రదించ గా వేలేరు మండల కేంద్రం నుండి డెంగీ ఫీవర్‌తో చిన్నారి శాన్వి మృతిచెందినట్టుగా అధికారిక సమాచారం రాలేదని వర్షాలు కురుస్తున్న సందర్భంగా సీజనల్ వ్యాధులు సంభవించే అవకాశాలు ఉన్నందున మండల ప్రజలు తగుజాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ రోజున ప్రజలందరిపై శ్రీకృష్ణుడి కృపా కటాక్షాలు ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ మానవ జీవితంలో భగవద్గీత బోధనలు ఎంతో ప్రభావశీలమైనవని అన్నారు. మానవుడి ప్రతి దశలోనూ శ్రీకృష్ణుడు కొలువై ఉంటారని ఆయన అన్నారు.

శ్రీ మహావిష్ణువు దశావతారాలలో శ్రీకృష్ణావతారం చాలా ప్రత్యేకమైనదని తెలిపారు. దుష్ట సంహారం కోసం మానవుడిగా జన్మించిన కృష్ణ భగవానుడు మానవాళికి ఎంతో అవసరమైన భగవద్గీతను బోధించారని ముఖ్యమంత్రి తెలిపారు. శ్రీకృష్ణ తత్వాన్ని సరిగ్గా అర్థం చేసుకుంటే ప్రతి పనిలో విజయం సాధించవచ్చని అన్నారు.

## తెలంగాణ కంపెనీని ఎపికి తరలించిన కేంద్రం

### ఎఐసిసి ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్



**న్యూఢిల్లీ :** తెలంగాణలో సెమీ కండక్టర్ ప్రాజెక్టు కోసం దరఖాస్తు చేసుకున్న ప్రముఖ సంస్థకు ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్‌కు తరలించాలనే షరతుతో ఆమోదం తెలిపినట్లు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జై రామ్ రమేశ్ ఆరోపించారు. ఇటీవల కేంద్ర క్యాబినెట్ సమావేశంలో దేశంలో 4 సెమీ కండక్టర్‌ల తయారీ కేంద్రాల ఆమోదంపై ఆయన గురువారం తన 'ఎక్స్' ఖాతాలో స్పందించారు. 'మోదీ ప్రభుత్వం దేశంలో 4 సెమీకండక్టర్ల తయారీ ప్రాజెక్టులకు పచ్చజెండా ఊపింది. సమగ్రమైన హోమ్ వర్క్ చేసిన తర్వాత, ఒక ప్రముఖ ప్రైవేట్ సంస్థ తెలంగాణలో ఒక ప్రాజెక్టు కోసం దరఖాస్తు చేసుకుంది. అయితే, ఆంధ్రప్రదేశ్‌కు మారాలనే షరతుతో ఆమోదం లభించింది'' అని జైరామ్ రమేశ్ పేర్కొన్నారు. ''ఇంతకుముందు కూడా ఇలాంటి స్థల మార్పిడిలు బలవంతంగా జరిగాయి. రెండు సెమీకండక్టర్ల తయారీ ప్రాజెక్టులు తమ ప్రతిపాదిత స్థలాలను తెలంగాణ నుంచి గుజరాత్‌కు మార్చుకోవలసి వచ్చింది. అదేవిధంగా, తమిళనాడులో ఏర్పాటు చేయాలనుకున్న మరో కర్మాగారానికి గుజరాత్‌కు మారాలనే షరతుతో అనుమతి లభించింది'' అని 'ఎక్స్' పోస్ట్‌లో వివరించారు.''ఇక దీని గురించి ఇంకా చెప్పాల్సిన అవసరం ఉందా? భారతదేశాన్ని బలోపేతం చేసేందుకు రాష్ట్రాల మధ్య పోటీ ఉండాలని ప్రధాని చెబుతారు. కానీ అంపైర్ ఇంత బహిరంగంగా పక్షపాతంగా వ్యవహరిస్తే, ఆ పోటీ ఒక ప్రహసనంగా మారిపోతుంది'' అంటూ ముఖ్తాయించారు.



## చెత్త తొలగించిన హైడ్రా

ప్రజాపక్షం/హైదరాబాద్ : హిమాయత్‌సాగర్ నుంచి నీటిని విడుదల చేయడంతో మూసీ నదిలో ప్రవాహం పెరిగింది. ఈ నేపథ్యంలో వరదతో పాటు కొట్టుకొచ్చిన చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు మూసారాంబాగ్ వంతెన దగ్గర అడ్డుపడ్డాయి. దీంతో నది ప్రవాహానికి తీవ్ర ఆటంకం ఏర్పడింది. దీని ఫలితంగా చాదర్‌ఘాట్, మూసారాంబాగ్, శంకర్‌నగర్, మూసానగర్, రసూల్‌పుర బస్తీల్లోకి వరదనీరు పోటెత్తింది. ప్రవాహానికి అడ్డంకులను తొలగించడానికి హైడ్రా చర్యలు చేపట్టింది. మూసారాంబాగ్ వంతెన దగ్గర పేరుకుపోయిన గుర్రపు డెక్క, గడ్డి, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించే పనులను చేపట్టింది. రెండు జెసిబిలు, టిప్పర్ల సహాయంతో చెత్తను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారు. దీంతో వరద సాఫీగా ముందుకు సాగుతోంది. ఈ పనుల్లో హైడ్రా ఎస్‌ఎఫ్‌ఓ శ్రీనివాస్ నేతృత్వంలో డిఆర్‌ఎఫ్ బృందాలు, జిహెచ్‌ఎంసి సిబ్బంది పాల్గొన్నారు.

## మెట్రో రైల్‌భవన్‌లో జాతీయ పతాకం ఎగురవేసిన ఎన్‌విఎస్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్ : హైదరాబాద్ మెట్రో రైల్ భవన్ లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఎం.డి. ఎన్‌విఎస్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా అభివృద్ధి చేయాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టిలో మెట్రో ఫేజ్2 ప్రాజెక్ట్ కీలక భాగమని ఎన్‌విఎస్ రెడ్డి అన్నారు. ఫేజ్2కు అవసరమైన అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభించేందుకు, అన్ని ప్రాథమిక పనులను వేగంగా పూర్తి చేయాలని మెట్రో అధికారులను ఆయన కోరారు. పాతబస్తీలో మెట్రో కారిడార్ విస్తరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, త్వరలో టెండర్లు ఆహ్వానించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ఆధునిక సాంకేతికతను వినియోగించి ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు.

## ఎన్నికల సంఘానికి, ఓట్ల గల్లంతుకు ఎటువంటి సంబంధమూ లేదు

### కేంద్ర మంత్రి బండి సంజయ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఓట్ల గల్లంతు విషయంలో ఎన్నికల సంఘానికి, బిజెపికి, ప్రధాని మోదీకి ఎలాంటి సంబంధం లేదని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఓట్ల గల్లంతుపైన ఫిర్యాదు చేస్తే ఇసి(ఎన్నికల కమిషన్) తప్పకుండా చర్యలు తీసుకుంటుందన్నారు. హైదరాబాద్‌లోని కోట్ల విజయ భాస్కర్ రెడ్డి స్టేడియం వద్ద బిజెపి ఖైరతాబాద్ అధ్యక్షుడు లంకల దీపక్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన త్రివర్ణ పతాక ర్యాలీని కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ 'మార్వాడీలు గో బ్యాక్' అనేది కొంత మంది కమ్యూనిస్టులు, కాంగ్రెస్, బిఆర్‌ఎస్, ఎంఐఎం పార్టీలు కలిసి ఆడుతున్న నాటకమని ఆరోపించారు. గుజరాతీలు, మార్వాడీలు రాష్ట్ర సంపదను దోచుకోవడానికి రాలేదని, వ్యాపారాలు చేసుకుని, రాష్ట్ర సంపదను పెంచేందుకు వస్తున్నారని వివరించారు. మైనార్టీలు అన్ని వృత్తుల్లోని బిసిల పొట్ట కొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## జన్మాష్టమిన 5252 నైవేద్యాలు



**హైదరాబాద్ :** ఇస్కాన్ సిడిఇసి తెల్లాపూర్ ఆధ్వర్యంలో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి మహోత్సవాలను పిఎంజి ఫార్మ్‌హౌస్‌లో ఘనంగా నిర్వహించనున్నారు. వేదికను బృందావనాన్ని తలపించేలా వివిధ లీలా స్థలులతో అలంకరించారు. శ్రీకృష్ణుడి 5252వ అవతార దినోత్సవం సందర్భంగా 5252 నైవేద్యాలు సమర్పించనున్నారు. కాగా, మధ్యాహ్నం 2 గంటలకు పిల్లల పోటీలు పాట, నృత్యం, కలరింగ్, ఫ్యాన్సీ డ్రెస్, శ్లోక పఠనంతో కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. సాయంత్రం 5:30కు సాంస్కృతిక ప్రదర్శనలు, రాత్రి 8 గంటలకు కథాకీర్తన, రాత్రి 9 గంటలకు మహాభిషేకం జరగనుంది. రాత్రి 10 గంటలకు ప్రత్యేక దర్శనం, రాత్రి 12 గంటలకు మహా ప్రసాదం అందజేయనున్నారు.

# పాలనలో పారదర్శకత ఉంటే అభివృద్ధి పరుగులు

### ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాల్లో పారదర్శకత ఉండాలి
### సమాజ శ్రేయస్సు కోసమే ఆలోచిస్తా
### 'ప్రాపర్టీ షో' ప్రారంభోత్సవంలో సిఎం రేవంత్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాల్లో పారదర్శకత ఉండాలని, పాలనలో పారదర్శకత ఉంటే అభివృద్ధి పరుగులు పెడుతుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. తాను ఒక సగటు మధ్యతరగతి ఆలోచనలు కలిగిన ముఖ్యమంత్రిని అని, సంపదను కొల్లగొట్టి విదేశాలకు తరలించుకుపోవాలన్న విశాల దృక్పథం ఉన్న వ్యక్తిని కాదని, సమాజ శ్రేయస్సు కోసమే తాను ఆలోచిస్తానని తెలిపారు. హైదరాబాద్‌లో వ్యాపారం, స్థిరాస్తి రంగానికి ఎన్నో అనుకూలతలు ఉన్నాయన్నారు. హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో శుక్రవారం ఏర్పాటు చేసిన క్రెడాయ్ హైదరాబాద్ 'ప్రాపర్టీ షో'ను సిఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ పాలకులు మారినా పాలసీ పెరాలసిస్ లేకుండా చూడటం వల్లనే మనం ప్రపంచంతో పోటీ పడగలుగుతున్నామన్నారు. అపోహలను, అనుమానాలను దాటుకుని తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నామన్నారు. ప్రభుత్వం పాలసీ, నిర్మాణం రెండూ రాష్ట్ర అభివృద్ధికి గ్రోత్ ఇంజన్స్ లాంటివని,నాయకుల మధ్య ఉన్న భిన్నాభిప్రాయాలు కొంతకాలం ఇలాంటి అనుమానాలు, అపోహలకు తావిస్తుందని చెప్పారు. పారదర్శక విధానంలో ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధికి సహకరించేందుకు తనకు ఎటువంటి అభ్యంతరాలూ లేవన్నారు. కేంద్ర మంత్రి జైపాల్ రెడ్డి చొరవతోనే హైదరాబాద్ నగరానికి మెట్రోరైట్ వచ్చిందన్నారు. జనసాంద్రత ఉన్న ప్రాంతాల్లో మల్టీ యూనిట్ ఉండే ట్రాన్స్‌పోర్టేషన్ ఉండాలని, లాస్ట్ మైల్ కనెక్టివిటీ చేయడానికి తాను శాయశక్తులా ప్రయత్నిస్తున్నానని అన్నారు. శామీర్‌పేట, మేడ్చల్ వరకు మెట్రోరైట్‌ను విస్తరించేందుకు కృషి చేస్తున్నామని, నగర ప్రతిష్ట పెంచడానికే తమ ప్రయత్నం అని అన్నారు. మాటిమాటికీ ఢిల్లీకి వెళుతున్నారని కొందరు మాట్లాడు తున్నారని, కానీ మెట్రో,మూసీ, ఇతర అనుమతులు ఇవ్వాల్సింది కేంద్ర ప్రభుత్వమేనని, ఆ కేంద్ర ప్రభుత్వం ఢిల్లీలో ఉంటే, అక్కడికి కాకుండా ఇంకా ఎక్కడికి వెళ్తారని సిఎం ప్రశ్నించారు. ఢిల్లీలో ముఖ్యమంత్రికి బంగళా ఇచ్చింది నెలకు నాలుగురోజులు వెళ్లి కేంద్రంతో అనుమతులు తెచ్చుకోవడానికేనని అన్నారు. అంతే కానీ ఆబంగళాను ఫామ్ హౌస్ తరహా వాడుకుని దావత్‌లు చేసుకునేందుకు కాదని ఎద్దేవా చేశారు. శతాబ్దాలుగా సాగిన హైదరాబాద్ అభివృద్ధిలో ఎంతోమంది పాత్ర ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిని పనంగా పెట్టే ఎటువంటి నిర్ణయాలను కూడా ఈ ప్రభుత్వం తీసుకోబోదని స్పష్టం చేశారు. పెట్టుబడులకు రక్షణ కల్పించడంతో పాటు లాభాలు వచ్చేలా ప్రోత్సహించే బాధ్యత తనదేనని సిఎం హామీనిచ్చారు.

చార్మినార్‌ను కులీ కుతుబ్ షా నిర్మిస్తే, ఔటర్ రింగ్ రోడ్డును దివంగత సిఎం వైఎస్ఆర్, హైటెక్ సిటీని చంద్రబాబు నాయుడు అభివృద్ధి చేశారని వివరించారు. తనకు వేరే కోరికలు ఏమీ లేవని, హైదరాబాద్‌ను గొప్ప నగరంగా తీర్చిదిద్దుతామని, భవిష్యత్‌లో వందేళ్లు, వెయ్యేళ్లు చెప్పుకునే విధంగా నగరాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. తనకు తెలంగాణను అభివృద్ధి చేయాలనే చిత్తశుద్ధి, తపన ఉన్నదని, అందుకు తనకు వయసు, ఓపిక రెండూ ఉన్నాయని వివరించారు. రీజనల్ రింగ్ రోడ్డు, రిజనల్ రింగ్ రోడ్డు రైలు రింగ్ కోసం కృషి చేస్తున్నామన్నారు.

**పాజిటీవ్‌పైనే 'రియల్' వ్యాపారం ఆధారం**

భూమి ఒక సెంటిమెంట్ అని, ఆ సెంటిమెంట్‌ను ఎంత పాజిటివ్‌గా ముందుకు తీసుకెళ్తారనేదని అంశంపైనే రియల్ ఎస్టేట్ వ్యాపారం ఆధారపడి ఉంటుందని సిఎం రేవంత్ రెడ్డి సూచించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి తాము ప్రణాళికలను సిద్ధం చేస్తామని, వాటిని ప్రమోట్ చేసి, ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత రియల్ ఎస్టేట్ వ్యాపారులపైనే ఉందన్నారు. రాజకీయ నాయకులు సృష్టించే అపోహలకు 'మీరు' ఊతం ఇస్తే నష్టపోయేది 'మీరే'నని అన్నారు. ఇతర దేశాల ప్రతినిధులను ఇక్కడ పెట్టుబడులకు ఆహ్వానించే తాము, ఇక్కడే ఉన్న 'మిమ్మల్ని' ఎందుకు వదులుకుంటామని ప్రశ్నించారు. పెట్టుబడుల విషయంలో 'మీకే' తమ మొదటి ప్రాధాన్యత అని ఇస్తామన్నారు.

**త్వరలోనే 'హైదరాబాద్ అమరాతి డ్రై పోర్ట్'కు అనుమతి**

హైదరాబాద్ అమరావతి గ్రీన్ ఫీల్డ్ హైవేలో డ్రై పోర్టు ఏర్పాటు చేయబోతున్నామని, దీనికి సంబంధించి కేంద్రానికి ప్రతిపాదనలు పంపించామని, త్వరలోనే అనుమతులు రాబోతున్నాయని సిఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రాన్ని కోర్ అర్బన్, సెమీ అర్బన్, రూరల్‌గా విభజించి అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. నాలాల ఆక్రమణలను తొలగిస్తే ఒక పెద్దమనిషి సోషల్ మీడియా ద్వారా తమపైన దుష్ప్రచారం చేస్తున్నారని, దీనికి 'మీరు' మద్దతుగా నిలిస్తే 'మీకే' నష్టమని సూచించారు.

# హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దుతాం



### గ్రేటర్ హైదరాబాద్ నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శనంలో గ్రేటర్ హైదరాబాద్‌ను ప్రపంచంలోనే అత్యున్నత స్థాయి నగరంగా తీర్చిదిద్దుతున్నామని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో ఆమె జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరాభివృద్ధికి చేపట్టిన అనేక కార్యక్రమాలను, జిహెచ్‌ఎంసి అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఈ వేడుకల్లో కమిషనర్ ఆర్.వి.కర్ణన్, అదనపు కమిషనర్లు సి.ఎన్. రఘుప్రసాద్, వేణుగోపాల్, సుభద్రదేవి, ఎస్.పంకజ, చీఫ్ సిటీప్లానర్ కె. శ్రీనివాస్, విజిలెన్స్ అదనపు ఎస్‌పి సుదర్శన్, ముఖ్యవైద్యాధికారి డాక్టర్ పద్మజ, చీఫ్ ఇంజనీర్ (నిర్వహణ) సహదేవ్ రత్నాకర్, అదనపు చీఫ్ సిటీప్లానర్లు ప్రదీప్ కుమార్, గంగాధర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు. మేయర్ మహిళా స్వయం సహాయక సంఘాలు, ట్రాన్స్‌జెండర్‌లకు రూ. 290 కోట్ల విలువైన రుణాలను పంపిణీ చేశారు. 155 మంది ట్రాన్స్‌జెండర్‌లకు రూ. 55 లక్షలు అందజేశారు. జిహెచ్‌ఎంసి ఆధ్వర్యంలో గ్రాఫిక్ డిజైనింగ్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న నలుగురు ట్రాన్స్‌జెండర్‌లు, మధురాజ్, ఇమ్రాన్ ఖాన్, నవీనా, వరుణ్ తేజ్‌లకు రేడ్ టివిలో ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. జిహెచ్‌ఎంసి నిర్వహించిన డ్రైవింగ్ శిక్షణ కేంద్రంలో శిక్షణ పూర్తి చేసుకున్న ఐదుగురు మహిళలకు లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్సులను అందజేశారు.



జలమండలిలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో ఎం.డి.అశోక్ రెడ్డి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు.



స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా దోమల్‌గూడ నగర పార్టీ కార్యాలయంలో టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజక వర్గ అధ్యక్షులు సాయిబాబా జాతీయ జెండాను ఆవిష్కరించారు.



రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (టిజిపిసిబి) కార్యాలయంలో సభ్య కార్యదర్శి జి. రవి జాతీయ జెండాను ఆవిష్కరించారు.

అమీర్‌పేట్‌లోని హెచ్‌ఎండిఎ కార్యాలయంలో కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ శ్రీవత్స కోటా, సేవా రంగాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన హెచ్‌ఎండిఎ అధికారులు, సిబ్బందికి మెట్రోపాలిటన్ కమిషనర్ అభినందన పత్రాలు అందచేసి, అభినందించారు.

## జిహెచ్‌ఎంసి ప్రత్యేక చొరవతో ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి అవకాశాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని ట్రాన్స్‌జెండర్ల జీవితాల్లో కొత్త ఆశలు చిగురించాయి. వారికి శిక్షణ ఇచ్చి, ఉద్యోగావకాశాలు కల్పించడంతో పాటు, స్వయం ఉపాధి కోసం జిహెచ్‌ఎంసి ఆర్థిక సహాయం అందించింది. ఈ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిహెచ్‌ఎంసి ట్రాన్స్‌జెండర్ల స్వావలంబనకు, గౌరవప్రదమైన జీవితానికి బాటలు వేసింది. చందా నగర్ లైట్‌హౌస్ కమ్యూనిటీస్ నైపుణ్యాల కేంద్రంలో 15 రోజుల ఉచిత గ్రాఫిక్ డిజైన్ శిక్షణలో నలుగురు ట్రాన్స్‌జెండర్లు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకున్నారు. వీరిలో మధురాజ్, ఇమ్రాన్ ఖాన్, నవీనా, వరుణ్ తేజ్ ఉన్నారు. శిక్షణ అనంతరం వారి ప్రతిభను గుర్తించిన రెడ్ టివి ఛానెల్ యాజమాన్యం నెలకు రూ.12,000 స్టైఫండ్‌తో వారికి ఉద్యోగావకాశం కల్పించింది. శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మేయర్ గద్వాల విజయలక్ష్మి, కమిషనర్ ఆర్.వి.కర్ణన్ ఈ నలుగురికి జాబ్ ఆఫర్ లెటర్లు అందజేశారు.



## జాతినిర్మాణంలో ఎస్‌బిఐ పాత్ర చిరస్మరణీయం

### హైదరాబాద్ సర్కిల్ సిజిఎం ఎస్.రాధాకృష్ణన్

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** జాతి నిర్మాణంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) పోషించిన పాత్ర అత్యంత ప్రభావవంతమైనది అని ఎస్‌బిఐ హైదరాబాద్ సర్కిల్ సిజిఎం ఎస్.రాధాకృష్ణన్ అన్నారు. శుక్రవారం 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కోఠిలోని ఎస్‌బిఐ ప్రధాన కార్యాలయంలో జెండాను ఆవిష్కరించారు. ముఖ్యఅతిథి ఎస్.రాధాకృష్ణన్ ప్రసంగిస్తూ భారతదేశం ఒకప్పుడు అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటూ కొరత నుంచి స్వయం సమృద్ధి సాధన దిశగా సాగించిన ప్రస్థానం సాగించిందన్నారు. నేడు ప్రపంచం గర్వించే స్థాయికి దేశం ఎదగడం గర్వకారణం అన్నారు. పరిశ్రమలు మొదలు సేవలు, విద్య, ఆరోగ్య సంరక్షణ వరకూ భారతదేశ అభివృద్ధి నిర్మాణంలో ఎస్‌బిఐ తన వంతు పాత్రను ప్రశంసనీయరీతిలో నిర్వర్తించిందన్నారు. తెలంగాణలో ఎస్‌బిఐ ఆరు దశాబ్దాల నిర్విరామ సేవలతో ఖాతాదారులు, ప్రజల హృదయాలలో చెరగని ముద్రవేసిందని ప్రస్తుతించారు. ఈ ఏడాది ప్రతీ జిల్లాలో మార్కెట్ వాటాను 1శాతానికి పెంచడం, ఎస్‌బిఐ సమ్మిళిత బ్యాంకింగ్ తత్వాన్ని బలోపేతం చేయాలన్న లక్ష్య సాధనలో సిజిఎంలు, జనరల్ మేనేజర్లు, బిజిఎంలు, ఏజిఎంలు, ఉద్యోగ సంఘాల నాయకులు అందరూ సంఘటితంగా కృషిచేయాలని కోరారు. పహల్గామ్ ఉగ్రదాడి విషయాన్ని ప్రస్తావించిన రాధాకృష్ణన్ భావోద్వేగానికి గురయ్యారు.ఎస్‌బిఐను తెలంగాణలో అతిపెద్ద బ్యాంక్‌గా నిలపడమే కాకుండా ఉత్తమ బ్యాంక్‌గా మార్చడంలో సమష్టి కృషి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బిఐ లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు పెన్‌బాగా దేవి(జనరల్ మేనేజర్ ఎన్‌డబ్ల్యు1), సతీష్‌కుమార్ (జనరల్ మేనేజర్ఎన్‌డబ్ల్యు2), డిప్యూటీ జనరల్ మేనేజర్లు, ఇతర సీనియర్ మేనేజ్‌మెంట్ అధికారులు , ఉద్యోగులు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

# పేదలు, బలహీనుల పక్షపాతిగా ఉందాం

### కబ్జాదారులు, బలవంతుల నుంచి వారిని కాపాడుదాం : హైడ్రా కమిషనర్ రంగనాథ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సహజవనరుల పరిరక్షణ అందరి లక్ష్యం కావాలని హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ సూచించారు. హైడ్రా కార్యాలయంలో జరిగిన స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం హైడ్రా కమిషనర్ ప్రసంగించారు. భారత రాజ్యాంగంలో విధులు స్పష్టంగా పేర్కొనడం జరిగిందని, తదనుగుణంగానే హైడ్రా పని చేస్తోందన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఎ(జి)లో సహజవనరుల పరిరక్షణ అంశం ఉందని, ఆ ప్రకారమే నగరంలో గొలుసుకట్టు చెరువుల పరిరక్షణకోసం హైడ్రా పని చేస్తోందన్నారు. జీవించే హక్కుతో పాటు, వ్యక్తిగత స్వేచ్ఛను ఆర్టికల్ 21 సూచిస్తోందని, ఇందుకోసం హైడ్రాలో పని చేస్తున్న ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మనం ఎప్పుడూ పేదలు, బలహీనుల పక్షపాతిగా ఉంటూ, కబ్జాదారులు, బలవంతుల నుంచి వారిని కాపాడాలన్నారు. చట్టాలను ఎప్పుడూ అక్షరాలుగా చూడొద్దని, అందులో స్ఫూర్తిని గ్రహించి హైడ్రా సిబ్బంది పని చేయాలని సూచించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పని చేస్తూనే, ప్రజలకు మరింత చేరువ అవ్వాలన్నారు. హైడ్రాను ప్రజలంతా ఓన్ చేసుకునే విధంగా మన పనితీరుండాలన్నారు.


# 'స్త్రీ శక్తి'తో మహిళలకు ఆర్థిక చేయూత

### ఆడబిడ్డలకు ఇస్తున్న వరం ఉచిత బస్సు ప్రయాణం
### ఎపి సిఎం నారా చంద్రబాబు నాయుడు




**అమరావతి:** 'స్త్రీ శక్తి' పథకం ద్వారా మహిళలకు ఆర్థిక చేయూత లభిస్తుందని సీఎం నారా చంద్రబాబు నాయుడు అన్నారు. స్వాతంత్ర్యం దినోత్సవం రోజున ఈ స్త్రీశక్తి పథకానికి శ్రీకారం చుట్టామని, మహిళలకు మేలు చేస్తున్నామన్న తృప్తి కలుగుతోందని వెల్లడించారు. రాష్ట్రంలోని మహిళలందరూ ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశాన్ని కల్పించామన్నారు. మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం తీసుకురావడంతో పాటు వారి గౌరవాన్ని పెంచడం కోసం ఎన్డీఏ ప్రభుత్వం పని చేస్తోందని స్పష్టంచేశారు. సూపర్ 6 హామీల్లో ప్రతిష్టాత్మక స్త్రీ శక్తి పథకాన్ని ఉండవల్లి నుంచి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, బీజేపీ ఏపీ అధ్యక్షుడు మాధవ్‌తో కలిసి సీఎం చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. బస్సులో ప్రయాణించే మహిళలకు జీరో ఫేర్ టికెట్‌ను అందించారు. ఉండవల్లి నుంచి మహిళలతో కలిసి విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్ వరకు ప్రయాణించారు. దారి పొడవునా వివిధ బస్ స్టాప్‌లలో ప్రజలు, ప్రత్యేకించి మహిళలు స్వాగతం పలికారు. బస్సుల్లో ఉన్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేశ్‌లతో కరచాలనం చేసేందుకు బస్ వెంబడి పరుగులు పెట్టారు. బస్సులో ప్రయాణిస్తున్నంత సేపు చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్ మహిళలతో మాట్లాడారు. వాళ్ల స్థితిగతులతో పాటు..ఉచిత బస్ ప్రయాణం వల్ల ఎంతవరకు మేలు కలుగుతుందని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విజయవాడ బస్టాండ్‌కు చేరుకుని అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్నారు. 'ఈ రోజు నాకు చాలా సంతోషంగా ఉంది. ఆడబిడ్డలకు ఇచ్చిన హామీని నెరవేర్చాం. ఒకప్పుడు ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు కొన్ని సీట్లు రిజర్వ్ విధానం చేశాం. ఇప్పుడు ఉచితంగా బస్సు ప్రయాణం కల్పిస్తున్నాను. ఇకపై ప్రతి ఆడబిడ్డ ఉచిత బస్సు ప్రయాణం చేయొచ్చు. రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా వెళ్లొచ్చు. మిత్రుడు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో కలిసి ఆర్టీసీ బస్సులో ప్రయాణించాను. దారి పొడవునా పలువురు మహిళలతో మాట్లాడాను. వారి మాటలు విన్న తర్వాత ఆడబిడ్డలకు మంచి చేశామన్న తృప్తి కలిగింది' అని సీఎం చంద్రబాబు అన్నారు. 'ఉచిత బస్సు ప్రయాణం ఆడబిడ్డలకు అన్నగా నేను ఇస్తున్న వరం. రాష్ట్రంలోని 2.62 కోట్ల మంది మహిళలకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుతుంది. ఈ పథకం అమలుకు నెలకు రూ.162 కోట్లు, ఏడాదికిరూ.1,942 కోట్లు వ్యయం చేస్తున్నాం. పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డనరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులలో ఏ బస్సు ఎక్కినా ఎంత దూరం వెళ్లినా ఒక్క రూపాయి చెల్లించక్కర్లేదు. రాష్ట్రంలో ఏపీఎస్ ఆర్టీసీ ప్రస్తుతం 11,449 బస్సులు నిర్వహిస్తుండగా అందులో మహిళలు 8,458 బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు వీలు కల్పించామన్నారు.

## నాగాలాండ్ గవర్నర్ గణేశన్ కన్నుమూత



**చెన్నై:** నాగాలాండ్ గవర్నర్ గణేశన్ (80) కన్నుమూశారు. చెన్నైలోని ఒక ప్రైవేటు ఆసుపత్రి ఐసియులో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి ఆయన కన్నుమూసినట్టు రాజ్‌భవన్ అధికారులు తెలిపారు. ఈనెల 8న ఆయన చెన్నైలోని తన నివాసంలో కుప్పకూలడంతో తలకు గాయమైంది. దీంతో ఆయనను వెంటనే ఆసుపత్రిలో చేర్చారు. గణేశన్ 1945 ఫిబ్రవరి 16న తంజావూరులో జన్మించారు. ఆర్‌ఎస్‌ఎస్ భావజాలంతో ఆకర్షితులైన ఆయన 20 ఏళ్లు సంఘ్‌లో సేవలందించారు. తమిళనాడులో బిజెపి బలోపేతానికి కృషి చేశారు. ఆ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడిగా 2006–2009 మధ్య పని చేశారు. ఆ తర్వాత మణిపూర్ గవర్నర్‌గా, పశ్చిమబెంగాల్ గవర్నర్‌గా అదనపు బాధ్యతలు చేపట్టారు. నాగాలాండ్ 21వ గవర్నర్‌గా గణేశన్ 2023 ఫిబ్రవరి 20న పదవీ బాధ్యతలు చేపట్టారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## కర్ణాటకపై కేంద్రం వివక్ష
### ముఖ్యమంత్రి సిద్ధరామయ్య విమర్శ

**బెంగళూరు :** కర్ణాటకపై కేంద్రం వివక్ష ప్రదర్శిస్తోందని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆరోపించారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవంలో ఆయన మాట్లాడుతూ నిధుల పంపిణీలో చిన్నచూపు చూస్తోందన్నారు. అందుకే తమ ప్రభుత్వం సొంతగాఅభివృద్ధి మోడళ్లను అనుసరిస్తోందన్నారు. అంతేకాదు తమ ప్రభుత్వ గ్యారంటీ స్కీమ్‌లు ప్రపంచం దృష్టిని ఆకర్షించాయన్నారు. ఐరాస జనరల్ అసెంబ్లీ అధ్యక్షుడు ఫిలేమన్ యాంగ్ స్వయంగా ఇక్కడకు వచ్చి పథకాలను పరిశీలించారని గుర్తు చేశారు. కేంద్ర సంస్థలైన ఇన్‌కమ్ ట్యాక్స్ విభాగం, ఇడి, సిబిఐ ప్రజాస్వామ్య విలువలకు అనుగుణంగా పనిచేయడం లేదని సిద్ధరామయ్య విమర్శించారు. ఈ విషయంపై బాధ్యతగల ప్రతి పౌరుడు తమ గొంతుక వినిపించాలన్నారు. దేశంలో 80 శాతం సంపద కేవలం 10 శాతం వ్యక్తుల గుప్పిటే ఉందని చాలా సంస్థల సర్వేలు వెల్లడిస్తున్నాయని సిద్ధరామయ్య గుర్తు చేశారు. వారు సమష్టిగా జిఎస్‌టికి అందిస్తున్న మొత్తం 3 శాతం మాత్రమేనని విమర్శించారు. సాధారణ ప్రజలు 97 శాతం సమకూరుస్తున్నట్లు వెల్లడించారు.

# మువ్వన్నెల రెపరెపలు
### గల్లీ నుంచి ఢిల్లీ వరకు వేడుకలు
### ఘనంగా 79వ స్వాతంత్ర్య దినోత్సవం



**న్యూఢిల్లీ:** దేశంలో 79వ స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా జరిగింది. గల్లీ నుంచి ఢిల్లీ వరకు వేడుకలు నిర్వహించారు. వాడవాడలా మువన్నెల రెపరెపలు కనిపించాయి. స్కూల్లో పిల్లల నుంచి ముఖ్యమంత్రులు, ఉన్నతస్థాయి అధికారుల వరకు స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్నారు. అన్నిరాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించిన కార్యక్రమాల్లో సంప్రదాయం ప్రకారం జెండా ఆవిష్కరణ, పరేడ్, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. బాలబాలికల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రధానభవనాలు, కార్యాలయాలను జాతీయ జెండా రంగుల్లో విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ఆపరేషన్ సిందూర్ విజయోత్సవంగా ఈ స్వా తంత్ర్య దినోత్సవాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించింది. ఎర్రకోటను ముస్తాబు చేసింది. ప్రధాని అక్కడకు చేరుకొన్నప్పుడు 'ఆపరేషన్ సిందూర్' జెండా పెట్టుకున్న హెలికాప్టర్ ఆయనపై పూల వర్షం కురిపించింది. అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు పరేడ్ సందర్భంగా గౌరవ వందనాన్ని స్వీకరించారు. గవర్నర్లు ఎట్‌హోం తేనీటి విందులు ఇచ్చారు. భారతీయులందరికీ ప్రపంచ దేశాల నాయకులు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అగర్తలాలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన పరేడ్‌లో బీఎస్‌ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు. తమిళనాడులో పోలీసులు మార్చ్‌పాస్ట్ చేశారు. రాజధాని చెన్నైలోని సెక్రటేరియట్‌లో వేడుకలు జరిగాయి. భారత్‌పాకిస్థాన్ మధ్య అమృత్‌సర్ సమీపంలో అట్టారీ వాఘా సరిహద్దు పోస్టు వద్ద సరిహద్దు భద్రతా దళం (బీఎస్‌ఎఫ్) మిఠాయిలు పంచుకొని వేడుక చేసుకున్నది. కర్నాటక, బెంగళూరు వేడుకలు జరిగాయి. మహారాష్ట్ర, ముంబైలో ప్రముఖుల వేషధారణలో చిన్నారులు అలరించారు. అసోం రాజధాని గువహటితో వేడుకలు నిర్వహించారు. పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని ఇందిరాగాంధీ సరానీలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. పోలీసుసిబ్బంది 'డేర్‌డెవిల్' స్టంట్స్ తో ఆకట్టుకోగా పిల్లల నృత్యప్రదర్శనలతో కార్యక్రమం అట్టహాసంగా సాగింది. ఆకస్మిక వరదలతో జమ్మూకశ్మీర్ అతలాకులం అయినప్పటికీ శ్రీనగర్, లాల్‌చౌక్‌లో స్వాతంత్ర్య దినోత్సవాన్ని ప్రజ లు జరుపుకున్నారు. ఉత్తరప్రదేశ్, వారణాసిలో నిర్వహించిన వేడుకల్లో పోలీసులు ప్రత్యేకంగా ప్రతిజ్ఞ చేశారు.

## స్వాతంత్ర్య వేడుకల్లో భూటాన్ రాజు 'జీప్'



స్వాతంత్ర్య దినోత్సవం వేళ దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట వద్ద ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సమర్పించిన గార్డ్ ఆఫ్ ఆనర్ అందరినీ ఆకట్టుకుంది. ఇక ఇదే సమయంలో సైలెంట్‌గా ఎర్రకోట వద్దకు వచ్చిన ఒక ఐకానిక్ స్పోర్ట్స్ యుటిలిటీ వాహనం (ఎస్‌యువి) స్టైలిష్ లుక్ ప్రతీ ఒక్కరిని అబ్బురపరిచింది. ఢిల్లీ ఏరియా జనరల్ ఆఫీసర్ కమాండింగ్ (జిఒసి) లెఫ్టినెంట్ జనరల్ భవ్నీశ్ కుమార్ ఇందులోనే ఎర్రకోటకు చేరుకున్నారు.

**సర్వేపల్లి రాధాకృష్ణన్ – 'జీప్ వాగనీర్'...** మనం చెప్పుకుంటున్న ఎస్‌యువి పేరు 'జీప్ వాగనీర్'. దాన్ని 1965లో నాటి భూటాన్ రాజు, అప్పటి భారత రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు బహుమతిగా ఇచ్చారు. ఇరు దేశాల మధ్యనున్న స్నేహపూర్వక సంబంధాలకు ప్రతీకగా ఇది నిలుస్తోంది. ఈ వాహనం భారత్‌కు విలువైన ఆస్తిగా మారింది. 2000 సంవత్సరంలో 'జీప్ వాగనీర్'ను అధికారికంగా భారత సైన్యానికి బదిలీ చేశారు. నాటి నుంచి అది ఢిల్లీలోని భారత ఆర్మీ ప్రధాన కార్యాలయంలో ఉంటోంది. కాలక్రమంలో ఈ వాహనాన్ని భారత సైన్యం అప్‌గ్రేడ్ చేయించింది. ఇప్పుడు ఇందులో 'ఫోర్డ్ ఎండీవర్ 2500 సిసి' ఇంజిన్‌ను వినియోగిస్తున్నారు. పాత కాలపు బాడీ, అధునాతన ఇంజిన్‌ల మేళవింపుగా నేటికీ 'జీప్ వాగనీర్' చక్కగా పనిచేస్తోంది.

**భూటాన్ కానుకను అపురూపంగా కాపాడుతున్న భారత్...** ఢిల్లీ ఏరియా జనరల్ ఆఫీసర్ కమాండింగ్(జిఒసి) హోదాలో ఉండేవారు 'జీప్ వాగనీర్'ను వినియోగిస్తున్నారు. ప్రస్తుతం ఈ పదవిలో లెఫ్టినెంట్ జనరల్ భవ్నీశ్ కుమార్ ఉన్నారు. ప్రతీ సంవత్సరం స్వాతంత్ర్య దినోత్సవం నాడు, ఢిల్లీలోని ఆర్మీ ప్రధాన కార్యాలయం నుంచి ఎర్రకోటకు జిఒసి ఇందులోనే వస్తుంటారు. ఈ వాహనం భారత సైనిక క్రమశిక్షణకు, భారత్ భూటాన్ బలమైన చారిత్రక, దౌత్య సంబంధాలకు నిదర్శనంగా నిలుస్తోంది. కాలం మారినా, ఏళ్లు గడిచినా భూటాన్ ఇచ్చిన కానుకను భారత ఆర్మీ అపురూపంగా కాపాడుతోంది.

# ముమ్మరంగా సహాయక చర్యలు
### జమ్మూకశ్మీర్ క్లౌడ్ బరస్ట్ ఘటనలో
### 60కి చేరిన మృతుల సంఖ్య



**న్యూఢిల్లీ :** జమ్ముకశ్మీర్ కిష్టావర్ జిల్లాలోని మేఘావృత బాధిత గ్రామంలో శుక్రవారం అడపాదడపా వర్షాలు కురుస్తున్నప్పటికీ, ప్రాణాలతో బయటపడిన వారి కోసం అన్వేషణను సహాయక సిబ్బంది ముమ్మరం చేసింది. ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఈ విషాద సంఘటనలో 60మంది మరణించారని, ఇంకా అనేక సంఖ్యలో ప్రజలు చిక్కుకున్నారని తెలిపారు. మచైల్ మాతా ఆలయానికి వెళ్లే మార్గంలో చివరిగా ప్రయాణించదగిన గ్రామమైన చిసోటిలో గురువారం మధ్యాహ్నం 12:25 గంటల ప్రాంతంలో విపత్తు సంభవించింది. దీంతో ప్రాణనష్టం, విధ్వంసం జరిగింది. గురువారం ఇద్దరు కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సిఐఎస్‌ఎఫ్) సిబ్బందితో సహా 46 మృతదేహాలను సహాయక సిబ్బంది బయటకు తీశారు. గాయపడిన 167 మందిని రక్షించగా, మరో 69 మంది గల్లంతయ్యారు. 30 మృతదేహాలను గుర్తించి బాధితుల కుటుంబాలకు అప్పగించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం అబ్దుల్లా, జమ్ముకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాతో మాట్లాడి వారికి అన్ని విధాలా సహాయం చేస్తామని హామీ ఇచ్చారు. జూలై 25న ప్రారంభమై సెప్టెంబర్ 5న ముగియాల్సిన వార్షిక మచైల్ మాతా తీర్థయాత్ర కోసం చిసోటిలో పెద్ద సంఖ్యలో ప్రజలు గుమిగూడారు. 9,500 అడుగుల ఆలయానికి 8.5 కిలోమీటర్ల ట్రెక్కింగ్ కిష్టావర్ పట్టణం నుండి 90 కి.మీ దూరంలో ఉన్న చిసోటి నుండి ప్రారంభమవుతుంది. శుక్రవారం రెండవ రోజు యాత్ర నిలిపివేయబడింది. వరదల కారణంగా తాత్కాలిక మార్కెట్, తీర్థయాత్ర కోసం ఒక లంగర్ (కమ్యూనిటీ కిచెన్) స్థలం, భద్రతా అవుట్ పోస్ట్ నేలమట్టమయ్యాయి, అంతేకాకుండా 16 నివాసగృహాలు, ప్రభుత్వ భవనాలు, మూడు దేవాలయాలు, నాలుగు వాటర్ మిల్లులు, 30 మీటర్ల స్పాన్ వంతెన, డజనుకు పైగా వాహనాలు దెబ్బతిన్నాయి. గురువారం రాత్రి ఆలస్యంగా రెస్క్యూ, సహాయక ఆపరేషన్‌ను నిలిపివేశారు. వర్షాలు ఉన్నప్పటికీ, పోలీసులు, సైన్యం, ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది, స్థానిక స్వచ్ఛంద సేవకులతో కూడిన సహాయ సిబ్బంది ప్రాణాలతో బయటపడిన వారిని కనుగొనడానికి శిథిలాల గుండా జల్లెడ పట్టారు. అయితే శుక్రవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో వర్షాలు ఆగిపోగా, సహాయక చర్యలు మరింత ముమ్మరం చేసినట్లు అధికారులు తెలిపారు. గంట గడిచేకొద్దీ శిథిలాల నుంచి మరిన్ని మృతదేహాలను వెలికితీశామని, అయితే ఎవరూ సజీవంగా ఉండే అవకాశాలు తగ్గుతున్నాయని అధికారులు తెలిపారు. ఉదయం 11:15 గంటల ప్రాంతంలో 20 నిమిషాల పాటు మరోసారి వర్షం కురిసింది. జమ్ముకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా జీ, సిఎం ఒమర్ అబ్దుల్లా జీతో కిష్టావర్‌లో మేఘావృతం, వరదల నేపథ్యంలో పరిస్థితి గురించి మాట్లాడినట్లు ఎక్స్‌లో ప్రధాని మోదీ పేర్కొన్నారు. బాధితులకు సహాయం చేసేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారన్నారు. శ్రీనగర్‌లోని బక్షి స్టేడియంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో ప్రసంగించిన అబ్దుల్లా, ఈ విషాద ఘటనలో కనీసం 60 మంది మరణించారని, 100 మందికి పైగా గాయపడ్డారని అన్నారు. ఇది ఎందుకు జరిగిందో రానున్న రోజుల్లో గుర్తించాల్సి ఉంటుందని, పరిపాలన వైపు ఏదైనా లోపం ఉందా అనే దిశగా కూడా యోచించాలన్నారు. విలువైన ప్రాణాలను కాపాడటానికి ప్రభుత్వం, అధికార యంత్రాంగం నుంచి మరిన్ని చర్యలు తీసుకోగలిగామా? మనం మనల్ని మనం జవాబుదారీగా మార్చుకోవాలని ఆయనఅన్నారు. కాగా, కేంద్రపాలిత ప్రాంతం పరిపాలన ప్రజలు, యాత్రికులకు సహాయం చేయడానికి చోసిటి నుండి 15 కి.మీ దూరంలో ఉన్న పాడ్డర్‌లో కంట్రోల్ రూమ్‌కమ్‌హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేసింది.

## కూలిన దర్గా పైకప్పు..
### పన్నెండు మంది సురక్షితం..!

**న్యూఢిల్లీ :** ఢిల్లీలోని హుమాయూన్ సమాధికి సమీపంలోని నిజాముద్దీన్ ప్రాంతంలో ఉన్న ఒక దర్గాలోని పైకప్పు కూలింది. శుక్రవారం సాయంత్రం దర్గా షరీఫ్ పట్టే షాలోని ఒక గది రూఫ్ ఒక్కసారిగా కింద పడడంతో అందరూ భయభ్రాంతులకు లోనయ్యారు. విషయం తెలిసిన వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు శిథిలాల కింద చిక్కుకున్న 12 మందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ప్రస్తుతం ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు నెట్టింట్లో వైరలవుతున్నాయి. పదహారో శతాబ్దం నాటి హుమాయున్ సమాధికి సమీపంలో ఉన్న దర్గాలో శుక్రవారం ప్రార్థనల కోసం ఇమామ్ సహా కొందరు యువకులు జమ అయ్యారు. అయితే.. హఠాత్తుగా రూఫ్ కూలడంతో పలువురు గాయపడ్డారు. పైకప్పు కూలే సమయానికి అందులో దాదాపు 15 నుంచి 20 మంది ఉన్నట్టు సమాచారం. వీళ్లందరి వయసు 25 నుంచి 30 ఏళ్ల మధ్య ఉంటుందని అంటున్నారు. కానీ, పోలీసులు మాత్రం దర్గాలో ఎందరు ఉన్నారు? అనే విషయంపై స్పష్టత ఇవ్వలేదు.

## హక్కు కోసం బిహార్ పోరు : తేజస్వి



**పాట్నా:** దేశం 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటున్న వేళ బిహార్ ప్రజలు తమ ఓటు హక్కు కోసం పోరాడాల్సి వస్తోందని, ఇది యాదృచ్ఛికమని ఆర్‌జేడీ నాయకుడు తేజస్వీ యాదవ్ వ్యాఖ్యానించారు. ఓటర్ల హక్కు యాత్ర (మత్‌దాతా అధికార్)లో ప్రతి ఒక్కరు పాల్గోవాలని కోరుతూ శుక్రవారం ఒక బహిరంగ లేఖను ఆయన విడుదల చేశారు. ఈనెల 17న లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఓటర్ల హక్కుయాత్రను ప్రారంభిస్తారు. స్వాతంత్ర్య వేడుకలు అంటే జాతీయజెండా ఆవిష్కరించడం, ఇళ్లపై జెండాలు పెట్టుకోవడం, జాతీయ గీతాలు పాడుకోవడం ద్వారా సంతృప్తి చెందడం... మన గొంతు నలుపివేస్తున్న నిరంకుశ పాలకులను, వాస్తవాలను విస్మరించడం కాదని తేజస్వీ యాదవ్ వక్కాణించారు. అధికార పక్ష ఆశ్రిత పెట్టుబడిదారులు బీహార్‌లో దుర్భర పరిస్థితులు తీసుకు వచ్చారని ఆరోపించారు. ఎస్‌ఐఆర్‌లో భాగంగా ఓటర్ల జాబితాల్లో జరిగిన అవకతవకలను ప్రస్తావిస్తూ, సజీవంగా ఉన్న వారిని చనిపోయినట్లుగా చూపి పేర్లు తొలగించారంటూ మండిపడ్డారు. 'బతికుండగానే చనిపోయినట్లు ప్రకటిస్తే ఆ వ్యక్తి పరిస్థితి ఏమిటో ఒక్కసారి ఆలోచించండి... వారి బాధ, ఆవేదన మనకు అర్థం కాదు' అని తేజస్వి అన్నారు. ఒక ఓటు వేసే అధికారం కోసం ప్రజలు పోరాడాల్సిన పరిస్థితి దాపురించిందని, అధికార పక్ష అనుయాయులకు రెండు ఓట్లు ఉన్నాయన్నారు. వరదల్లో ఇళ్లు కోల్పోయిన పేదలకు నివాస పత్రాలు లభించడంలేదు కానీ కుక్కలకు, పిల్లులకు పత్రాలు జారీ అవుతున్నాయని వ్యాఖ్యానించారు. 'మనం మన సంకల్పాన్ని బలపర్చుకోలేకపోతే, బీజేపీ అండగల ప్రజాస్వామ్య హంతకులు పేదల ఓటు హక్కును హరించడం ద్వారా బీహార్‌లో నిరంకుశ, ఫెడరల్ పాలనను తీసుకు వస్తారు' అని తేజస్వీ యాదవ్ హెచ్చరించారు. రాష్ట్రంలో 20ఏళ్ల ఎన్డీయే పాలనను పాత కారుతో పోల్చుతూ.. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాజ్యాంగం పేరిట బీహార్ ప్రజలంతా ప్రతి ఘటనకు ప్రతిజ్ఞ బూనాలని పిలుపునిచ్చారు. ఓటరు అధికార్ యాత్రలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని, నిరంకుశవిభజన శక్తులకు వ్యతిరేకంగా పోరాడాలని బీహార్ ప్రజలను తేజస్వి కోరారు.

## ధర్మస్థల పుణ్యక్షేత్ర' ప్రతిష్ఠ దెబ్బతీసే కుట్ర
### రెండు రోజుల్లో అసెంబ్లీలో స్పష్టమైన ప్రకటన : డికె



**బెంగళూరు:** ధర్మస్థల పుణ్యక్షేత్ర ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు కుట్ర జరుగుతోందని, త్వరలోనే నిజం నిలకడ మీద తెలుస్తుందని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ అన్నారు. విపక్షాల తీవ్ర విమర్శల నేపథ్యంలో ఆయన పైవిధంగా స్పందించారు. రెండు దశాబ్దాల క్రితం ధర్మస్థలలో హత్యలు, అత్యాచారాలు జరిగాయని, వందల సంఖ్యలో మతదేహాలను గుట్టుచప్పుడు కాకుండా ఖననం చేశారని ఆ క్షేత్రంలో పనిచేసిన 61 ఏళ్ల ఓ మాజీ పారిశుధ్య కార్మికుడు పోలీసులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో.. ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేయించి అతడు చూపించిన ప్రాంతాల్లో తవ్వకాలు జరిపిస్తోంది. అయితే... ఈ వ్యవహారంపై ప్రతిపక్ష బీజేపీ తీవ్ర విమర్శలు, ఆరోపణలకు దిగడంతో శివకుమార్ స్పందించారు. సిట్ దర్యాప్తుపై తనకు నమ్మకం ఉందని, త్వరలోనే ధర్మస్థలపై జరుగుతున్న కుట్ర బయటకు వస్తుందని, ఆ ఆరోపణలు రుజువుకాని పక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కూడా తనతో ఇదే విషయాన్ని స్పష్టం చేశారని వెల్లడించారు. అయితే... 'తాను ఇప్పటికీ ధర్మస్థల మంజునాథ స్వామి భక్తుడినే. ధర్మస్థల వీరేంద్రహెగ్డే చేసిన సేవలను గౌరవిస్తాం. భక్తునికి దేవునికి ఉన్న సంబంధానికి మనం భంగం కలిగించరాదు. అలాగని తానేదో ధర్మస్థలకు అనుకూలంగానో, వ్యతిరేకంగానో మాట్లాడడం లేదు. చట్టానికి ఎవరూ అతీతులు కారని... చట్టం తన పని తాను చేసుకుపోతుందనే విషయాన్ని గుర్తు చేస్తున్నా. ఒకవేళ ధర్మస్థలపై నిజంగా కుట్ర జరిగి ఉంటే విచారణలో బయటపడుతుంది. తప్పు ఎవరు చేసినా శిక్ష అనుభవించకతప్పదు. ప్రతిపక్షాల ఆరోపణల నేపథ్యంలో...ఈ అంశంపై హోంమంత్రి పరమేశ్వర్ సోమవారం అసెంబ్లీలో స్పష్టమైన ప్రకటన చేస్తారు' అని శివకుమార్ వివరించారు. ధర్మస్థల తవ్వకాలపై అసెంబ్లీలో హోంమంత్రి మాట్లాడుతూ..'ఫిర్యాదు ప్రకారం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆప్రాంత ప్రజల డిమాండ్ మేరకు జూన్ 19 సిట్ ఏర్పాటుచేసి విచారణకు ఆదేశించాం. ఇది పూర్తి కావడానికి కాలపరిమితి ఉంటుంది. ఈలోపు సిట్ దర్యాప్తునకు భంగం కలిగించేలా వ్యవహరించకూడదని భావిస్తున్నాం' అని అన్నారు. 1995–2014 మధ్య తాను పని చేస్తున్న సమయంలో ధర్మస్థల ఆలయ నిర్వాహకుల ఆదేశాల మేరకు తానే స్వయంగా ఆ మృతదేహాలను పాతిపెట్టినట్లు పారిశుధ్య కార్మికుడు చెబుతున్నాడు. అందులో మహిళలు, మైనర్ బాలికల మతదేహాలు అధికంగా ఉన్నాయని, కొందరిపై లైంగిక దాడి జరిగినట్లు ఆనవాళ్లు కూడా ఉన్నాయని మెజిస్ట్రేట్ ముందు వాంగ్మూలం కూడా అతడు ఇచ్చినట్టు చెప్పారు. ఇప్పటిదాకా నేత్రావతి నదీ తీరం వెంబడి అతడు చూపించిన చోట్లలో సిట్ తవ్వకాలు జరిపింది. అందులో రెండు చోట్ల మాత్రమే అస్తిపంజరాలు బయటపడినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే... తీవ్ర చర్చకు దారితీసిన ధర్మస్థలలో మతదేహాల కోసం తవ్వకాల కేసులో గురువారం విధానసభ దద్దరిల్లింది. ధర్మస్థల మీద అసత్య ప్రచారం చేస్తున్న ప్రభుత్వం కూకటి వేళ్లతో కూలిపోతుందని బీజేపీ, జేడీఎస్ నాయకులు శాపాలు పెట్టారు. బీజేపీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్ మాట్లాడుతూ...'ఇటీవల గుర్తుతెలియని వ్యక్తి 10, 15ఏళ్ల క్రితం ధర్మస్థలలో వందలాది మృతదేహాలను పూడ్చిపెట్టానని చెప్పడం ద్వారా పవిత్ర ధర్మక్షేత్రానికి చెడ్డపేరు తెచ్చేవిధంగా కుట్ర జరుగుతోందన్నారు. అస్థికల కోసం తవ్వకాలంటూ హిందూ ధార్మిక కేంద్రాలపై జరుగుతున్న అసత్య ప్రచారం సహించమన్నారు. సిట్ దర్యాప్తు చేయడంపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని...అలాగని ధర్మస్థలపై ఎక్కుపెట్టడం సరికాదన్నారు. గుర్తుతెలియని వ్యక్తి మాటలు విని గుంతలు తవ్వే పనిచేస్తున్నారని, ధర్మస్థల పవిత్రతను కాపాడటానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఇన్నిరోజులు ఎన్నిగుంతలు తవ్వారు, ఎన్నిఅస్థిపంజరాలు దొరికాయి అనేది చెప్పాలని సునీల్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం ఈ అంశంపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేసే అవకాశం కనిపిస్తోంది.

## ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన బస్సు
### 10 మంది యాత్రికులు మృతి,
### మరో 35 మందికి గాయాలు



**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బర్ధవాన్ ప్రాంతంలో శుక్రవారం ఉదయం 7.30 గంటలకు ఆగి ఉన్న లారీని భక్తులతో వెళ్తున్న బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 10 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 35 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని, క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆయా ఆస్పత్రులకు తరలించారు. మృతులను బిహార్‌లోని చంపారన్ జిల్లాలోని మోతీహారీకి చెందిన వారని పోలీసులు తెలిపారు. మృతుల్లో ఇద్దరు మహిళలు ఉన్నారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో మొత్తం 45 మంది యాత్రికులు ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ నెల 8వ తేదీన వారు తమ యాత్రను ప్రారంభించారు. మొదట జార్ఖండ్‌లోని దేవ్‌గఢ్‌ను సందర్శించారు. అనంతరం దక్షిణ 24 పరగణాల జిల్లాలోని గంగాసాగర్‌ను సందర్శించారు. అక్కడ్నుంచి ఇంటికి తిరిగి వెళ్తుండగా తిరిగిరాని లోకాలకు వెళ్లారు. బస్సు డ్రైవర్ నిద్ర మత్తులో ఉండడమే ప్రమాదానికి కారణమని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## మా భవిష్యత్‌ను నిర్ణయించేది ఉగ్రవాదులా?
### రాష్ట్ర హోదా పునరుద్ధరణకు 'పహల్గామ్' ఆధారమా?
### పెద్ద ప్రకటన వస్తుందన్నారు... నిరాశ మిగిల్చారు
### పంద్రాగస్టు ప్రసంగంలో ఒమర్ అబ్దుల్లా భావోద్వేగం



**శ్రీనగర్:** జమ్మూకశ్మీర్ రాజకీయ భవితవ్యానికి ఉగ్ర దాడులతో ముడి పెట్టడాన్ని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదం ద్వారా పాకిస్థాన్ తమను ప్రభావితం చేయకూడదన్నారు. జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత జరిగిన తొలి స్వాతంత్ర్య వేడుకల్లో ఒమర్ అబ్దుల్లా ప్రసంగిస్తూ జమ్మూకశ్మీర్ భవిష్యత్‌పై కేంద్ర ప్రభుత్వ ప్రకటనపై ఆశలు సన్నగిల్లుతున్నాయని, ఎర్ర కోట మీద నుంచి ప్రధాని చేసే ప్రసంగంలో మనం కోరుకునే మాట కోసం ఆత్రుతగా ఎదురు చూశాం కానీ నిరాశే మిగిలింది. పత్రాలు సిద్ధమవుతున్నాయని, పెద్ద ప్రకటన రాబోతోందని నాతో చెప్పారు. కానీ, అలాంటిదేమీ జరగలేదు' అని ఒమర్ అన్నారు. నిస్సహాయ పరిస్థితిలో లేనని, స్టేటస్ క్యూ అంగీకరించబోనని చెప్పారు. రాష్ట్ర హోదా పునరుద్ధరణ డిమాండ్ సాధన కోసం ఒత్తిడి పెంచేలా సంతకాల సేకరణను చేపట్టబోతున్నట్లు వెల్లడించారు. జమ్మూకశ్మీర్ రాష్ట్ర హోదాను పునరుద్ధరించడం కోసం పహల్గాం తరహా దాడులను పరిగణనలోకి తీసుకోవాలని సీజెఐ బీఆర్ గవాయ్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఒమర్ ఈ ప్రకటన చేశారు. సుప్రీం కోర్టు ఎనిమిది వారాల సమయం ఇవ్వడాన్ని ప్రస్తావిస్తూ తమ ప్రజల గళం ఢిల్లీ వరకు వినిపించేలా చేస్తామన్నారు. 'ఈ ఎనిమిది వారాల్లో జమ్మూకశ్మీర్‌లోని 90 అసెంబ్లీ నియోజకవర్గాలకు నేను, నా సహచరులు వెళతాం. ఇంటింటి ప్రచారం నిర్వహిస్తాం. మీకు జమ్మూకశ్మీర్ రాష్ట్రంగా కావాలా వద్దా అని ప్రశ్నిస్తాం. లక్షలాది మంది ప్రజల నుంచి సంతకాలు/వేలి ముద్రలు సేకరిస్తాం. వాటిని కేంద్రానికి, సుప్రీంకోర్టుకు సమర్పిస్తాం' అని ఒమర్ వెల్లడించారు. తానేమీ స్క్రిప్టు చదవడం లేదని, తన మనస్సులోని మాటలను ప్రజల ముందు ఉంచుతున్నానని సీఎం భావోద్వేగానికి గురయ్యారు. జమ్మూకశ్మీర్ రాజకీయ భవితవ్యాన్ని శాసించేలా ఉగ్రవాదులకు అవకాశం కల్పించే ఆలోచన దురదృష్టకరమని అన్నారు. పహల్గాం దోషులు, పక్క దేశంలోని వారి గురువులు కలిసి జమ్మూకశ్మీర్ రాష్ట్రంగా ఉండాలో లేదో నిర్ణయిస్తారా అంటూ ప్రశ్నించారు. రాష్ట్ర హోదా సాధనకు చేరువయ్యే ప్రతిసారి ఏదో విధంగా దానిని చెడగొడుతున్నారని, ఇది న్యాయం కాదని, ఎవరో చేసిన నేరానికి మమ్మల్ని శిక్షించడం ఏమిటంటూ అసహనం వ్యక్తంచేశారు. పహల్గాం దాడికి వ్యతిరేకంగా కథువా, కుప్వారా ప్రజలు స్వచ్ఛందంగా నిరసన తెలిపారని గుర్తుచేశారు. జమ్మూకశ్మీర్ ప్రభుత్వాన్ని గణనీయంగా ప్రగతిశీల పద్ధతుల్లో తీవ్రవాదాన్ని తగ్గించారని చెప్పారు. 'ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం తీవ్రవాదం తగ్గుతూ వచ్చింది. కానీ, ఇప్పుడు మా చేతుల్లో అలాంటి అధికారం లేదు. మేము గతంలో విఫలం కాలేదు. భవిష్యత్‌లోనూ కాబోము. మమ్మల్ని నమ్మండి' అని ఒమర్ ఉద్ఘాటించారు.

## రాష్ట్ర అధికారాలను కేంద్రం కాలరాస్తోంది



**చెన్నై:** రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలను కేంద్రం హరిస్తోందని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ విమర్శించారు. స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్న ఆయన జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం ప్రసంగిస్తూ రాష్ట్రాలకు న్యాయంగా దక్కాల్సిన నిధులను కేటాయించడంలో కేంద్రం పక్షపాతం చూపిస్తోందని ఆరోపించారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధుల కోసం వాదించి, నిరసనలు తెలిపి, పిటిషన్లు వేయాల్సిన పరిస్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తంచేశారు. ఇది సమాఖ్య వ్యవస్థకు మంచిదికాదన్నారు. ప్రతి రాష్ట్రానికి స్వతంత్ర గుర్తింపు ఉండాలన్నారు. అప్పుడే భారత కీర్తి ప్రపంచ స్థాయిలో ప్రకాశిస్తుందన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి నిర్వహించే 'ఎట్ హోమ్' కార్యక్రమానికి స్టాలిన్ హాజరు కాకపోవచ్చని తెలుస్తోంది. మరోవైపు గవర్నర్ ప్రసంగంలో ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వంపై ప్రశంసలే తప్ప రాష్ట్ర ప్రభుత్వం, సీఎం గురించి ప్రస్తావన లేదు. తమిళనాడు అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని పేదలపై వివక్ష, మాదకద్రవ్యాల వాడకం, మహిళలు, చిన్నారులపై లైంగిక వేధింపులు విపరీతంగా పెరిగిపోయాయన్నారు.

## బిహార్‌లో ఎస్ఐఆర్ వెనక్కి
### డెరెక్ ఓ బ్రెయిన్ డిమాండ్ – సర్కారుకు 79 సూచనలు

**న్యూఢిల్లీ:** బిహార్‌లో ఎస్ఐఆర్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ డెరెక్ ఓ బ్రెయిన్ శుక్రవారం డిమాండ్ చేశారు. నిరుద్యోగం నుంచి సమాఖ్యవాదం వరకు వివిధ అంశాలకు సంబంధించి సర్కారుకు 79 సూచనలు చేశారు. దేశ 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని డెరెక్ ఓ వ్యాసాన్ని ప్రచురించారు. అందులో ఆరోగ్యం, విద్య, పిల్లలు, లింగం, ఆర్థిక వ్యవస్థ, మౌలిక వసతులు, పార్లమెంటు, చట్టాలపై సూచనలున్నాయి. 'భారతదేశం 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటున్న సందర్భంలో కేంద్ర ప్రభుత్వానికి 79 సిఫార్సులు చేస్తున్నా... ఇందులో ఆరోగ్యం, విద్య, చట్ట తదితర రంగాలకు సంబంధించినవి ఉన్నాయి' అని ఎక్స్‌లో డెరెక్ పేర్కొన్నారు. అదే సమయంలో మోదీకి మూడు సూచనలు చేశారు. పార్లమెంటులో ఓ ప్రశ్నకు సమాధానం ఇవ్వాలని, విలేకరుల సమావేశం నిర్వహించాలని, మణిపూర్‌ను సందర్శించాలన్నారు. సమాఖ్యవాదం గురించీ మాట్లాడుతూ మణిపూర్‌లో అనిశ్చితికి పరిష్కారం చూపాలని, జమ్మూకశ్మీర్‌కు సంపూర్ణ రాష్ట్ర హోదా పునరుద్ధరించాలని కోరారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్, పీఎంఏవైజీ కింద పశ్చిమ బెంగాల్‌కు పెండింగ్ నిధులు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నోట్ల రద్దు విఫల చర్యగా ఒప్పుకోవాలని, అగ్నిపత్ పథకాన్ని రద్దు చేయాలని సూచించారు. జాతీయ ఉపాధి హామీ పథకం కార్మికులు, ఆశా వర్కర్లకు వేతనాలు పెంచాలని, రాజకీయ అస్త్రంగా ఈడీని వినియోగించవద్దని, పార్లమెంటులో ప్రతిపక్షాలకు సమయం పెంచాలని, కనీసం 100 రోజుల ఫిక్స్‌డ్ పార్లమెంటరీ క్యాలెండర్ ఉండాలని, బిల్లుల బుల్డోజింగ్ ఆపాలని, ఎంపీల సస్పెన్షన్లపై వెనక్కి తగ్గాలని, సీఏఏ, యూఏపీఏ, దేశద్రోహం, వక్ఫ్ సవరణ చట్టం వంటి నల్ల చట్టాలను రద్దు చేయాలని, నిరుద్యోగాన్ని పరిష్కరించాలని, మహిళా కార్మిక శక్తి పెంచాలని, నైపుణ్యాభివృద్ధిని ప్రోత్సహించాలని, ఆరోగ్యం, జీవిత బీమాపై 18శాతం జీఎస్టీ రద్దు చేయాలని, ప్రజా ఆరోగ్య సంరక్షణపై వ్యయం పెంచాలని డెరెక్ సూచనలు చేశారు. అలాగే, మైనారిటీలకు స్కాలర్‌షిప్పులు పునరుద్ధరించాలన్నారు. విద్యార్థి ఆత్మహత్యల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళలపై నేరాల కేసుల్లో నిర్దేశిత కాలంలోగా శిక్షలు పడే విధంగా పటిష్ఠమైన చట్టాలు తేవాలని, స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కల్పించాలని కూడా ఆయన కేంద్ర ప్రభుత్వానికి సూచించారు.


**IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT BHUPALPALLY**

**O.S.No. 236 OF 2024**

Between:

**1. Bhukya Nandini,**
**2. Bhukya Bhaskar**
Both are minor rep by their guardian and natural,
Paternal uncle by name **Bhukya Venu.**
**... Plaintiffs**

AND

1. The District Collector, Jaya shankar Bhupalpally District.
2. To whomsoever it may concern.
...Defendants

**NOTICE**

To

1. The District Collector, Jaya shankar Bhupalpally District.
2. To whomsoever it may concern

The Plaintiff herein filed the above O.S No.263 of 2024 against the above Defendant no.1 to 2 for the declare the plaintiffs as the Legal Heirs of the deceased Late Bhukya Raju, and Late Bhukya Rajitha, R/o.Bhupalpally Town and Mandal Jaya Shankar Bhupalpally District. Hence you are required to appear before the Hon'ble Court through legal counsel on :- **26-08-2025 at 10:30 am.** Failing which the matter will be heard and decided in your absence.

Sd/-

**MANGALAPALLY RAJ KUMAR**
B.Com., M.Sc (Psy)., LL.B.
**ADVOCATE**
# 3-18/1, KHASIMPALLY, Bhupalpally.

ప్రజాపక్షం
శనివారం, 16 ఆగస్టు

## ప్రధాని సరికొత్త వక్కాణింపులు

79వ స్వాతంత్ర్యదినాన్ని పురస్కరించుకొని ప్రధాని నరేంద్రమోదీ ఎర్రకోట నుంచి 103 నిమిషాల పాటు ప్రసంగించి గత ప్రధానులందరికన్నా మిన్న అన్నట్లు సుదీర్ఘ ప్రసంగ రికార్డు నెలకొల్పారు. పహల్గాం—ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో పాకిస్థాన్‌కు హెచ్చరికలు, టెక్నాలజీ సహా పలు రంగాల్లో స్వయం సమృద్ధి, స్వావలంబన (ఆత్మనిర్భర్)పై వక్కాణింపులతోపాటు ఆర్‌ఎస్‌ఎస్‌కు ప్రశంసలు, చొరబాటుదారుల ముప్పు గూర్చిన హెచ్చరికలు ప్రధాని ప్రసంగంలో ప్రత్యేకించి గమనించదగినవి. దీపావళి నాటికి జిఎస్‌టి రేట్లు సంస్కరించి లఘు పరిశ్రమలకు పన్ను తగ్గింపు, ప్రజలకు ధరల తగ్గింపులతో ఉపశమనం కలగజేస్తామన్న వాగ్ధానం ప్రస్తావించదగింది.

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రపంచ దేశాలపై సాగిస్తున్న వాణిజ్య యుద్ధం పిడుగుపాటుగా మన దేశంపైకీ వచ్చి పడింది. 'ఆత్మీయ మిత్రుడనుకున్న' ట్రంప్ కాస్త ఆలస్యంగానైనా భారత్‌పై పెద్ద బాదుడే బాదుడు. భారత్ నుంచి దిగుమతులపై అమలులో ఉన్న 10 శాతం బేసిక్ సుంకంగాక 25శాతం సుంకాలు ప్రకటించాడు. వాణిజ్య ఒప్పందంపై ఒత్తిడి తేవడానికి ఈ చర్య తీసుకున్నాడనుకున్నారు. తన మాట ప్రకారం రష్యా అధ్యక్షుడు వి.పుతిన్ ఉక్రేన్‌పై యుద్ధం ఆపనందున, ఆదేశం నుంచి ఆయిల్ కొనరాదన్న అంక్షను భారత్ ఉల్లంఘిస్తోందంటూ, అటువంటి ఆయిల్ దిగుమతులపై మరో 25శాతం— వెరసి 50శాతం సుంకం విధించడం తెలిసిందే. ఇంత భారీ శాతం పన్ను విధించబడిన మరో దేశం బ్రెజిల్. అయితే ప్రధాని మోదీ సుదీర్ఘ ప్రసంగంలో ఈ భారీ సుంకాలను వాణిజ్య ఒప్పందం ద్వారా మన ఆర్థిక సార్వభౌమత్వంపై దాడికి చేస్తున్న ఒత్తిడిని ప్రస్తావించలేదు. కానీ పరోక్ష ప్రస్తావనగా, మన వ్యవసాయదారులు, పాల ఉత్పత్తిదారులు, మత్స్యకారులు దేశ ఎగుమతులకు తోడ్పడుతున్నారని, తాను ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటానని హామీయిచ్చారు. వాణిజ్య ఒప్పందంలో తమ ఉత్పత్తులకు ద్వారాలు తెరవాలని ట్రంప్ ఒత్తిడి చేస్తున్నది ప్రధానంగా ఈ రంగాలపైనే. స్వయం సమృద్ధి, స్వావలంబనపై వక్కాణింపును సైతం ఈ నేపథ్యంలోనే చూడాలి. స్వాతంత్ర్య శతవార్షికోత్సవం (2047) నాటికి 'సమృద్ధి భారత్' సాధించడం లక్ష్యమన్నారు. 'స్వతంత్ర భారత్' కోసం ఆనాటి తరం త్యాగాలు చేసినట్లు, ఈ తరం 'సమృద్ధి భారత్'కు అంకితం కావాలన్నారు. ఇది ఒక రాజకీయ పార్టీ కార్యక్రమం కాదన్నారు. స్వదేశీ వస్తువులనే కొనాలన్న తన 'ఓకల్ టు లోకల్' పిలుపును పునరుద్ఘాటించారు. వస్తువులు నాణ్యంగా, రేటు తక్కువగా ఉండాలని పారిశ్రామికవేత్తలకు సూచన చేశారు.

ఇరవై ఏళ్ల క్రితం ఆర్‌ఎస్‌ఎస్ నుంచి బిజెపిలోకి ఎగుమతి కాకముందు దాని ప్రచారక్‌గా దశాబ్దాలపాటు పనిచేసిన నరేంద్రమోదీ, ఆర్‌ఎస్‌ఎస్ శతవసంతాల సందర్భంగా దాన్ని ప్రపంచంలోనే అతిపెద్ద స్వచ్ఛంద సంస్థగా కొనియాడుతూ అసందర్భ ప్రస్తావన చేశారు. సేవ, అంకితభావం, సంస్థా గత నిర్మాణం, క్రమశిక్షణ దాని గుర్తింపు అంటూ తన విధేయతను చాటుకున్నారు.

చొరబాటుదారుల సమస్యను మొదటిసారి ప్రస్తావించిన మోదీ వారు దేశ ఐక్యతకు, సమగ్రత, భద్రతకు సవాలు అన్నారు. బంగ్లాదేశ్, మయన్మార్‌ల నుంచి ముస్లిం కాందీశీకులు అక్రమంగా దేశంలో ప్రవేశిస్తున్నారనేది దీర్ఘకాలంగా ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి చేస్తున్న ఆరోపణ. వీరు వివిధ రాష్ట్రాల్లో స్థిరపడి ఓటర్లుగా చేరి కొన్ని పార్టీలకు ఓటు బ్యాంక్‌గా మారారనేది ఇటీవల సంవత్సరాల్లో బలంగా చేస్తున్న ఆరోపణ. అటువంటి వారిని ఓటర్ల జాబితా నుంచి ఏరివేయటానికి తలపెట్టిందే బిహార్ ఓటర్ల జాబితా ముమ్మర క్షాళన. ఆ తదుపరి అది అన్ని రాష్ట్రాలకు విస్తరించనుంది. చొరబాటుదారులతో దేశ జనాభా కూర్పు మారిపోతున్నదని, ఇది లోతుగా ఆలోచించిన కుట్ర ప్రకారం సాగుతోందని ప్రధాని అన్నారు. ''వారు మన దేశ యువత ఉద్యోగాలు లాక్కుంటున్నారు. అమాయక గిరిజనులు భూములు ఆక్రమించుకుంటున్నారు, అమ్మాయిలకు ఎర వేస్తున్నారు, దీన్ని దేశం సహించదు.'' అన్నారు ప్రధాని. అంతర్జాతీయ చట్టాలను పాటిస్తూ అక్రమ వలసదారులను వెనక్కి పంపాల్సిందే. అయితే పొరుగు దేశాలతో సంప్రదింపుల ద్వారా ఆ పని జరగాలి. అక్రమ వలసదారుల పేరుతో స్వదేశీయులను వేధింపులకు గురి చేయరాదు. ప్రధాని 'సుదర్శన చక్రం' ప్రకటించారు. కీలకమైన వ్యూహాత్మక, పౌర వసతులను, మత ప్రదేశాలను కాపాడుకునే దేశీయ రక్షణ వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నామన్నారు. టెర్రరిస్టులను, వారి మద్దతుదారులను వేర్వేరుగా చూడబోమని పునరుద్ఘాటిస్తూ, పాకిస్థాన్ అణుబాంబు హెచ్చరికలకు బెదరబోమని, సింధూ జలాల సంధిని ఆమోదించబోమని ప్రధాని పాకిస్థాన్‌కు హెచ్చరిక చేశారు. స్వయం సమృద్ధి, ఆత్మ నిర్భర్ చాలాకాలంగా వింటున్న మాటలే— తగిన కార్యాచరణను ప్రభుత్వం అమలు చేయాలి.

# యోగి ప్రభుత్వంపై సమాజ్‌వాది సమరం

**లక్నో :** సోమవారంనాడు ఢిల్లీలో ఎన్నికల కమిషన్‌కు వ్యతిరేకంగా నిరసన సందర్భంగా పోలీసు బారికేడ్‌పైనుండి దూకి దేశం దృష్టిని ఆకర్షించిన సమాజ్‌వాదిపార్టీ జాతీయ అధ్యక్షుడు అఖిలేశ్‌యాదవ్, కేంద్రంలో మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, ఉత్తరప్రదేశ్‌లో యోగి ప్రభుత్వానికి వ్యతిరేకంగా రోడ్డెక్కటానికి తాను సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు.

2027 అసెంబ్లీ ఎన్నికల్లో యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వాన్ని గద్దెదించటానికై బిజెపికి వ్యతిరేకంగా తమ పిడిఎ (వెనుకబడిన తరగతులు, దళితులు, మైనారిటీలతో కూడిన పిచడా) అలయెన్స్ పోరాడుతుందని యాదవ్ చెప్పారు. 2029 లోక్‌సభ ఎన్నికల్లో కేంద్రంలో మోదీ ప్రభుత్వాన్ని తొలగించేందుకు పిడిఎ అలయెన్స్ కృషి చేస్తుందని యాదవ్, ఆయన పార్టీ నాయకులు చెప్పారు. పిడిఎ అలయెన్స్‌ను గ్రామస్థాయి నుంచి జిల్లా కేంద్రం వరకు పటిష్టం చేయాలని యాదవ్ తమ పార్టీ కార్యకర్తలను కోరారు. పరిపాలన విషయంలో సామాన్య ప్రజలకు సంబంధించిన ప్రతి అంశంలో యోగి ప్రభుత్వాన్ని అసెంబ్లీలో, వెలుపల నిలదీయాలని పార్టీ నాయకులను కోరారు.

విద్యార్థులు 50మందికన్నా తక్కువ ఉన్న స్కూళ్లను సమీపంలోని ఇతర స్కూళ్లతో విలీనం చేయాలన్న ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా సమాజ్‌వాది పార్టీ ఇటీవల ఆందోళన చేసింది. నూతన విద్యావిధానం, 2020ని అనుసరించి ఈ చర్య తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ చర్య పేద విద్యార్థులను చదువుకు దూరం చేస్తుందని, అందరికీ విద్య అన్న ఆర్‌టిఇ మౌలిక ప్రయోజనానికి వ్యతిరేకమని యాదవ్ అన్నారు. అలా విద్యకు దూరమయ్యే వారికోసం సమాజ్‌వాది పార్టీ రాష్ట్రవ్యాప్తంగా పిడిఎ పాఠశాలలు నిర్వహించాలని సమాజ్‌వాది పార్టీ నిర్ణయించింది. పిడిఎ పాఠశాల నిర్వహించేవారికి వ్యతిరేకంగా కేసులు దాఖలు చేస్తామని యోగి ప్రభుత్వం హెచ్చరించింది. ప్రభుత్వం—ప్రతిపక్షం మధ్య రానున్న కాలంలో ఈ ఘర్షణ ఏ రూపం తీసుకుంటుందో!

### ★ అధిష్టానం వైపు చూస్తున్న ప.బెంగాల్ కాంగ్రెస్

**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు 2026 మార్చి—ఏప్రిల్ లో జరుగుతాయి. రాష్ట్ర కాంగ్రెస్ ప్రస్తుతం క్రాస్‌రోడ్‌లో ఉంది. కాంగ్రెస్— 2016 అసెంబ్లీ ఎన్నికల నుంచి ప్రతిపక్ష సిపిఐ(ఎం) నాయకత్వంలోని లెఫ్ట్ ఫ్రంట్‌తో కలిసి ప్రయాణిస్తోంది. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ నాయకత్వంలోని ఇండి కూటమిలో ప.బెంగాల్ పాలకపార్టీ తృణమూల్ కాంగ్రెస్ ప్రధాన భాగస్వామిగా ఉన్నందున, రాష్ట్రంలో కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో టిఎంసితో సర్దుబాట్లతో పోటీ చేయవచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ముఖ్యమంత్రి మమతాబెనర్జీని గట్టిగా వ్యతిరేకించే అధిర్ రంజన్ చౌధురిని పిసిసి అధ్యక్షునిగా తొలగించటం ద్వారా కాంగ్రెస్ ఈ మేరకు టిఎంసికి సంకేతం పంపిందని భావించేవారున్నారు. అయితే మమతా బెనర్జీతో పొత్తు గౌరవప్రదంగా ఉండదనీ, సీట్ల విషయంలో ఏవో రొట్టెముక్కలు విసిరేసినట్లు ఆమె చూస్తుందనే అభిప్రాయం కాంగ్రెస్ కేంద్ర, రాష్ట్ర నాయకుల్లో ఉంది. ప్రస్తుత అసెంబ్లీలో లెఫ్ట్ ఫ్రంట్‌కు, అలాగే కాంగ్రెస్‌కు ప్రాతినిధ్యం లేదు. 2021 ఎన్నికల్లో బిజెపి బలం 77 నుంచి 65కు తగ్గింది. ఈ పర్యాయం అధికారం కోసం హోం మంత్రి అమిత్ షా ఇప్పటినుంచే పథకాలు రచిస్తున్నారు. అయితే బిజెపి పాలిత రాష్ట్రాల్లో బెంగాలీ మాట్లాడేవారిని బంగ్లాదేశ్ అక్రమ వలసదారులుగా నిర్బంధించి బలవంతంగా సరిహద్దుకు పంపుతున్న ఉదంతాలు బిజెపిని ఇరకాటంలో పెడుతున్నాయి.



మమతాబెనర్జీ దీన్ని ఉపయోగించుకొని బెంగాలీ జాతీయాభిమానానికి విజ్ఞప్తులు చేస్తున్నది.

కాగా, కాంగ్రెస్ ప్రభావం ఉన్న ప్రాంతాలు కొన్ని ఉన్నాయి. వాటికి టిఎంసి ఎసరు పెడుతోంది. అంతేగాక పొత్తుతో కొద్దిమంది ఎమ్మెల్యేలుగా గెలిచినా, ఆ తర్వాత టిఎంసిలో చేరబోరనే గ్యారంటీ ఏమీలేదు. అయితే అసెంబ్లీలో కొద్ది సీట్లు గెలుచుకుంటే రాజకీయ అస్థిత్వం చాటుకోవటానికి సహాయపడుతుంది. 2024 ఎన్నికల్లో గెలుపొందిన ఒక్క లోక్‌సభ సీటుకు తోడు కొన్ని అసెంబ్లీ సీట్లు కలిగి ఉండటం తమ రాజకీయ ప్రాసంగితకు బాటవేస్తుందనే భావన రాష్ట్ర కాంగ్రెస్ నాయకుల్లో ఉంది. ఈ సంవత్సరారంభంలో అధిర్ రంజన్ స్థానంలో సువాంకర్ సర్కార్‌ను బెంగాల్ పిసిసి అధ్యక్షునిగా నియమించిన నాటి నుండీ ఆయన మమతా బెనర్జీపై విమర్శలు తగ్గించారు. కాంగ్రెస్, టిఎంసి దగ్గరవుతున్నాయనేది జనాభిప్రాయంగా ఉంది. అయితే సర్కార్ గాంభీర్యం ప్రదర్శిస్తూ 294 అసెంబ్లీ సీట్లకు పోటీ చేయటానికి కాంగ్రెస్ సిద్ధంగా ఉందని, ఏమైనా అంతిమ నిర్ణయం అధిష్టానవర్గానిది అంటున్నారు. అయితే టిఎంసితో కాంగ్రెస్ పొత్తు కుదిరితే నిబద్ధత గల కాంగ్రెస్‌వాదుల ఓట్లు వామపక్షానికో లేక బిజెపికో పోతాయని భావిస్తున్నవారు లేకపోలేదు.

### ★ భవిష్యత్ ఎన్నికల్లో ఎఐ

**న్యూఢిల్లీ :** గత సంవత్సరం 60దేశాల్లో ఎన్నికలు జరిగాయి. వాటిలో భారత్ కూడా ఉంది. ఓటు హక్కు వినియోగించుకునే ఓటర్లశాతంపై జోశ్యాలు చెప్పటంలో, అటుఇటు మారే ఓటర్లను గుర్తించటంపై, ఓటరు ఎంపికలపై, ప్రభావపూరితంగా ప్రచార షెడ్యూళ్లను గరిష్ట పరచటంపై కృత్తిమ మేథ (ఎఐ) ముఖ్యమైన పాత్ర పోషించింది. ఈ సంవత్సరాంతంలో బిహార్ ఎన్నికల సందర్భంలో ఎఐ మళ్లీ వినియోగంలోకి రానుంది. ఉత్తరప్రదేశ్, బిహార్ రెండు కీలకమైన రాష్ట్రాలు. జాక్‌పాట్ ఎవరు కొడతారోనని రాజకీయ పార్టీలు జాగ్రత్తగా గమనిస్తున్నాయి. జాతీయ, రాష్ట్ర పార్టీలు బిహార్ ఎన్నికలకు సన్నద్ధమవుతున్నాయి. జనతాదళ్(యు) నాయకత్వంలోని పాలక కూటమి తన స్థితిని కాపాడుకోవాలని చూస్తుండగా, తేజస్వియాదవ్ నాయకత్వంలోని మహాగట్బంధన్ అధికారం కోసం అర్రులు చాస్తోంది.

కృతిమ మేధ లాభమా, శాపమా అని ప్రపంచవ్యాప్తంగా ఎన్నికల క్షేత్రంలో క్రమంగా చర్చలోకి వస్తుంది. వివిధ ప్రాంతాల్లో ఓటర్లపై ఎఐని ప్రయోగిస్తున్నారు. తమ ముందుకు తెస్తున్న సమాచారం తప్పో, ఒప్పో అర్థంగాక ఓటర్లు గందరగోళ పడుతున్నారు. ఎఐలో శ్రీఘంగా వస్తున్న పురోగతితో పాటు ప్రపంచవ్యాప్తంగా ఎన్నికల కార్యకలాపాలు నూతన శిఖరాలకు చేరాయి. దీంతో ఎఐ వినియోగం, ప్రభావంపై చర్చలు ముమ్మరమైనాయి. రాజకీయ పార్టీలు టెక్నాలజీని కొత్త మార్గాల్లో ఉపయోగిస్తున్నాయి. ఓటరు సెంటిమెంట్‌ను విశ్లేషించటానికి, వ్యక్తిగత ప్రచారం సందేశాలు పంపటానికీ ఎఐని ఉపయోగిస్తున్నారు. 2024 ఎన్నికల్లో ప్రధాని నరేంద్రమోదీ తమ నమో ఫ్లాట్‌ఫాం ద్వారా ఎఐని ఉపయోగించారు. ఒకేసారి అనేక ప్రాంతాల్లో ప్రసంగించటానికి ఆయన హోలోగ్రామ్స్ కూడా ఉపయోగించారు. స్వయంగా వెళ్లకుండానే ఎక్కువమంది ఓటర్లను చేరుకునేందుకు ఆయనకు ఈ టెక్నాలజీ ఉపయోగపడింది. వచ్చే బిహార్ ఎన్నికల్లో ఎఐ విస్తృతంగా వినియోగంలోకి వచ్చే అవకాశముంది. అయితే ఎఐతో మేళ్లతోపాటు కీడు కూడా ఉంది. అభ్యర్థుల గూర్చి తెలుసుకోవటానికి ఎఐ సమాచారం ఉపకరిస్తుంది. అయితే అది తప్పుడు సమాచారాన్ని కూడా చేరవేయగలదు. నకిలీ ఆడియో, వీడియో సందేశాలు సృష్టించటంలో మనవాళ్లు సిద్ధహస్తులని 2024 ఎన్నికలు చాటిచెప్పాయి. అందువల్ల ఏది సత్యం, ఏది అసత్యమో విశ్లేషించుకుని తెలివైన నిర్ణయాలకు రావలసిన బాధ్యత ఓటర్లపై ఉంటుంది. ఓటర్లతో నేరుగా సంబంధం పెట్టుకోవటానికి ఎఐ చాట్‌బోట్స్ ఎంతో ఉపయోగం. ఓటర్ల ప్రశ్నలకు నేరుగా సమాధానాలివ్వవచ్చు. ఓటర్ల నేపథ్యం, ఓటింగ్ చరిత్ర, ఇతర సంబంధిత అంశాలు ప్రాతిపదికగా ఓటర్లకు వ్యక్తిగత సందేశాలు పంపవచ్చు. ఎఐని సక్రమంగా, ప్రయోజనకరంగా వినియోగించుకోవటానికి భారీ ఖర్చుతో కూడిన టెక్నికల్ టీంలతో పాటు అభ్యర్థులకు, వారి ఎన్నికల ప్రచార నిర్వహణ యంత్రాంగం బాధ్యులకూ కృత్తిమ మేథ పరిజ్ఞానం అవసరం. ఇది సామాన్య ఓటర్ల నెత్తిమీదుగా వెళుతుంది. అందువల్ల సాంప్రదాయక ప్రచార పద్ధతులు, ఓటర్లను ప్రభావితం చేయటం, పోలింగ్‌బూత్‌లకు తీసుకెళ్లి ఓటు చేయించుకునే పద్ధతుల ప్రాధాన్యత కొనసాగుతుంది. అందువల్ల ఎన్నికలు మరీ వ్యయభరితం కానున్నాయి.

> *నూతన విద్యావిధానం, 2020ని అనుసరించి ఈ చర్య తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ చర్య పేద విద్యార్థులను చదువుకు దూరం చేస్తుందని, అందరికీ విద్య అన్న ఆర్‌టిఇ మౌలిక ప్రయోజనానికి వ్యతిరేకమని యాదవ్ అన్నారు. అలా విద్యకు దూరమయ్యే వారికోసం సమాజ్‌వాదిపార్టీ రాష్ట్రవ్యాప్తంగా పిడిఎ పాఠశాలలు నిర్వహించాలని సమాజ్‌వాది పార్టీ నిర్ణయించింది. పిడిఎ పాఠశాల నిర్వహించేవారికి వ్యతిరేకంగా కేసులు దాఖలు చేస్తామని యోగి ప్రభుత్వం హెచ్చరించింది.*

### క్లౌడ్‌బరస్ట్ ఘటన.. వాతావరణ మార్పులపై

# తక్షణ కర్తవ్యానికి పిలుపు

మన స్వాతంత్ర్య దినోత్సవానికి ముందురోజు జమ్మూ కాశ్మీర్‌లోని సుందరమైన లోయలలో ఒక పెను విషాదం చోటుచేసుకుంది. ఈ సంఘటన కిష్త్వార్ జిల్లాలోని చసోటి పట్టణంలో జరిగింది. హిమాలయ రాష్ట్రమైన ఉత్తరాఖండ్‌లోని భారీ వరదలు, బురదజల్లులు ఒక గ్రామాన్ని మొత్తం ముంచెత్తిన వారం రోజుల తర్వాత ఇది సంభవించింది. ఈ నెల 14న సంభవించిన వినాశకరమైన 'క్లౌడ్‌బరస్ట్' (మేఘ విస్ఫోటనం కుండపోత వర్షం) ఆ ప్రాంతంలో నీటిని, బురదను ప్రవాహంగా మార్చి, విధ్వంసాన్ని మిగిల్చింది. ప్రకృతి వైపరీత్యాలకు ఆ ప్రాంతం ఎంత సున్నితంగా ఉందో ఈ ఘటన మరోసారి నొక్కి చెప్పింది. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నప్పటికీ మనం కేవలం నష్టానికి చింతించడమే కాకుండా, ఇలాంటి విపత్తుల వెనుక ఉన్న శాస్త్రీయ కారణాలు, వాటి తీవ్రతను పెంచడంలో మన పాత్ర, భవిష్యత్తులో వీటిని ఎదుర్కోవడానికి అవసరమైన పటిష్టమైన వ్యూహం గురించి చర్చించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జమ్మూ కాశ్మీర్‌లోని ప్రభావిత ప్రాంతాల నుండి అందుతున్న ప్రాథమిక నివేదికలు భయానక చిత్రాన్ని చూపుతున్నాయి. ఒక చిన్న ప్రాంతంలో అకస్మాత్తుగా, అతి తీవ్రంగా కురిసిన వర్షం వల్ల ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడ్డాయి. నదులు క్షణాల్లో ఉప్పొంగి ఇళ్లను, వంతెనలను, రోడ్లను తుడిచిపెట్టేశాయి. నీటి ప్రవాహ వేగం, పరిమాణం ప్రజలకు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్ళే సమయం కూడా ఇవ్వలేదు. దీని ఫలితంగా తీవ్రమైన ప్రాణ, ఆస్తి నష్టం జరిగింది. ఇది ఏదో అరుదుగా జరిగిన సంఘటన కాదు, హిమాలయ రాష్ట్రాలను ఆందోళనకర స్థాయిలో పట్టిపీడిస్తున్న వాతావరణ సంబంధిత విపత్తుల పరంపరలో ఇది తాజా ఘటన మాత్రమే. ఈ విపత్తును అర్థం చేసుకుందాం.



క్లౌడ్ బరస్ట్ అనేది ఒక తీవ్రమైన వర్షపాత ఘటన. భారత వాతావరణ శాఖ ప్రకారం, సుమారు 20 నుండి 30 చదరపు కిలోమీటర్ల భౌగోళిక ప్రాంతంలో, గంటకు 100 మిల్లీమీటర్ల (లేదా 10 సెంటీమీటర్ల) కంటే ఎక్కువ వర్షపాతం అకస్మాత్తుగా కురిస్తే దానిని 'క్లౌడ్‌బరస్ట్' అంటారు. ఆకాశంలో నీటితో నిండిన ఒక పెద్ద బెలూన్ ఒక్కసారిగా పగిలిపోతే ఎలా ఉంటుందో, క్లౌడ్‌బరస్ట్ కూడా అలాంటిదే. సాధారణంగా, అధిక తేమను కలిగిన క్యుములోనింబస్ మేఘాల వల్ల ఇవి సంభవిస్తాయి. వెచ్చని, తేమతో కూడిన గాలి పైకి లేచినప్పుడు, నీటి బిందువులు కింద పడకుండా బలమైన గాలి ప్రవాహాల వల్ల పైకి నెట్టబడతాయి. దీనివల్ల చాలా పెద్ద మొత్తంలో నీరు ఒకేచోట పేరుకుపోతుంది. ఆ గాలి ప్రవాహాలు ఇక ఆ నీటి బరువును మోయలేనప్పుడు, ఆ నీరంతా ఒక్కసారిగా కుండపోతలా కిందకు పడుతుంది. జమ్మూ కాశ్మీర్ వంటి పర్వత ప్రాంతాలు ఈ పరిస్థితిని మరింత తీవ్రతరం చేస్తాయి. అక్కడి నిటారుగా ఉండే కొండ వాలుల కారణంగా, ఆ నీరు అపారమైన వేగంతో, శక్తితో కిందికి ప్రవహించి, వినాశకరమైన ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటం, బురద ప్రవాహాలకు కారణమవుతుంది. క్లౌడ్‌బరస్ట్‌లు సహజమైనవే అయినప్పటికీ వాటి సంఖ్య, తీవ్రత పెరగడానికి మానవ ప్రేరిత వాతావరణ మార్పులే ప్రధాన కారణం. భూతాపం పెరగడం వల్ల ఉష్ణోగ్రతలు పెరిగి, వాతావరణం ఎక్కువ తేమను పట్టి ఉంచే సామర్థ్యాన్ని పొందుతుంది. ఇలా అదనపు శక్తిని పుంజుకున్న వాతావరణం తీవ్రమైన వర్షపాతాలకు దారితీస్తుంది. అంతేకాకుండా, పర్యావరణపరంగా సున్నితమైన ప్రాంతాలలో విచ్చలవిడిగా, అస్తవ్యస్తంగా జరుగుతున్న పట్టణీకరణ, అటవీ నిర్మూలన, నిర్మాణ పనులు సహజ నీటి ప్రవాహ మార్గాలను అడ్డుకుంటున్నాయి. ఇది కొండ వాలులను బలహీనపరిచి, క్లౌడ్‌బరస్ట్ యొక్క విధ్వంసక శక్తిని మరింత పెంచుతుంది. మన దేశంలో క్లౌడ్‌బరస్ట్‌ల వల్ల జరిగిన విషాదాలకు సుదీర్ఘ చరిత్ర ఉంది. 2013లో ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్‌లో సంభవించిన క్లౌడ్‌బరస్ట్, దాని తర్వాతి వరదలు వేలాది మంది మరణానికి కారణమయ్యాయి. ఆ ఘటన మన బలహీనతను గుర్తు చేస్తూనే ఉంటుంది. ఇతర ముఖ్యమైన సంఘటనల గురించి తెలుసుకుంటే 2010లో లేహ్, లడఖ్‌లో వరుస క్లౌడ్‌బరస్ట్‌ల వల్ల ఆకస్మిక వరదలు, బురద ప్రవాహాలు ఏర్పడి విస్తృతమైన విధ్వంసం జరిగింది. అలాగే, 2005లో ముంబైలో సంభవించిన అపూర్వమైన క్లౌడ్ బరస్ట్ దేశ ఆర్థిక రాజధానిని స్తంభింపజేసి, వెయ్యి మందికి పైగా ప్రాణాలను బలిగొంది. 2022లో పవిత్ర అమర్‌నాథ్ గుహ సమీపంలో జరిగిన క్లౌడ్‌బరస్ట్ వల్ల యాత్రికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటనలన్నీ ఒక భయంకరమైన నిజాన్ని నొక్కి చెబుతున్నాయి. హిమాలయాల నుండి తీరప్రాంతాల వరకు, ఏ ప్రాంతమూ సురక్షితం కాదు. వీటివల్ల కలిగే ప్రధాన ప్రమాదాలు ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటం, మౌలిక సదుపాయాల నాశనం, వ్యవసాయ భూముల నష్టం, భారీ ప్రాణ నష్టం. క్లౌడ్ బరస్ట్‌ల ముప్పు పెరగడానికి గల ప్రధాన కారణాలను పరిశీలిస్తే మొదటగా వాతావరణ మార్పును చెప్పుకోవచ్చు. పెరుగుతున్న ప్రపంచ ఉష్ణోగ్రతలు జల చక్రాన్ని తీవ్రతరం చేసి తీవ్రమైన వాతావరణ సంఘటనలకు దారితీస్తున్నాయి. ఇక రెండవది భౌగోళిక స్వరూపం. హిమాలయ ప్రాంతంలోని నిటారుగా, అస్థిరంగా ఉండే కొండ వాలులు సహజంగానే కొండచరియలు విరిగిపడే ప్రమాదాన్ని కలిగి ఉంటాయి. తీవ్రమైన వర్షపాతం ఈ ప్రమాదాన్ని మరింత పెంచుతుంది. చివరిగా మానవ కారకాలు కూడా ముఖ్య పాత్ర పోషిస్తున్నాయి. నియంత్రణ లేని నిర్మాణాలు, వ్యవసాయం మౌలిక సదుపాయాల కోసం అటవీ నిర్మూలన, నదీ తీరాలను ఆక్రమించడం వంటివి విపత్తు ప్రమాదాన్ని పెంచుతున్నాయి. క్లౌడ్‌బరస్ట్ వంటి సహజ దృగ్విషయాన్ని నివారించడం అసాధ్యం. కానీ దాని ప్రభావాన్ని మనం ఖచ్చితంగా తగ్గించగలం. దీనికి బహుముఖ విధానం అవసరం. పర్యావరణపరంగా సున్నితమైన మండలాల్లో నిర్మాణం, భూ వినియోగంపై కఠినమైన నిబంధనలను అమలు చేయాలి. ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని పట్టణ ప్రణాళికను రూపొందించాలి. ముఖ్యంగా కొండ వాలులపై విస్తృతంగా చెట్లను నాటడం వల్ల నేల కోతను అరికట్టవచ్చు, కొండచరియలు విరిగిపడే ప్రమాదాన్ని తగ్గించవచ్చు. అంతేకాకుండా, చెక్ డ్యామ్‌లు, నీటి సంరక్షణ నిర్మాణాలను నిర్మించడం ద్వారా తీవ్రమైన వర్షపాతం సమయంలో నీటి ప్రవాహాన్ని నియంత్రించవచ్చు. ప్రజలలో అవగాహన కల్పించడం కూడా చాలా ముఖ్యం.

— డి.జయరామ్

### బిఆర్‌ఎస్ సోషల్‌మీడియా దుష్ప్రచారాన్ని

# తిప్పికొడుతున్న రేవంత్‌రెడ్డి



ఎస్.కె.జకీర్
సీనియర్ జర్నలిస్ట్

బిఆర్‌ఎస్‌కు సంబంధించిన యావత్తు సోషల్ మీడియా 'బలగాలు' కెటిఆర్, ఆయన నమ్మకస్థుల గుప్పిట్లో పని చేస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి 'మచ్చ' తీసుకురావడానికి, ఆయన అసమర్ధపాలకుడు' అనే ముద్ర వేయడానికి ప్రతిరోజూ ఒక కార్యాచరణ ప్రణాళికతో బిఆర్‌ఎస్ ముందుకు వెడుతోంది. తెలంగాణ రాజకీయాల్లో బిఆర్‌ఎస్ దూకుడు అధికారపక్షాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. బిఆర్‌ఎస్‌ను కాంగ్రెస్ పార్టీ కట్టడి చేయడంలో విఫలమవుతోందన్న చర్చ జరుగుతోంది. ''మనం ఇక అధికారంలోకి వచ్చేస్తున్నాం. ప్రజలు మళ్ళీ మనల్ని పట్టం గట్టడానికి సిద్ధంగా ఉన్నారు'' అని కెసిఆర్, కెటిఆర్, హరీశ్ రావు చేస్తున్న వ్యాఖ్యలు 'మైండ్‌గేమ్'లో భాగం. కానీ జనంలోకి ఇలాంటి ప్రకటనలు అత్యంత వేగంగా సూటిగా వెడుతున్నవి. గ్రామీణ ప్రాంతాల్లోనూ కెసిఆర్ మళ్ళీ సీఎం అయితేనే బాగుంటుందనే మౌత్ టాక్ నడిపిస్తున్నారు. అబద్దాలను నిజమనే అభిప్రాయం కలిగించేందుకు సోషల్ మీడియాను బిఆర్‌ఎస్ సమర్థంగా వాడుతున్నది. ప్రతి మారుమూల గ్రామంలోనూ స్మార్ట్‌ఫోన్ లేని వ్యక్తి కనిపించడం అరుదు. ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉన్న పరిస్థితిని సానుకూలంగా మలచుకున్న కెసిఆర్, కెటిఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై 'వ్యతిరేక' ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నారు.

అధికారపక్షం కాంగ్రెస్ పార్టీలో పరిస్థితి ఇందుకు పూర్తిగా విరుద్ధం. పదేండ్ల తర్వాత అతికష్ట మ్మీద అనూహ్య విజయాన్ని సాధించడానికి కీలక భూమిక పోషించిన రేవంత్‌కు పార్టీలో, అధికార వర్గాల్లో మద్దతు కరువవుతోంది. బిఆర్‌ఎస్ హయాంలో ఒక వెలుగు వెలిగిన 'కళంకిత' ఐఎఎస్, ఐపీఎస్ ఉన్నతాధికారులపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం, ఇటీవలి కాలంలో కొందరు ఏపీ అధికారులను డిప్యుటేషన్‌పై నియమిస్తుండడం ఒక మైనస్ పాయింటు అని రేవంత్ శ్రేయోభిలాషులంటున్నారు. రేవంత్‌రెడ్డి మాట వినకుండా కొందరు అధికారులు ఇంకా 'కేటీఆర్ మాటలు వింటున్నారు' అని చర్చ నడుస్తోంది. కేసీఆర్ మళ్ళీ అధికారంలోకి వచ్చే అవకాశాలపై బిఆర్‌ఎస్ చేస్తున్న 'వ్యూహాత్మక' ప్రచారం అధికార వర్గాలను ప్రభావితం చేస్తున్నదనే అనుమానాలు కలుగుతున్నవి. అధికారుల పనితీరు గురించి ముఖ్యమంత్రి రేవంత్ బహిరంగంగా అసంతృప్తిని వ్యక్తం చేసిన అనంతరం కూడా పెద్దగా ఫలితం లేదని సెక్రెటేరియట్ వర్గాలంటున్నవి.

ప్రతి విషయంలోనూ ప్రతిపక్షాలదే పైచేయి అవుతున్నట్లుగా ఒక బూటకపు వాతావరణాన్ని సృష్టించడంలో 'కెసిఆర్ విధేయ బృందాలు' తలమునకలై ఉన్నాయి. తెలంగాణలో కాకలు తీరిన కాంగ్రెస్ నేతల కొరత ఏమీ లేదు. వారంతా ఎందుకు తాత్సారంగా సినిమా చూస్తున్నట్లుగా ఉండిపోతున్నారో తెలియదు. దుష్ప్రచారం పడగ విప్పి కరాళ నృత్యం చేస్తున్నా బలంగా తిప్పి కొట్టలేకపోవడమేమిటో అర్థం కాదు. ప్రభుత్వ సలహాదారులు మిన్నకుంటున్నారని విమర్శలు వస్తున్నాయి. అధికార పార్టీ అధికార ప్రతినిధుల మూగనోము ఏమిటో ఆలోచించవలసిన విషయమే. ఇందుకు ప్రధాన కారణం ముఖ్యమంత్రిని, ప్రభుత్వాన్ని, పార్టీని పూర్తిస్థాయిలో 'సొంతం' చేసుకునే వారు లేకపోవడమే. ముఖ్యమంత్రికి బాసటగా, ఆయనకు వెన్నుదన్నుగా మీడియా పర్యవేక్షణ బాధ్యతలు చూడవలసిన ''మనుషుల్లో' ప్రతిభ కొరవడిందని అంటున్నారు.




వైఎస్.రాజశేఖరరెడ్డి వలే అత్యంత శక్తి సంపన్నుడు కాకపోయినా, ఒక్కసారి మంత్రిగా పనిచేసిన అనుభవమూ లేకపోయినా తన సొంత తెలివితేటలు, వైవిధ్యంగా ఆలోచించేతత్వం, సృజనాత్మకంగా నిర్ణయాలు తీసుకునే వైఖరితో ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి మెరుపులు మెరిపిస్తున్నారు. 'నాయకుడ్ని దెబ్బతీయాలంటే ముందుగా అతడ్ని ఏకాకి చేయాలి' అనే యుద్ధనీతితో రేవంత్‌ను బలహీనపరచేందుకుగాను కెసిఆర్, కెటిఆర్ దీర్ఘకాలిక ప్రణాళికను అమలుచేస్తున్నారు. అందులో భాగంగానే ముఖ్యమంత్రి రేవంత్‌కూ, రాహుల్‌గాంధీకి మధ్య గ్యాప్ ఉందంటూ ఒక ప్రచారం సాగిస్తున్నారు.

రేవంత్ కాంగ్రెస్ పార్టీకి 'పరాయి మనిషి' అని, కెటిఆర్, హరీశ్ రావులు నిందించడం, ఆ మనిషి అసలు కాంగ్రెస్ నాయకులను తొక్కుకుంటూ సిఎం పదవి చేబట్టారని వ్యాఖ్యలు చేస్తూనే ఉన్నారు. అసలు కాంగ్రెస్ పేరిట కొందరు కాంగ్రెస్ సీనియర్లను రెచ్చగొట్టే పనిలో ఉన్నారు. ముఖ్యమంత్రి కావాలన్న జీవితాశయం ఎవరికుండదు? అయితే అందరూ ఆ పదవిని అందుకోలేరు. శక్తి సామర్థ్యాలు, సొంత మేధస్సు, పది మందిని తన అనుచరులుగా మార్చుకోగల్గడం, విధేయులను కూడగట్టుకోవడం, అంగబలాన్ని సమకూర్చుకోవడం, చాకచక్యం, చాణక్యం, జనాకర్షణ, కార్యకర్తల్లో ఫాలోయింగ్, చేతికి ఎముక లేనట్టుగా డబ్బు ఖర్చు చేయడం వంటి అనేక లక్షణాలతో పాటు అదృష్టమూ ఉండాలని సీనియర్ రాజకీయ నాయకులంటుంటారు. పిసినారి ఎప్పుడూ రాజకీయాల్లో విజయం సాధించలేదన్న సామెత చాలా పురాతనమైనది.

టిడిపి నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చి ముఖ్యమంత్రి పీఠంలో కూర్చోవడం వరకు రేవంత్ రెడ్డి ప్రతి కార్యక్రమం సంచలనం! జనంలో విపరీతమైన క్రేజ్ ఆయన సొంత ప్రతిభతో సాధించుకోగలిగారు. పదేళ్ల ఏకఛత్రాధిపత్యం సాగించిన కెసీఆర్‌ను ఫామ్‌హౌస్‌కే పరిమితం చేయగల్గడంలో రేవంత్ కీలకపాత్ర పోషించారు. అధికారం చేపట్టాక కూడా సిఎం సంచలన నిర్ణయాలు తీసుకుంటున్నారు! కెసిఆర్ భాషలోనే కేసీఆర్‌ను ఢీ కొంటున్నారు. హైడ్రా, మూసీ, కంచె గచ్చిబౌలి, లగచర్ల భూవివాదం రేవంత్‌ను గతంలో చుట్టుముట్టాయి. ప్రధాన ప్రతిపక్షం బిఆర్‌ఎస్ రేవంత్‌ను 'అష్టదిగ్బంధం' చేయడానికి గట్టిగా ప్రయత్నించింది. కానీ క్రమంగా సన్నబియ్యం, రేషన్ కార్డుల జారీ,



ఇందిరమ్మ ఇల్లు వంటి కార్యక్రమాలతో ప్రభుత్వంపై ప్రజల్లో సానుకూలత ఏర్పడింది. కాంగ్రెస్ ప్రభుత్వంపై మొదట్లో కనిపించిన 'అసంతృప్తి' కానీ, వ్యతిరేకత కానీ ప్రస్తుతం కనిపించడం లేదు.

గత ప్రభుత్వ హయాంలో బిల్డర్లు, పెట్టుబడిదారులు, వ్యాపారులు, కొనుగోలుదారులు, అధికారులు, రాజకీయ నాయకులు కుమ్మ క్కు అయి ఇష్టం వచ్చినట్లు చెరువులు ఆక్రమించి అపార్టుమెంట్లు, విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీలను నిర్మించి పరిస్థితి అస్తవ్యస్తం చేశారు. వెనుక ముందు చూడకుండా నిబంధనలను గుడ్డిగా తొక్కిపెట్టి అక్రమ లే అవుట్లకు అనుమతి ఇచ్చిన అధికారులు,ప్రభుత్వ రాజకీయ పెద్దలు అందరూ దోషులే! అభివృద్ధి పేరిట హైదరాబాద్‌ను మహా నగరంగా మార్చి నాశనం చేసిన పాపం తలా పిడికెడు! కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చిన రేవంత్‌రెడ్డి ఈ అక్రమ కట్టడాలపై విరుచుకుపడడం సహజంగానే కెటిఆర్, ఆయన బృందానికి మింగుడు పడడం లేదు.

ఇదిలా ఉండగా రేవంత్ అత్యంత వేగంగా తీసుకునే నిర్ణయాలు, అశువుగా చేస్తున్న ప్రసంగాలు అందరినీ ఆకట్టుకుంటున్నవి. కొన్ని దుందుడుకు చర్యలు కొంత మేరకు మైనస్ అయినా మొత్తానికి ఎవ్వరూ ఊహించని స్థాయి నేతగా ఆయన ఎదిగారు. అయితే, రేవంత్ చుట్టూ మోహరించి ఉన్న వారిలో మంచీ, చెడూ ఏమిటో చెప్పగలిగినవారు సిఎం సమీపంలో ఉండాలి. బాగా మాట్లాడగలిగే సమర్థులైన అధికార ప్రతినిధులను నియమించుకోవాల్సి ఉంది.

## పదవ తరగతి టాపర్స్‌కు నగదు బహుమతులు



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** నారాయణపేట్ జిల్లా ఉట్కూర్ మండలం బిజ్వార్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గత సంవత్సరం పదవ తరగతి టాపర్స్ కు రెడ్డిల్ హన్మిరెడ్డి 5000, మీదిగేరి కనకప్ప జ్ఞాపకార్థం 2500, సప్పటి తిమ్మప్ప జ్ఞాపకార్థం 2500 మొత్తం 10,000 రూపాయలను మొదటి టాపర్ డి. కల్పనకు 5000, రెండవ టాపర్ జట్టం శ్రీనివాస్‌కు 2500, మూడవ టాపర్ ఎల్. అరుణ్ కు 2500 నగదు బహుమతులను పాఠశాల హెచ్ఎం. కిషోర్ కుమార్, హన్మిరెడ్డి, రమేష్, నరేష్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పాఠశాల అభివృద్ధికి విరాళం



**ప్రజాపక్షం/వంగూర్ :** మండల పరిధిలోని పోల్కంపల్లి ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి మాజీసర్పంచ్ భీమర్ల పద్మ భాస్కర్‌రెడ్డివారి కుమారుడు అర్జున్‌రెడ్డి పాఠశాల అభివృద్ధికిగాను లక్షరూపాయల చెక్కును విరాళంగా అడ్వైజర్ కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా అర్జున్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ ప్రాంత అభివృద్ధి కోసం వంగూరు మండల కేంద్రంతోపాటు పోల్కంపల్లి ప్రభుత్వ పాఠశాలను ఇంటిగ్రేటెడ్ పాఠశాలలుగా అభివృద్ధి చేస్తూ విద్యా విధానాన్ని మరింతముందుకు తీసుకువెళుతున్న సందర్భంగా వారి ఆశయాలను అనుసరిస్తూ అభివృద్ధిలో భాగస్వాములమవుతామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు సతీష్‌రెడ్డి, సాయన్న, రేణుకుమార్‌రెడ్డి, జంగయ్య, శంకర్, ఆనంద్, సలీం పాల్గొన్నారు.



## దాతల సహకారం మరువలేనిది

### విద్యార్థినులకు 20 సైకిళ్ల పంపిణీ

**ప్రజాపక్షం/పాన్‌గల్ :** విద్యాభివృద్ధికి దాతల సహకారం మరువలేనిది అని జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్ అన్నారు. శుక్రవారం పాన్‌గల్ మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన 20 మంది విద్యార్థినీలకు, ఓఎస్డీ శ్రీనివాస్, వనజ దంపతుల సూచన మేరకు నల్గొండ జిల్లా వాసి ఆర్ఎన్ఆర్ సివిల్ సర్వేయర్స్ మేనేజింగ్ డైరెక్టర్ నగర రమేష్ పాఠశాలకు చెందిన 20 మంది విద్యార్థినీలకు సుమారుగా 1 లక్ష 50వేల విలువ చేసే 20 సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని అన్నారు. విద్యతోనే బంగారు భవిష్యత్తు ఉంటుందని లక్ష్యాన్ని ఎంచుకొని చదవాలని సూచించారు. త్వరలోనే పాఠశాలల్లో చదివే విద్యార్థినీల అందరికి ఉచితంగా సైకిలను పంపిణీ చేస్తామన్నారు. ప్రతి ఒక్కరు కష్టపడి చదివి పాఠశాలకు ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎన్ఆర్ భరత్, మాజీ ఎంపీపీ వెంకటేష్ నాయుడు, మాజీ జడ్పీటీసీ రవి, మాజీ సింగిల్ విండో వైస్ చైర్మన్ భాస్కర్ యాదవ్, మాజీ ఎంపీటీసీ హైమావతి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పుల్గారావు, బ్రహ్మం, విష్ణు, పాఠశాల హెచ్ఎం విజయలక్ష్మి , ఫిజికల్ డైరెక్టర్ శ్యామల, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మూతలతో వీరుల చిత్రాలు



**ప్రజాపక్షం/నారాయణపేట్:** నారాయణ జిల్లా బాజాపూర్ గ్రామం ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సృజనతో చేసిన జాతి రత్నాల చిత్రపటాలు ఎంతో ఆకర్షణీయంగా నిలిచాయి. పాఠశాలకు వచ్చిన మన ఊరు మనబడి పెయింటింగ్ డబ్బాల మూతలు వృధాగా ఉంటే సేకరించి, వాటికి చక్కగా అలంకరణ చేసి అందులో జాతిరత్నాల చిత్రపటానికి పొందుపరిచారు. ఈ చిత్రపటాలను స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఊరేగించారు. వాటిని చూసి గ్రామస్తులు అబ్బురపడ్డారు. ఎంతో ఆసక్తిగా తిలకించారు. అతి తక్కువ ఖర్చుతో చేయడమే కాకుండా, బాల్యం నుండే విద్యార్థుల మదిలో స్వాతంత్ర సమరయోధులను ముద్రించడం ఎంతో అభినందనీయమని విద్యార్థుల సృజనను కొనియాడారు.

## ప్రశంసాపత్రం అందజేత



**ప్రజాపక్షం/నారాయణపేట్:** స్వతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లా కేంద్రం నారాయణపేటలోని పోలీసులు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో నారాయణపేట్ మండలంలోని జిల్లాల పూర్ పశు వైద్య కేంద్రంలో వెటర్నరీ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న వై.కృష్ణకి పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి కలెక్టర్ సిక్తా పట్నాయక్ చేతుల మీదుగా ఉత్తమ ఉద్యోగిగా ప్రశంసాపత్రాన్ని అందించారు. ప్రశంప పత్రం నందివడం పట్ల అధికారులు ఆమెను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి, ఎస్పీ యోగేష్ గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ సేవలకు ప్రశంస

**ప్రజాపక్షం/కృష్ణ:** విధి నిర్వహణలో అంకితభావం, నిబద్ధతతో కృష్ణ ఎస్సైగా విధులు నిర్వహిస్తూ అందించిన సేవలకు గుర్తింపు 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా నేడు నారాయణ పేట్ జిల్లా కేంద్రం పేరెడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రివర్యులు వాకిటి శ్రీహరి చేతులు మీదుగా ఉత్తమ అవార్డు అందుకున్న ఎస్సై నవీద్ హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా కృష్ణ మండల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ నిజాయతీ నిబ్బద్ధతకు గుర్తింపు లభిస్తుందని, మును ముందు మరింత ఉత్సహంగా పని చేసి రాష్ట్ర స్థాయిలో అతుత్యమ అవార్డు అందుకోవాలని కోరారు.

## బిజినేపల్లి మండలవాసికి రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఎడిసి అవార్డు



**ప్రజాపక్షం/బిజినేపల్లి :** 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ ఆర్‌టిసిలో హైదరాబాద్ జోనల్ పరిధిలో అవార్డులను ప్రకటించారు. ఇందులో భాగంగా నాగర్‌కర్నూల్ తాలుకా జిల్లా బిజినేపల్లి మండలం వడ్డేమాన్ గ్రామానికి నాగర్‌కర్నూల్ డిపోలో ఎడిసిగా విధులు నిర్వహిస్తున్న పరుషరాములుకు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఎడిసిగా అవార్డురావడం వలన డిపో మేనేజర్ యాదయ్య, సీఐ, ఏడిసిలు, టిఐటు బాల్‌రెడ్డి అభినందనలు తెలియజేశారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఎడిసిగా పరుషరాములుకు అవార్డు రావడం పట్ల కార్మికులు సురేష్, వంశీధర్‌రావు, విజయ్, సత్యం, పెంటయ్యలు హర్షం వ్యక్తం చేశారు. ఈ అవార్డును స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్ ఎంజిబిఎస్ బస్టాండులో హైదరాబాద్ జోనల్ ఈడి కుష్రోశాఖాన్ చేతులమీదుగా అందుకున్నట్లు తెలిపారు.

# కనుమరుగవుతున్న కళలను ప్రోత్సహిద్దాం

### స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మంత్రి జూపల్లి కృష్ణారావు



**ప్రజాపక్షం/మహబూబ్ నగర్ :** మన దేశ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని రాష్ట్ర ప్రోహిబిషన్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. శుక్రవారం మహబూబ్‌నగర్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో పాల్గొని జెండా ఆవిష్కరించిన అనంతరం ఆయన జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. మనిషి తలుచుకుంటే ప్రపంచంలో ఏదయినా సాధించవచ్చు, చదువుకు పరమార్థం అక్షర గ్యాణం కాదని ఆయన అన్నారు. సమాజాన్ని సంస్కరించే విధంగా మన చదువు కొనసాగాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, పాల్గొన్న మహబూబ్‌నగర్ ఎంపీ డి.కె.అరుణ, శాసనసభ్యులు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ డి.జానకి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల

# ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యం



శాసనమండలి చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి

**ప్రజాపక్షం/వనపర్తి :** తెలంగాణ రైజింగ్ 2047తో 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మండలి చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం వనపర్తి జిల్లాలోని ఐడిఓసి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు చీఫ్ విప్ ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ గౌరవ వందనాన్ని స్వీకరించి వివిధ శాఖల ద్వారా జిల్లాలో అమలవుతున్న సంక్షేమ,, అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన లక్ష్యాలపై ప్రగతి నివేదికను చదివి వినిపించారు. అనంతరం స్వాతంత్ర సమరయోధుల కుటుంబ సభ్యులను శాలువాతో సత్కరించారు. వేదికపై జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ గిరిధర్ రావుల, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యానాయక్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ వీరారెడ్డి, డీఎస్పీలు, జిల్లా అధికారులు, వనపర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, పెబ్బేరు మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమోదిని, ఇతర ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, సిబ్బంది, చిన్నారులు, ప్రజలు, విద్యార్థులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితమే జెండా పండుగ

### ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/వెల్దండ :** స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగానే భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. 79వ స్వాతంత్ర్యదినోత్సవాన్ని వెల్దండ మండలకాంగ్రెస్ పార్టీ కార్యాలయంపై జాతీయజెండాను ఆవిష్కరించారు. మండల కేంద్రంలోని 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయ ఆవరణంలో ఆయాసంస్థలముందు జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ భీష్వకార్తీక్‌కుమార్, వెల్దండ సర్కిల్ కార్యాలయంపై సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్ కౌసల్య, ఎంపిడిఓ కార్యాలయంపై ఇంచార్జీ ఎంపిడిఓ లక్ష్మణ్ నాయక్, ఐకెపి కార్యాలయంపై ఇపిఎం, మండల వ్యవసాయ కార్యాలయంపై ఏఓ శోభ, విద్యుత్ కార్యాలయంపై ఇంచార్జీ ఏఈ వెంకటేష్, సింగిల్ విండో కార్యాలయంపై చైర్మన్ జూపల్లి భాస్కరరావు, వెల్దండ గ్రామపంచాయతీ కార్యాలయంపై కార్యదర్శి గిరి, పశువైద్య కార్యాలయంపై డాక్టర్ శ్యాంసుందర్, బిసిహస్టల్‌పై వార్డెన్ శ్రీరాములు, అంబేద్కర్ యువజనసంఘం కార్యాలయంపై అధ్యక్షుడు అనిల్‌లు జాతీయజెండాలను ఆవిష్కరించారు. ఈకార్యక్రమాలలో వివిధపార్టీల నాయకులు జూపల్లిభాస్కరరావు, భూపతిరెడ్డి, మోతిలాల్‌నాయక్, మట్టవెంకటయ్యగౌడ్, పర్వత్‌రెడ్డి , కొమ్మగొనివెంకటయ్యగౌడ్, జంగిలినిరంజన్, పుల్లయ్య, ఎర్రశ్రీను ముదిరాజ్ పాల్గొన్నారు.

# మక్తల్‌లో ఫింగర్ ప్రింట్ డివైస్‌తో తనిఖీలు



**ప్రజాపక్షం/మక్తల్ :** ఎస్పీ ఆదేశాల మేరకు మక్తల్ బస్టాండ్, బ్యాంకుల వద్ద రద్దీ గల ప్రధాన చౌరస్తాల్లో దొంగతనాలు నిర్మూలించడానికి ముందస్తు భద్రత చర్యల్లో భాగంగా పూర్తి స్థాయిలో నిఘా ఉంచి, ఫింగర్ ప్రింట్ డివైస్‌తో ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని మక్తల్ ఎస్సై భాగ్యలక్ష్మి రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై భాగ్యలక్ష్మి రెడ్డి మాట్లాడుతూ మక్తల్ బస్టాండ్, బ్యాంక్‌ల వద్ద అనుమానిత వ్యక్తులను ఫింగర్ ప్రింట్ డివైస్‌తో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించడం జరిగిందని, బస్టాండ్‌లో ప్రయాణికుల మాటున కొంతమంది వ్యక్తులు రద్దీగా ఉన్న సమయంలో దొంగతనాలకు పాల్పడుతున్నారని అలాంటి వాటికి చెక్ పెట్టడానికి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. బస్సుల్లో, ప్రయాణించేటప్పుడు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. బస్టాండ్‌లో ప్రయాణికులు బస్సు ఎక్కి దిగే సమయంలో జాగ్రత్తలు పాటించాలని తమ విలువైన బంగారు వస్తువులను, బ్యాగులను, పర్సులను జాగ్రత్తగా ఉంచుకోవాలని కోరారు. అలాగే అపరిచిన వ్యక్తులు ఏమైనా తినుబండరాలిస్తే తీసుకోరాదని ప్రయాణికులకు సూచించారు. అలాగే బ్యాంకు ల వద్ద పెద్ద మొత్తంలో డబ్బులు డ్రా చేసుకోవడానికి అమౌంట్ డిపాజిట్ చేయడానికి వచ్చేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని బ్యాంకుల వద్ద దొంగలు మాటు వేసి వెంట ఫాలో అయి దొంగతనాలకు పాల్పడుతున్నారని అలాంటి వారి పట్ల జాగ్రత్తలు పాటించాలని ఎస్సై కోరారు. మక్తల్ పరిధిలో అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే వెంటనే డయల్ 100కి లేదా లోకల్ పోలీసులకు సమాచారం ఇవ్వాలిన ఎస్సై తెలిపారు. ఈ తనిఖీల్లో మక్తల్ పోలీసులు ఆనంద్, మహేష్ పాల్గొన్నారు.

# వాడవాడలా త్రివర్ణ పతాక రెపరెపలు




**ప్రజాపక్షం/వీపనగండ్ల :** 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను మండలంలో అధికారులు, నాయకులు ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. తహసీల్దార్ వరలక్ష్మి , ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎస్ఐ కె.రాణి, మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు చిట్టెమ్మ, మండల వైద్యాధికారి డా. ప్రియాంక, వ్యవసాయ అధికారి డాకేశ్వర్ గౌడ్, ప్రిన్సిపల్ శివగౌడ్, జిల్లా పరిషత్ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాను ప్రకాశ్, రైతు కమిటీ అధ్యక్షులు, వెంకట్‌రెడ్డి, వారి వారి కార్యాలయం వద్ద జాతీయ జెండాలను ఎగురవేశారు.

**పాన్‌గల్‌లో....** పాన్‌గల్ మండలంలో 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా శుక్రవారం జాతీయ జెండాను ఎగురవేసి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ వద్ద ఎస్ఐ శ్రీనివాస్ యాదవ్, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి, సింగిల్ విండో కార్యాలయంలో వైస్ చైర్మన్ బాలయ్య, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడిఓ గోవిందరావు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డా.చంద్రశేఖర్, రైతు వేదిక వద్ద ఏఓ తిప్పే స్వామి, గ్రంథాలయంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్, విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద ఏఈ చందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు పెబ్బేటి వీరసాగర్‌లు జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు శ్రీధర్ రెడ్డి, వెంకటేష్ నాయుడు, మాజీ జడ్పీటీసీ రవికుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, వివిధ శాఖల అధికారులు, యువకులు పాల్గొన్నారు.

**కొత్తకోటలో...** గాడ్స్ ఆన్ వారియర్స్ షోతో ఖాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో పలు స్కూళ్లలో విద్యార్థుల చేత కరాటే డెమో స్టేషన్ ఇవ్వడం జరిగింది. కొత్తకోట పట్టణంలోని బెస్ట్ గ్రామర్ స్కూల్‌లో కరాటే డెమో స్టేషన్ విద్యార్థుల చేత ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో క్లబ్ సీనియర్ కరాటే మాస్టర్ జి.హరీష్ యాదవ్, జాఫర్, సాదిక్, ఇంతియాజ్, ఎస్‌కె.బాబా, ఆజ్మీర్‌లో పాల్గొన్నారు.

**అమరచింతలో ...** 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అమరచింత మండలంలో శుక్రవారం అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. అమరచింత మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు తహసీల్దార్ రవికుమార్ , మండల ప్రజా పరిషత్ కార్యాలయం ముందు తహసీల్దార్ రవికుమార్, మండల ప్రజా పరిషత్ కార్యాలయం ముందు ఎంపీడీఓ శ్రీనివాసులు, పురపాలక కార్యాలయం ముందు కమిషనర్ నాగరాజ్, పోలీస్ స్టేషన్ వద్ద ఎస్ఐ హిమబిందు, మండల వ్యవసాయ కార్యాలయం ముందు ఏఓ అరవింద్, ప్రభుత్వ పాఠశాలల ముందు ప్రధానోపాధ్యాయులు, జాతీయ జెండాలను ఎగురవేశారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యాలయం ముందు కార్యదర్శులు జాతీయ జెండాలను ఎగురవేశారు.

**వంగూర్ మండలవ్యాప్తంగా...**



**ప్రజాపక్షం/వంగూర్ :** మండలకేంద్రంతోపాటు మండలపరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలతోపాటు ప్రభుత్వ కార్యాలయాల్లో 79వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మురళిమోహన్, ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిడిఓ బ్రహ్మాచారి, ఐకెపి కార్యాలయంలో సైదులు, ఇజిఎస్ కార్యాలయంలో శివశంకర్ గౌడ్, పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ మహేష్ త్రివర్ణపతాకాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



## సమాజ శ్రేయస్సుకోసం జర్నలిస్టులు పాటుపడాలి : ఎస్పీ

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** సమాజ శ్రేయస్సు కోసం జర్నలిస్టులు నిరంతరం పాటుపడాలని ఎస్పీ యోగేష్ గౌతం సూచించారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో టియూడబ్ల్యూజే (ఐజేయు) ఆధ్వర్యంలో రూపొందించిన యూనియన్ ఐడెంటిటీ కార్డులను ఎస్పీ చేతుల మీదుగా యూనియన్ నాయకులు ఆవిష్కరింపజేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వార్తల విశ్లేషణ ఉండాలన్నారు. జిల్లా అధ్యక్షులు కోయిలకొండ నారాయణరెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే తమ యూనియన్ ఆధ్వర్యంలో జర్నలిస్టుల పిల్లల ఉచిత విద్య ప్రొసీడింగ్ జారీ చేయించడం జరిగిందని, జర్నలిస్టుల హక్కులు సమస్యల సాధన కోసం తమ యూనియన్ ఎల్లప్పుడు ముందుంటుందన్నారు. ఇలా కేంద్రంలో ప్రెస్ క్లబ్ సాధించిన ఘనత తమ యూనియన్ కే దక్కుతుందన్నారు. త్వరలోనే తమ యూనియన్ జిల్లా కార్యవర్గ సభ్యులందరికీ ఐడి కార్డులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంజీవ ప్రకాష్, రాజేష్, నక్క శ్రీనివాస్, రఘు గనప, యాదగిరి ప్రవీణ్, నర్సింలు, శ్రీనివాస్, మహమ్మద్ తఖీ, నరసింహ, సులిగం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## మహనీయుల త్యాగఫలమే స్వాతంత్ర్యం



### డిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** ఎందరో మహనీయుల పోరాటం, త్యాగఫలమే దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందని డీసీసీ అధ్యక్షుడు, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూధన్ రెడ్డి అన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు జాతీయ జెండాను ఎగుర వేసి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జవహర్ లాల్ నెహ్రూ నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌గౌడ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వసంత, నాయకులు ఎన్‌పి వెంకటేష్, చంద్రకుమార్ గౌడ్ అన్వర్ పాష, సీజే బెనహర్, సిరాజ్ ఖాద్రీ, అరవింద్ రెడ్డి, రాఘవేందర్ రాజు, సాయిబాబా, రాములు యాదవ్, అవేజ్ అజ్మత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## స్పోర్ట్స్‌వేర్ షాప్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/పెబ్బేరు :** పెబ్బేరు మండల కేంద్రానికి చెందిన క్రికెట్ కోచర్ శంకర్ పెబ్బేరు మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసుకున్న స్పోర్ట్స్ షాపును శుక్రవారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యతో పాటు విద్యార్థులకు క్రీడపై కూడా పట్టుండాలని క్రికెట్ క్రీడల్లో శిక్షణ ఇచ్చే శంకర్ స్వయంగా తానే స్పోర్ట్స్ షాప్‌ను ఏర్పటు చేసుకోవడం అభినందనీయమని ఎమ్మెల్యే శంకర్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు ప్రమోదిని రెడ్డి, ఉపాధ్యక్షులు విజయవర్ధన్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, పెబ్బేరు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకట్రాములు, దయాకర్ రెడ్డి, కిసాన్ సెల్ అధ్యక్షులు జగదీశ్వర్ రెడ్డి, గంధం రాజశేఖర్, యుగంధర్ రెడ్డి, భాను ప్రకాశ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**శ్రీశైలం నిర్వాసితులకు త్వరలో ఉద్యోగాలు**

98 జీఓ పరిధిలోని శ్రీశైలం నిర్వాసితుల సమస్యపై శుక్రవారం నిర్వాసితులు ఎమ్మెల్యేను కలుసుకున్నారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ముగించుకొని తిరుగు ప్రయాణంలో ఉన్న సందర్భంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మీ సమస్యపై కొల్లాపూర్ మంత్రి జూపల్లి కృష్ణారావు, నేను కలిసి ఈ అంశాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని త్వరలోనే మీకు ఉద్యోగాలు లభిస్తాయి. మీరు ధైర్యంగా ఆనందంగా ఉండండి అని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే హామీతో నిర్వాసితులు ఆనందం వ్యక్తం చేసి తమ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్న ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాసితులు గోవిందు, సుధాకర్, నిర్వాసితులు పాల్గొన్నారు.

## జాతీయ జెండాను ఆవిష్కరించిన ఎస్పీ

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** 79వ స్వాతంత్ర్య దినోత్సవం ను పురస్కరించుకని నారాయణపేట జిలా ప్రజలకు, జిల్లా పోలీస్ అధికారులకు, సిబ్బందికి ఎస్పీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ యం.డి రియాజ్ హుల్ హక్, డీఎస్పీ ఎన్.లింగయ్య, సీఐ శివ శంకర్, రామ్‌లాల్, రాజేందర్ రెడ్డి, సైదులు, ఆర్ఐ నరసింహ, ఎస్ఐ లు, డిపిఓ స్టాప్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**సీనియర్ సిటిజన్ ఫోరం కార్యాలయంలో పతాక ఆవిష్కరణ**

**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్ల పట్టణంలోని సీనియర్ సిటిజన్ ఫోరం కార్యాలయంలో 79 వ స్వాతంత్ర దినోత్సవం పతాక ఆవిష్కరణ జరిగిన సందర్భంగా అనంతరము తెలంగాణ శరీర అవదాతల రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు జిల్లా కన్వీనర్ జల్లి ఉదయ్ కుమార్, సీనియర్ సిటిజన్స్ అధ్యక్షులు నయుముద్దీన్, కార్యదర్శి వేణుగోపాల్, అధ్యక్షులు కాట్రేపల్లి లక్ష్మయ్య, వాల్‌పోస్టర్ కరపత్రం ఆవిష్కరించారు. ఇదే సందర్భంలో బ్రహ్మకుమారీస్ జడ్చర్ల 22న శుక్రవారం జరిపే రక్తదాన శిబిరంలో పాల్గొనాలని రఘువయ్య అందరిని ఆహ్వానించారు. శంకర్ బాబు, ఆశీర్వాదం, ఇమామొదిన్, జమీల బేగం, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**వృద్ధాశ్రమంలో వేడుకలు ...**

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** పట్టణంలో ప్రజల భాగస్వామ్య సంస్థ, డిడబ్ల్యూఓకో మేనేజ్‌మెంట్ వృద్ధాశ్రమంలో శుక్రవారం 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. జాతీయపతాకాన్ని నిర్వాహకులు పెరుమాళ్ల వెంకటయ్య ఆవిష్కరించారు. ఈసందర్భంగా వృద్ధులకు పండ్లు, దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమ కోఆర్డినేటర్ పద్మ, అసిస్టెంట్ కోఆర్డినేటర్ పరమేష్, యోగటీచర్ సునంద, వృద్ధులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆరు నెలల్లో సహకార వ్యవస్థ మరింత అభివృద్ధి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ పాలకవర్గాలను రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ మరో ఆరు నెలల కాలం పాటు పొడిగించినందుకు రాష్ట్ర ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామని జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్ కుంభం శ్రీనివాసరెడ్డి అన్నారు. పట్టణంలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ప్రధాన కార్యాలయ ఆవరణలో ముఖ్యమంత్రి, మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సహకార కేంద్ర బ్యాంక్ పాలకవర్గాలను మరో ఆరు నెలలు పొడిగింపు చేసినందుకు మంత్రులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఆరు నెలల కాలంలో ఈ సహకార వ్యవస్థను ఎంతో అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు పాశం సంపత్ రెడ్డి, గుడిపాటి సైదులు, కొండ సైదయ్య, ధనావత్ జయరాం, బంటు శ్రీనివాస్, కందరబోయిన వీరస్వామి , గొల్లగూడ పిఏసిఎస్ చైర్మన్ ఆలకుంట్ల నాగ రత్నం రాజు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య ఫలాలు ప్రతి ఒక్కరికీ

**ప్రజాపక్షం/దేవరకొండ:** భారత స్వాతంత్ర్య ఫలాలు ప్రతి ఒక్కరికి చేరుకోవాలని పాలక ప్రభుత్వాలు పేద బడుగు బలహీన వర్గాలకు విద్యా, వైద్యం, కూడు, గూడు వసతి కల్పించి సమాజంలో గౌరవప్రదంగా బతికేలా సమానతలు లేని సమాజం కోసం సమ సమాజ స్థాపనకు పాటుపడాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పట్టణంలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్ సిపిఐ కార్యాలయంలో జాతీయ జెండాను నర్సింహారెడ్డి ఆవిష్కరించారు.



ఈకార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి దేప సుదర్శన్‌రెడ్డి, పట్టణ కార్యదర్శి వలమల్ల ఆంజనేయులు, మండల కార్యవర్గ సభ్యులు రాంరెడ్డి, వెంకట్రాములు, నీలా వెంకటయ్య, పట్టణ సహాయ కార్యదర్శులు నగేష్, జ్యోతిబస్, ఏరియా శాఖ కార్యదర్శులు పాల్గొన్నారు.



## జర్నలిస్టుల సంక్షేమానికి కృషి

### ఎంపి రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** జర్నలిస్టుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్‌లు అన్నారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో అర్హులైన పేద జర్నలిస్టులకు ఇండ్ల పట్టాలను వారు సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్‌తో కలిసి పంపిణి చేసి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో ప్రతి ఒక్క పేదలకు సంక్షేమ పథకాలు అందుతాయని అన్నారు. గత ప్రభుత్వ కాలంలో చేసిన అప్పులను తీర్చడంతోపాటు తెలంగాణ రాష్ట్రాన్ని లాభాల రాష్ట్రంగా తీసుకొచ్చి అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేస్తుందన్నారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పేద జర్నలిస్టులకు ఇండ్ల పట్టాలు అందించడం శుభపరిణామమన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగ ఉంటూ అనేక ప్రజా సమస్యల పరిష్కారంలో జర్నలిస్టులు పోషిస్తున్న పాత్ర ఎనలేనిదన్నారు. జర్నలిస్టులకు ఇండ్ల పట్టాలతోపాటు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామన్నారు. ప్రస్తుతం ఇండ్ల పట్టాలు రాని వారు ఎలాంటి ఆందోళన చెందవద్దని అర్హులైన వారందరికి ఇండ్ల పట్టాలు అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం జర్నలిస్టులు ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, సబ్ కలెక్టర్, డీఎస్పీలను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రాజశేఖర్‌రాజు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, చిలుకూరు బాలు, మహమ్మద్ జాని, గంధం రామకృష్ణ, దేశిడి శేఖర్‌రెడ్డిలతోపాటు తహసీల్దార్ సురేష్‌కుమార్, ఆర్ఐ ఠాకూర్ రామకృష్ణ, జర్నలిస్టులు ఖాజా హమీదొద్దీన్, అస్లాం, అయూబ్, వెంకన్న, మనోజ్, మంద సైదులు ఉన్నారు.

## గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు యువకులు అరెస్ట్



**ప్రజాపక్షం/ హాలియా:** గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు యువకులను హాలియా పోలీసులు పట్టుకున్నట్లు మిర్యాలగూడ డిఎస్పి రాజశేఖర్ రాజు తెలిపారు. శుక్రవారం సాయంత్రం హాలియా పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గంజాయి అమ్ముతున్న యువకులను పట్టుకొని అరెస్టు చేసినట్లు చెప్పారు. జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవర్ ఆదేశాల మేరకు గంజాయి పై ఉక్కు పాదం మోపెందుకు గంజాయి విక్రయిస్తున్న వారిపై నిఘాపెట్టినట్లు చెప్పారు. దీనిలో భాగంగానే హాలియా శివారులోని అల్వాల ఎక్స్ రోడ్డు సమీపంలోని పంగవానికుంట తండా లో ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ దగ్గర గంజాయి సరఫరా చేసుకుంటున్నా ముగ్గురు యువకులను హాలియా సీఐ సతీష్ రెడ్డి,ఎస్ఐ సాయి ప్రశాంత్ లు పట్టుకున్నట్లు చెప్పారు. గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు యువకులు ఆంధ్రప్రదేశ్ లోని పల్నాడు జిల్లాలో గల వెల్దుర్తి మండలానికి చెందిన వజ్రాల రాజశేఖర్ రెడ్డి, పంగవానికుంట తండాకు చెందిన కుంచాల వేణు, తిరుమలగిరి సాగర్ మండలం అల్వాల గ్రామానికి చెందిన గురజాల మహేందర్ లు గంజాయి అమ్ముతున్నట్లు చెప్పారు. వీరిని పట్టుకోగా వారి నుంచి 1.650 కిలోల గంజాయి ని పట్టుకున్నట్లు దాని విలువ 40 వేల రూపాయలు ఉన్నట్లు చెప్పారు. వారి నుంచి ఒక పల్సర్ బైక్ 2వేల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. గంజాయి సరఫరాకు సంబంధించిన గడిగంటి అచ్చయ్య, తిరుమల కొండ ఏసుబాబులు పరారీలో ఉన్నట్లు వారి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. పట్టుబడిన ముగ్గురిపై కేసు నమోదు చేసి నిందితులను కోర్టుకు హాజరు పరిచినట్లు చెప్పారు. ఈ ఆపరేషన్లో కీలకంగా వ్యవహరించిన హాలియా సీఐ సతీష్ రెడ్డి, ఎస్ఐ సాయి ప్రశాంతులను జిల్లా ఎస్పి ప్రత్యేకంగా అభినందించినట్లు డిఎస్పి రాజశేఖర్ రాజు తెలిపారు.

## పాఠశాల భవనాలు దేవాలయాలను తలపించాలి

### ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి




**ప్రజాపక్షం/చండూరు/నాంపల్లి** :మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థిని విద్యార్థులకు అన్ని సదుపాయాలతో కూడిన విద్యను అందించే విధంగా కృషి చేస్తానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. ప్రభుత్వ విద్యను ప్రోత్సహిస్తు మునుగోడు శాసనసభ్యులు శ్రీ కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి మరో అడుగు ముందుకు వేసి ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టారు.నియోజకవర్గ వ్యాప్తంగా 43 క్లస్టర్ పాఠశాలలను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు.మొదటగా మండల కేంద్రాలలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించడానికి ఈరోజు హైదరాబాద్ కు చెందిన ప్రముఖ ఆర్కిటెక్ట్ మురళి గారితో కలిసి చండూరు లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. మండల కేంద్రాలలో అభివృద్ధి చేసే ఈ క్లస్టర్ పాఠశాలలను ఆర్కిటెక్ట్ మురళి ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి దగ్గరుండి చూయించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొరిమి ఓంకారం, పార్టీ మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు అనంత చంద్రశేఖర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు దోటి వెంకటేశ్ యాదవ్, పల్లె వెంకన్న, కోడి గిరిబాబు, డాక్టర్ కోడి శ్రీనివాసులు పాల్గొన్నారు.

# నల్లగొండ అంటేనే పోరుగడ్డ

### చరిత్ర అంతా పోరాటాల మయమే : బానిస సంకెళ్లను తెంచిన పోరాట యోధుల త్యాగఫలం అనుభవిస్తున్నాం : మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ:** గేయాలు.. గాయాలతో మన గడ్డ చరిత్ర సమస్తం పోరాటాల మయమే. తిండి కోసం..జాగ కోసం.. అస్తిత్వం కోసం.. ఆత్మాభిమానం ,జలం,జనం ,స్వయంపాలన కోసం పోరటం, పోరాడకుండా మనకు ఏది సులువుగా దక్కలేదు. అందుకే నల్లగొండ అంటేనే పోరు గడ్డగా పేరుగాంచిందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.నాడు తెలంగాణ సాయుధ పోరాటంలో, తెలంగాణ రాష్ట్ర.. తొలి, మలి దశల ఉద్యమంలో..అలుపెరగక పోరాడిన నా నల్లగొండ పోరు కెరటం అన్నారు.79 వ భారత స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో మంత్రి కోమటిరెడ్డి జాతీయ పతాకాన్ని ఎగరవేశారు. అదేవిదంగా జిల్లా అభివృద్ధికి అమలు చేస్తున్న కార్యక్రమాలను తన సందేశం ద్వారా జిల్లా ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి స్వతంత్ర్య సమరయోధులను సన్మానించారు. ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంస పత్రాలను అందజేశారు. అంతేకాక డిఆర్‌డిఓ ద్వారాస్త్రీనిధి కింద 349 కోట్ల రూపాయల బ్యాంకు లింకేజీ రుణాలను మహిళా సంఘాలకు అందజేశారు. అలాగే ఇందిరమ్మ గృహ లబ్ధిదారులకు మూడు కోట్ల 80 లక్షల రుణాల చెక్కును అందజేశారు. దీంతోపాటు పరిశ్రమల శాఖ కింద టీ ప్రైడ్ ద్వారా నలుగురికి కోటి 48 రూపాయల చెక్కును, మెప్మా కింద 12 కోట్ల 98 లక్షల బ్యాంకు లింకేజీ రుణాలను అందజేశారు.కాగా వివిధ శాఖలు వారి అభివృద్ధిని తెలిపే విధంగా 12 స్టాల్స్ ను ఏర్పాటు చేయడం జరిగింది. అంతేకాక వివిధ శాఖలు తెలిపేలా శకటాలను ఏర్పాటు చేశారు.వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో నల్లగొండ పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్సీలు నెల్లికంటి సత్యం, శంకర్ నాయక్,ఎంసి కోటి రెడ్డి,ఎంఎల్ఏలు వేముల వీరేశం,బత్తుల లక్ష్మారెడ్డి, జిల్లా గ్రంధాలయ సంస్థ అధ్యక్షులు ఎం ఏ ఆఫీజ్ ఖాన్, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ ,జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్ ,అదనపు ఎస్‌పి రమేష్, ఏసిపి మౌనిక హాజరయ్యారు.





## రూ.8 కోట్లతో పాదచారుల వంతెన పనులకు శంకుస్థాపన : కోమటిరెడ్డి

**పజాపక్షం/నల్లగొండ:** నల్లగొండ పట్టణాన్ని ఉత్తమ పట్టణంగా తీర్చిదిద్దుతామని,పట్టణంలో రద్దీగా ఉండే రోడ్లపై పాదాచారుల వంతెన ఏర్పాటు చేయడం అందరికీ ఎంతో మేలు చేస్తుందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం అయన జిల్లా కేంద్రంలోని దేవరకొండ రోడ్ లో ఉన్న సెయింట్ ఆల్ఫోన్సస్ పాఠశాల వద్ద 8 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న పాదాచారుల వంతెన పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సెంట్ ఆల్ఫాన్సెస్ పాఠశాల వద్ద ప్రతిరోజు విద్యార్థులతో రద్దీగా ఉంటుందని, ఇక్కడ రోడ్డు ప్రమాదాలు జరగకుండా ముఖ్యంగా పాఠశాల విద్యార్థులు ప్రమాదాలకు గురికాకుండా ఉండేందుకుగాను పాదాచారుల వంతెనను నిర్మిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలో రహదారులతో పాటు ,మురికి కాలువలు, సిసి రోడ్లు వంటివి నిర్మిస్తున్నామని, పట్టణాన్ని ఉత్తమ పట్టణంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మంత్రి రాష్ట్రంలో జిల్లాలో రహదారుల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై వివరించారు.జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ పాఠశాల ప్రారంభ, ముగింపు సమయం లో ఎక్కు వ సందడి నెలకొంటుందని, అప్పుడు ప్రమాదాలు జరిగేందుకు అవకాశం ఉందని, పాదాచారుల వంతెన నిర్మించడం వల్ల ప్రమాదాలు తగ్గుతాయన్నా రు. జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ ప్రతినిత్యం 1000 నుండి 2000 మంది పిల్లలు ఈ పాఠశాల వద్ద రోడ్డు దాటడం వంటివి చేస్తున్నారన్నారు.

## డిండి ఆయకట్టు రైతులకు ధోకాలేదు

**ప్రజాపక్షం/డిండి :** ఇటీవల ఎగువన కురిసన వర్షాల కారణంగా డిండి ప్రాజెక్టు డ్యాం అలుగు పార దంతో ఆయకట్టు రైతుల పంటలకు డోకా లేదని సంతోషం వ్యక్తం చేస్తూ శుక్రవారం దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ డిండి ప్రాజెక్టు వద్ద గంగమ్మకు చీరే, పూలు, కుంకుమ, సారెతో గంగా హారతి సమర్పించారు. అనంతరం గిరిజన సాంప్రదాయ తీజ్ వేడుకను గిరిజనులు ఘనంగా నిర్వహించుకోవాలని గిరిజనులకు సూచించి మొలకల వద్ద పూజలు నిర్వహించారు. నియోజకవర్గంలోని నేరేడుగొమ్ము, చందంపేట మండలాలకు డిండి ప్రాజెక్టు ద్వారా నీరందించి చెరువులు, కుంటలను నింపేందుకు కామేపల్లి స్టేజీ వద్ద నీటిని విడుదల చేశారు. ఈకార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వెంకటేశ్వర్‌రావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మైనొద్దీన్, మండల కార్యదర్శి కనకాచారి, జిల్లా కౌన్సిల్ సభ్యులు వెంకటరమణ, కాంగ్రెస్‌నాయకులు కాశన్న, వెంకటేష్, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మ ణ్, సిపిఐ సహాయ కార్యదర్శులు శైలేష్, విజయేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



# అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రజాపాలన ప్రభుత్వం

### శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/యాదాద్రి :** జిల్లాలో 79వ స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు అంబరాన్నంటాయి. మువ్వన్నెల జెండా మురిసింది. ప్రతి మదిలో దేశభక్తి ఉప్పొంగింది. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో అలాగే భువనగిరి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో కలెక్టర్ హనుమంతరావు ఆధ్వర్యంలో స్వతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారిగా పాల్గొన శాసనమండలి చైర్మన్ గుత్త సుఖేందర్ రెడ్డి ప్రత్యేక వాహనంలో పరేడ్‌ను సందర్శించి పోలీస్ వందనాన్ని స్వీకరించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పరేడ్ కమాండర్ ఆధ్వర్యంలో పోలీస్ దళం జాతీయ గీతాన్ని ఆలపించింది. ఆ తర్వాత వారు మార్చ్ఫాస్ట్ నిర్వహించారు. పోలీస్ రక్షక దళాలు, సీఆర్పీఎఫ్, ఎన్సీసీ క్యాడెట్లు, హోంగార్డులు తమ విన్యాసాలతో ఆకట్టుకున్నారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. మరోవైపు శకటాల ప్రదర్శన అందర్నీ ఆకట్టుకుంది. జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు శాసనమండలి చైర్మన్ గుత్త సుఖేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం భువనగిరి జిల్లా కేంద్రంలోని బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఘనంగా స్వతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, అమలవుతున్న సంక్షేమ పథకాల ప్రగతిని తెలియజేశారు. అనంతరం వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. జిల్లాలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందికి అవార్డులను అందించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని భువనగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో జిల్లాలోని వివిధ పాఠశాల విద్యార్థినుల సాంస్కృతిక నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అలాగే జిల్లాలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, యంత్రాంగం సాధించిన ప్రగతి అంశాలను తెలుపుతూ సాగిన శకటాల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హనుమంతరావు, డీసీపీ అకాంక్ష్ యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవైస్ చీస్తి, రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు, జిల్లా అధికారులు, అమరవీరుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయండి

### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోదా శ్రీరాములు

**ప్రజాపక్షం/యాదగిరిగుట :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) 4వ మహాసభలు ఈనెల 20 తేదీ నుండి 23 వరకు మేడ్చల్ జిల్లా గాజుల రామారంలో నిర్వహించే మహాసభలను జయప్రదం చేయాలిని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోద శ్రీరాములు అన్నారు. శుక్రవారం మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాసభలు రాష్ట్రంలో ప్రజలు నిరుద్యోగ యువత వ్యవసాయ కూలీలు, రైతులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్నటువంటి సమస్యలపైన చర్చించి భవిష్యత్ పోరాట కార్యక్రమాన్ని తీసుకోబోతుందని అన్నారు. భారత్ కమ్యూనిస్టు పార్టీ ఎన్నో త్యాగాలు చేసిన చరిత్ర కలిగిన పార్టీ మహాసభలు ప్రతిష్టాత్మకంగా జరుగుతున్నాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, పెరబోయిన మహేందర్, మండల కార్యదర్శి కల్లెపెల్లి మహేందర్, జిల్లా సమితి సభ్యులు బబ్బూరి శ్రీధర్, మున్సిపల్ మాజీ కో ఆప్షన్ సభ్యులు పెరబోయిన పెంటయ్య, మండల కార్యవర్గ సభ్యులు పేరబోయిన బంగారు, మాటూరి మల్లయ్య, ఆర్ పుష్ప, అనంతల నరసింహ, చందు నాయక్, కోనేరు శ్రీను, సందీప్, పాకాలపాటి రాజు, తోటకూరి శేఖర్, సత్యం, నగేష్ తదితరులు పాల్గొన్నారు.



# సూర్యాపేట జిల్లా సమగ్రాభివృద్ధి లక్ష్యం

### మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్‌రెడ్డి




**ప్రజాపక్షం/సూర్యాపేట :** సూర్యాపేట జిల్లాను రాజకీయాలకు అతీతంగా సర్వతోముఖాభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తానని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం సూర్యాపేట కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్‌పి కె నరసింహ లతో కలిసి పాల్గొన్నారు. మొదట ఆయన పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించి జాతీయ పతాకాన్ని ఎగురవేసి, జాతీయ గీతాన్ని, తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 3కోట్ల 48లక్షల మంది మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పొందారని అన్నారు. పౌర సరఫరాల శాఖ ద్వారా రూ.500కే వంట గ్యాస్‌ను అందిస్తున్నామన్నారు. జిల్లాలో 4లక్షల 5వేల 898 మంది లబ్ధిపొందుతున్నారని చెప్పారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా రైతులు పండించిన సన్న ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తున్నామని, దీని ద్వారా 2024/25 యాసంగిలో 7వేల 266 మంది రైతులకు అందించడం జరిగిందన్నారు. పేదలకు రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. జిల్లాలో 3లక్షల 26వేల 57 మంది ఆహార భద్రతా కార్డు దారులకు జూన్, జులై, ఆగష్టు మాసాలకు గాను 18వేల 766 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేయడం జరిగిందన్నారు. గత పాలకులు రేషన్‌కార్డుల పంపిణీని విస్మరించగా తమ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 36వేల 812 నూతన రేషన్ కార్డులు పంపిణీ చేశామన్నారు. వరిసాగులో జిల్లా ముందంజలో ఉందని కొనుగోలు కేంద్రాల ద్వారా 3లక్షల 36వేల 847 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుండి కొనుగోలు చేసి డబ్బు చెల్లించడం జరిగిందన్నారు. జిల్లాలో 2లక్షల 87వేల 234 మంది రైతులకు రూ.366 కోట్ల 50లక్షలు చెల్లించడం జరిగిందని వివరించారు. జిల్లాలో 1లక్షా27వేల 269 మంది రైతులకు రూ.1005కోట్లు మాఫీ చేయడం జరిగిందన్నారు. రైతుభీమా పథకం కింద 2024/25 సంవత్సరంలో 817 మంది రైతులు మృతి చెందగా వారి నామినీలకు రూ.35కోట్లు భీమాను చెల్లించామన్నారు. ఆయిల్‌ఫామ్ సాగును అభివృద్ధి చేసేందుకు డ్రిప్ ఇరిగేషన్ కోసం రైతులకు ఎకరాకు రూ.50,918 రాయితీ అందించడం జరిగిందన్నారు. జిల్లాలో 4,885 ఎకరాలలో ఆయిల్ ఫామ్ సాగవుతుందన్నారు. జిల్లాలో మొత్తం 5లక్షల 85 వేల 464 ఎకరాల ఆయకట్టు ఉందని తెలిపారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ అభివృద్ధి పనులు, ఎడమ కాలువ లైనింగ్ కోసం రూ.29 కోట్లు, ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ కోసం రూ.184 కోట్ల 60 లక్షలు, జాన్‌పహాడ్ లైనింగ్ కెనాల్ కోసం రూ.173కోట్లు ప్రభుత్వం కేటాయించడం జరిగిందన్నారు. మూసీ ఆధునీకరణ కోసం రూ.88కోట్ల 76లక్షల అంచనా వ్యయంతో పనులు చేపట్టామని, రూ.56కోట్ల 17 లక్షల పనులు ఇప్పటికే జరిగాయన్నారు. అనంతరం పలువురు స్వాతంత్ర్య సమర యోధులకు సన్మానం చేశారు. వివిధ శాఖలు ప్రదర్శించిన శకటాలను ఆయన తిలకించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు, జడ్‌పి సిఇఓ అప్పారావు, ఆర్‌డిఓ వేణుమాధవ్, పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

# మేకల మారమ్మ మృతి సిపిఐకి తీరని నష్టం

### భర్తను కోల్పోయినా.. తుది శ్వాస విడిచే వరకు పార్టీని వీడని ధీరవనిత: పల్లా వెంకట్ రెడ్డి

**ప్రజాపక్షం/మర్రిగూడ:** శివన్నగూడెం గ్రామానికి చెందిన మేకల మారమ్మ (70) అనారోగ్యంతో గురువారం మృతి చెందటంతో శుక్రవారం సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి,ఎంఎల్‌సినెల్లికంటి సత్యం,మాజీ ఎంఎల్‌ఏ విజ్జిని యాదగిరిరావు తో కలిసి మారమ్మ భౌతిక కాయానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పల్లా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ గ్రామములో ఉన్న భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడి దేవాలయ భూములు ఇప్పించి పేద వర్గాలకు అండదండగా ఉండేదన్నారు. ఆమె భర్త మేకల రాములును 1990లో కాంగ్రెస్ గుండాలు అతి కిరాతకంగా చంపారన్నారు. అయినా మారమ్మ మనోధైర్యంతో సిపిఐ పార్టీకి ముందు నుండి నడిపించుకుంటూ1994లో సర్పంచిగా ఎన్నికయిందని గుర్తు చేశారు.మాజీ శాసన సభ్యులు ఉజ్జిని నారాయణ రావు సహకారంతో శివన్నగూడ గ్రామములో పేదలకు ఇండ్ల స్థలాలు, ఇండ్లు. ప్రభుత్వము నుండి ఇప్పించారు. నాటి నుండి నేటి వరకు తన భర్తను కోల్పోయిన ఎన్ని ఇబ్బందులు వచ్చినా తుది శ్వాస విడిచే వరకు పార్టీని విడిచిపెట్టలేదన్నారు.ఆమె పార్టీకి గ్రామానికి వేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలోకార్యవర్గ సభ్యులు సభ్యులు ఆర్ అంజయ్య చారి,బొల్గూరి నరసింహ,నల్లప్పరాజు రామ లింగయ్య,జిల్లా కౌన్సిల్ సభ్యులు బిక్షం రెడ్డి,మండల కన్వీనర్ బుర్ర



శేఖర్,ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు బూడిద సురేష్,మండల కార్యవర్గ సభ్యులు ఆకుల రఘుమయ్య,కొమురయ్య,జక్కలి అంజయ్య,ఎరుకలి నిరంజన్, జక్కల అంజయ్య, గ్రామ శాఖ కార్యదర్శి బొల్లం యాదయ్య,నాయకులు అయితగోని వెంకటయ్య, ఎరుకలి యాదయ్య, కళ్లెం యాదిరెడ్డి,బొల్లం యాదయ్య ఐతగొని యాదయ్య,ఆకుల వెంకట్ రామ్, గుండెబోయిన శ్రీను మేతరి యాదయ్య, కృష్ణయ్య,లింగంపాల్గొన్నారు. మారమ్మ మృతి పట్ల సిపిఐ సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్ రావు సంతాపం తెలిపారు. మారమ్మ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

## శ్రీ కంటి, ప్రసూతి ఆసుపత్రి ఎదుట ఆందోళన




**ప్రజాపక్షం/సూర్యాపేట :** వైద్య పరీక్షల కోసం వచ్చిన ఓ గర్భిణీ పరిస్థితి విషమంగా మారడంతో శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ కంటి, ప్రసూతి ఆసుపత్రి ఎదుట ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. పెన్‌పహాడ్ మండలం మహ్మదాపురం గ్రామానికి చెందిన కర్నాటి లింగయ్య తన భార్య ప్రవళిక గర్భిణీ కావడంతో వైద్య పరీక్షలు చేయించేందుకు శ్రీ కంటి, ప్రసూతి ఆసుపత్రికి తీసుకవచ్చారు. అక్కడ వైద్యులు ఆమెను పరీక్షించి ఫాలోపియన్ ట్యూబ్‌లో గర్భాణి నిర్ధారించి వెంటనే ఆబార్షన్ చేయాలని సూచించారు. అందుకు వారు ఒప్పుకోగా పరీక్షల పేరుతో వారు నిర్లక్ష్యంగా వ్యవహరించారని దీంతో ఆమె పరిస్థితి విషమంగా మారిందని ఆమె బంధువులు, కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. దీంతో సదరు వైద్యులు మరో ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి సర్జరీ చేయించగా మరోమారు గర్భం దాల్చే అవకాశం లేదని నిర్ధారణ కావడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. దీనికంతటికి కారణం ఆసుపత్రి వైద్యురాలు స్వాతిరెడ్డి నే కారణమంటూ ఆరోపించారు. దీనిపై ఆమెను వివరణ అడుగగా.. ఇందులో తన తప్పు ఏమి లేదని పద్ధతి ప్రకారమే తాను వైద్యం అందించానని చెప్పారు.

# క్రీడ



## అక్కడి గడ్డపై సగర్వంగా మన జెండా

రోహిత్ పోస్టు వైరల్

**భా**రత 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రముఖులు దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుత, మాజీ క్రికెటర్లూ విషెస్ తెలుపుతూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. భారత వన్డే కెప్టెన్ రోహిత్ శర్మ, ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, మాజీ క్రికెటర్లు సచిన్, సెహ్వాగ్, ఐసీసీ ఛైర్మన్ జైషా వారిలో ఉన్నారు. గతేడాది భారత్ టీ20 ప్రపంచకప్ గెలిచిన సంగతి తెలిసిందే. అప్పుడు ఫైనల్ జరిగిన బార్బడోస్ మైదానంలో భారత జెండాను అప్పటి కెప్టెన్ రోహిత్ శర్మ రెపరెపలాడించాడు.



ఆ ఇమేజ్‌ను పోస్టు చేసిన అతడు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపాడు. 'స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు. జైహింద్' సచిన్

'నా దేశం, నా గుర్తింపు, నా జీవితం.. జై హింద్' గంభీర్

'హ్యాపీ ఇండిపెండెన్స్‌డే. విజయం కోసం అహర్నిశలు కష్టపడుతూనే ఉండాలి' సూర్యకుమార్ యాదవ్

'త్రివర్ణ పతాకంలో తెలియని మత్తు ఉంటుంది. మాతృభూమి ఘనకీర్తిని అది తెలియజేస్తుంది. ఈ త్రివర్ణ పతాకాన్ని ప్రతిచోటా ఎగురవేస్తాం. హిందూస్థాన్ అనే గౌరవం ఎప్పటికీ నిలిచిపోతుంది. అందరికీ భారత స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు' వీరేంద్ర సెహ్వాగ్


## ఒలింపిక్స్‌లో కష్టమే కానీ.. ప్రయత్నిస్తా : స్టీవ్ స్మిత్



**లా**స్‌ఏంజెలెస్ ఒలింపిక్స్ 2028లో పాల్గొనే ఆస్ట్రేలియా టీ20 జట్టులో తాను చోటు దక్కించుకోవడం చాలా కష్టమని స్టీవ్ స్మిత్ అంటున్నాడు. కానీ, ప్రయత్నిస్తానని పేర్కొన్నాడు. దాదాపు 128 సంవత్సరాల తర్వాత తిరిగి ఒలింపిక్స్‌లో క్రికెట్ స్థానం సంపాదించుకోనుంది. ఒలింపిక్స్‌లో చివరి సారి 1900లో క్రికెట్ మ్యాచ్ జరిగింది. గ్రేట్ బ్రిటన్, ఫ్రాన్స్ మాత్రమే అప్పుడు పోటీ పడ్డాయి. తర్వాత మళ్లీ ఇన్నేళ్లకు లాస్‌ఏంజెలెస్ వేదికగా టీ20 ఫార్మాట్లో క్రికెట్ పోటీలు జరగనున్నాయి. ఆ సమయానికి స్మిత్ వయసు 39 సంవత్సరాలకు చేరుకుంటుంది. '2028 ఒలింపిక్స్ జట్టులో నాకు స్థానం సంపాదించుకోవాలనుంది. ప్రస్తుతం ఆస్ట్రేలియన్ టీ20 జట్టు అద్భుతంగా ఆడుతోంది. ఈ నేపథ్యంలో నాకు స్థానం దక్కడం అంత తేలిక కాదు. అయినా నేను ప్రయత్నిస్తూనే ఉంటా. ఎప్పుడు ఏం జరుగుతుందో ఎవరికి తెలుసు' అని స్మిత్ అన్నాడు. ఈ సందర్భంగా స్మిత్ తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నాడు. 'నేను పిల్లాడిగా ఉన్నప్పటి నుంచి చాలా ఒలింపిక్స్ చూశాను. ఆస్ట్రేలియన్ అథ్లెట్లు పోటీ పడుతుంటే వీక్షించడం నాకు బాగా నచ్చేది. క్రికెట్ కూడా ఒలింపిక్స్‌లో భాగం కానుందని తెలిసి.. నేను చాలా ఆనందించాను' అని అతడు వివరించాడు. అలాగే వరల్డ్ కప్, ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ, వరల్డ్ టెస్ట్ ఛాం పియన్ షిప్ ఫైనల్స్, యాషెస్ సిరీస్‌లో తన ప్రాతినిధ్యం గురించి స్టీవ్‌స్మిత్ మాట్లాడాడు. 'నేను చాలా వరల్డ్ కప్‌లు ఆడాను. అలాగే యాషెస్, బోర్డర్ గావస్కర్ ట్రోఫీల్లో పాల్గొన్నా. ప్రపంచ యవనికపై దేశం తరఫున ఆడటం బాగుంటుంది. ఒలింపిక్స్ అనేది మరో అవకాశం. దానిలో భాగం కావాలని నాకూ ఉంది. అయినా దానికి ఇంకా చాలా సమయం ఉంది. ఏం జరుగుతుందో చూద్దాం' అని స్మిత్ అన్నాడు. కొన్ని నెలల క్రితం ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా టీమ్‌ఇండియాతో జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఆరు వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. దీంతో స్టీవ్ స్మిత్ వన్డే క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. ప్రస్తుతం అతడు టెస్ట్, టీ 20 ఫార్మాట్లో మాత్రమే కొనసాగుతున్నాడు. చివరిసారిగా ఆస్ట్రేలియా తరఫున ఫిబ్రవరి 2024లో టీ20 మ్యాచ్‌లో పాల్గొన్నాడు. 2026లో భారత్, శ్రీలంక వేదికగా టీ20 వరల్ కప్ జరగనుంది. ఈ టోర్నీలో స్మిత్ భాగమవుతాడో.. లేదో ఇప్పుడే చెప్పలేని పరిస్థితి.

## గౌతమ్ గంభీర్ ఎంతో ప్రోత్సహించాడు: నాయర్


**ఇం**గ్లాండ్ టూర్ సందర్భంగా టీమ్ఇండియా కోచ్.. గౌతమ్ గంభీర్ తమకు చక్కని ప్రోత్సాహం అందించాడని కరుణ్ నాయర్ వివరించాడు. తెందూల్కర్‌అండర్సన్ ట్రోఫీలో భాగంగా ఇంగ్లాండ్, టీమ్ఇండియా అయిదు టెస్టు మ్యాచుల్లో తలపడ్డాయి. ఈ సిరీస్‌ను ఇరు జట్లూ 22తో సమం చేసుకున్నాయి. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ స్వల్ప వ్యవధిలోనే ఒకరి తర్వాత మరొకరు టెస్ట్ క్రికెట్‌కు తమ రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత.. శుభ్‌మన్ గిల్ జట్టు సారథ్య బాధ్యతలు స్వీకరించాడు. అంతకుముందు టీమ్ఇండియా స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో 30 తేడాతో టెస్ట్‌సిరీస్‌ను కోల్పోయింది. అలాగే, ఆస్ట్రేలియాలో బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో 13 తేడాతో పరాజయం పాలైంది. ఇలాంటి క్లిష్టపరిస్థితుల్లో టీమ్ఇండియా ఇంగ్లాండ్ టూర్‌లో టెస్ట్ సిరీస్‌ను 22తో సమం చేసుకుంది. 'ఈ టూర్‌లో జట్టుగా మేమంతా విజయం సాధించడమే మా లక్ష్యం. టీమ్ ఇండియా కోచ్ గౌతమ్ గంభీర్ మొదటి రోజు నుంచే మాకు చాలా ప్రోత్సాహాన్నిస్తూ, మద్దతుగా నిలిచాడు. ఇదే నాలో ఆత్మవిశ్వాసాన్ని నింపింది. ఈ సిరీస్‌లో రాణించడానికి ఇదే నాకు తోడ్పడింది' అని కరుణ్ నాయర్ అన్నాడు. దాదాపు ఎనిమిదేళ్ల విరామం తర్వాత టీమ్ఇండియాలోకి పునరాగమనం చేసిన కరుణ్ నాయర్ ఈ సిరీస్‌లో నాలుగు మ్యాచుల్లో ఆడాడు. ఎనిమిది ఇన్నింగ్స్‌లో 25.62 యావరేజ్, 52.56 స్ట్రైక్‌రేట్‌తో 205 పరుగులు చేశాడు. ఇందులో కేవలం ఒక హాఫ్ సెంచరీ మాత్రమే ఉంది. ఓవల్ వేదికగా జరిగిన అయిదో టెస్ట్ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో 109 బంతులు ఎదుర్కొని, ఎనిమిది ఫోర్లతో.. 57 పరుగులు చేశాడు. ఈ స్కోరే.. అతడికి ఈ సిరీస్‌లో వ్యక్తిగత అత్యధికం కావడం గమనార్హం. దేశవాళీల్లో కరుణ్ నాయర్ అద్భుతంగా రాణించినప్పటికీ, ఇంగ్లాండ్ టూర్‌లో మాత్రం చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్‌లు ఆడలేకపోయాడు. తనకు లభించిన ప్రారంభాలను పెద్ద స్కోర్లుగా మలచడంలో విఫలమయ్యాడు.






# అంతంత మాత్రమే!

**మ**త మౌఢ్యం పెరుగుతున్నకొద్దీ, శాస్త్ర సాంకేతిక రంగాల్లో, ప్రత్యేకించి పరిశోధన, అభివృద్ధి విభాగాల్లో తిరోగమనం తప్ప పురోగమనం అనేదే ఉండదు. మన దేశంలో నెలకొన్న పరిస్థితులు ఇందుకు ఓ ఉదాహరణ. గత రెండు దశాబ్దాలుగా భారతదేశం శాస్త్రీయ పరిశోధన, అభివృద్ధిలో తక్కువ నిధులను పెట్టుబడి పెట్టింది, కాబట్టి 2010–2020 మధ్య ఖర్చు చేసిన మొత్తాలు రూ.60,000 కోట్ల నుండి రూ.1,20,000 కోట్లకు మాత్రమే పెరిగాయి. ఎన్నో దేశాలకంటే ఇది చాలా తక్కువ. జ్ఞాన ఆధారిత ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని ఆకాంక్షిస్తున్న భారతదేశం, ఒక తీవ్రమైన వైరుధ్యాన్ని ఎదుర్కొంటోంది. దేశంలో మేధాసంపత్తిగానీ, మానవవనరులుగానీ తక్కువేమీ కాదు. అయితే, వినియోగం మాత్రం నామమాత్రం. విదేశాల్లో పలువురు శాస్త్రవేత్తలు సాధిస్తున్న విజయాలను మన దేశానికి ఆపాదించుకోవడం, వారి మూలాలు భారత దేశంలోనే ఉన్నాయని ఘనంగా ప్రకటించుకోవడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు. ఒక దేశం ఆర్థికంగా ఎదగాలంటే, పరిశోధన మరియు అభివృద్ధి (ఆర్ అండ్ బి) పనితీరు మెరుగుపడాలి. ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని లక్ష్యంగా ఎంచుకున్నప్పుడు, అందుకు తగిన చర్యలు కూడా ఉండాలి. అవసరాలతో పోలిస్తే, అందుబాటులో ఉన్న వనరులు చాలా తక్కువ. ఈ అంతరం సమస్య ప్రతిభ లేకపోవడం వల్లకాదు... దానిని వినియోగించుకునే వాతావరణం లేకపోవడాన్ని సూచిస్తుంది. దీర్ఘకాలంగా తక్కువ పెట్టుబడులు, విద్యాపరమైన మార్పులు ఆశించిన స్థాయిలో లేకపోవడం, అధికార వ్యవస్థలో లోతుగా పాతుకుపోయిన అసమర్థతలే ఆర్ అండ్ బిలో భారత్ వెనుకంజకు ప్రధాన కారణాలు. ప్రైవేటు రంగం ఎప్పుడూ ప్రయోగాలు చేయడానికి సిద్ధపడదు. ప్రభుత్వాలు సహకరించవు. ఈ పరిస్థితుల్లో పరిశోధనలకు ఊతమెక్కడ? అభివృద్ధికి తావెక్కడ? సుమారు రెండు దశాబ్దాలుగా ఆర్ అండ్ బికి కేటాయింపులు జిడిపిలో 0.64 శాతం వద్ద స్తబ్దంగా ఉండిపోయింది. దేశ జిడిపిలో వాటా పరంగా చూస్తే, ఇజ్రాయెల్ (6.02 శాతం), దక్షిణ కొరియా (5 శాతం), అమెరికా (3.5 శాతం), జపాన్ (3.41 శాతం), జర్మనీ (3.13 శాతం) ముందంజలో ఉన్నాయి. శర వేగంగా అభివృద్ధి చెందుతున్న చైనా సుమారు 2.5 శాతాన్ని పరిశోధనలు, అభివృద్ధి కోసం కేటాయిస్తున్నది. ప్రపంచ సగటు 1.8 శాతంకాగా, భారత్‌లో కేటాయింపులు అందులో సగం కూడా లేవు. ప్రపంచ నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా గొప్పలు చెప్పుకుంటున్న సమయంలో, ప్రపంచ ఆవిష్కరణ సూచిక (జిఐఐ)లో 39వ స్థానంలో ఉన్నామనే విషయాన్ని గుర్తుచేసుకోవాలి. కీలక పోటీదారులకంటే ఎంత వెనుకబడ్డామో ఈ పరిస్థితి చెప్పకనే చెప్తుంది. ప్రతి మిలియన్ మందికి జర్మనీలో 5,400, అమెరికాలో 4,800 మంది పరిశోధకులు ఉంటే, మన దేశంలో ఈ సంఖ్య కేవలం 255 మాత్రమే. అంతేకాదు, మన దేశంలో పేటెంట్ హక్కుల కోసం దాఖలవుతున్న దరఖాస్తుల్లో 75 శాతం విదేశీ సంస్థలకు చెందినవే. వ్యాపార నిర్వహణ, వస్తువుల ఆవిష్కరణ మన దేశంలో నాసిరకంగా ఉన్నాయనడానికి ఇంతకు మించిన ఉదాహరణ లేదు. చిత్రం ఏమిటంటే, భారత 'ఇన్నోవేషన్ ఇన్‌పుట్' ర్యాంక్ కంటే 'ఇన్నోవేషన్ అవుట్‌పుట్' ర్యాంక్ ఎక్కువగా ఉంది. ఈ పరిస్థితి మన దేశంలో పరిమిత వనరులను ఉత్తమ ఫలితాలుగా మార్చే ప్రక్రియ సమర్థంగా పని చేస్తున్నదని స్పష్టం చేస్తున్నది. ప్రతిభను సద్వినియోగం చేసుకోడానికి నిధులను కేటాయించడంతోపాటు, పరిశోధనలకు తగిన వాతావరణాన్ని కల్పించడం, ప్రోత్సాహాలను అందించడం వంటి చర్యలు అవసరం. దీని ద్వారా గణనీయమైన మార్పును చూడగలుగుతాం. అనుకున్న లక్ష్యాలను చేరుకోగలుగుతాం. విస్తారమైన దేశంలో, కేవలం జిడిపి ఆధారంగా దేశం ఎంతో అభివృద్ధి చెందిందని, ప్రపంచ మేటి దేశాలతో పోటీపడుతున్నదని చెప్పుకోవడం వల్ల ప్రయోజనం శూన్యం. మాటల కోటలు కట్టడం కాదు... చేతలు మొదలుపెట్టడం అత్యవసరం.



## స్వాతంత్ర్య పోరాటంలో

# కమ్యూనిస్టులది మహత్తర పాత్ర



నల్లగొండ...

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

### సిపిఐ కార్యాలయాల్లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**ప్రజాపక్షం/హనుమకొండ :** దేశస్వాతంత్ర్య పోరాటంలో కమ్యూనిస్టులది మహత్తర పాత్ర అని, అందరి త్యాగాలతో సిద్ధించిన స్వతంత్ర భారతంలో లౌకిక రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందామని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాను తక్కళ్లపల్లి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వతంత్రం కోసం బలిదానలు చేసిన మహనీయుల చరిత్రను నేటి తరానికి అందచేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. భారత రాజ్యాంగాన్ని మత రాజ్యాంగంగా మార్చేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన భాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు అదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి , ఎన్ఎ స్టాలిన్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, అరసం రాష్ట్ర జిల్లా అధ్యక్షుడు పల్లేరు వీరస్వామి, నాయకులు మునిగాల బికపతి, బత్తిని సదానందం, ఎదునూరి వెంకట్రాజం, వేల్పుల సారంగపాణి, మాలోత్ శంకర్, గుంటీ రాజేందర్, దామెర సుదర్శన్, కండె నర్సయ్య, అలవాల రాజు, ఉట్కూరి ప్రణీత్ గౌడ్, కోడెపాక బాబు, ప్రవీణ్ కుమార్, చరణ్, కుమార్ పాల్గొన్నారు.

**భువనగిరి రూరల్ :** స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా సిపిఐ జిల్లా పార్టీ కార్యాలయం వద్ద జాతీయ పతకాన్ని జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి ఎగురవేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, ఎండి ఇమ్రాన్, చిగుళ్ల లింగం, ఏశాల అశోక్, ఎఐటియుసి జిల్లా సహాయకార్యదర్శి గానబోయిన వెంకటేష్ కార్యవర్గ సభ్యులు సామల శోభన్ బాబు, సిపిఐ మండల కార్యదర్శులు అన్నెమైన వెంకటేష్, దాసరి లక్ష్మయ్య, పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, నాయకులు వడ్లకొండ భారతమ్మ, చొప్పరి సత్తయ్య, ముంతాజ్ బేగం, చిక్కా నరసయ్య, శంకర్, గౌరవంతల శ్రీనివాస్, ఎండీ షరీఫ్, సిపిఐ, ఏఐటియుసి నాయకులు పాల్గొన్నరు.

**మహబూబ్‌నగర్ :** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో మువ్వన్నెల జెండా ఆవిష్కరించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్, జిల్లా కార్యవర్గ సభ్యులు పి.సురేష్, డి.రాము, కె.పద్మావతి, నాయకులు కోటకదిర నరసింహ, గంటల శ్రీనివాస్, చాంద్ పాషా, మహేష్, ఇందిరా, దావిద్, హరి, గుడుభాష పాల్గొన్నారు.

**హసన్‌పర్తి:** హసన్‌పర్తి మండలం ఎల్లాపూర్‌లోని సిపిఐ కార్యాలయం వద్ద స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా జాతీయ జెండాను మెట్టు శ్యాంసుందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సిపిఐ రాష్ట్ర కార్య కార్యక్రమంలో సిపిఐ నాయకులు మోతే లింగారెడ్డి, భారత్ బచావో జిల్లా కార్యదర్శి దొమ్మాటి ప్రవీణ్ కుమార్, గోపు బుచ్చిరెడ్డి, ముజ్జిగ అజయ్, గ్రామ శాఖ కార్యదర్శి షేక్ బాబు, ఎఐటియుసి నాయకులు గోపు శ్రీనివాస్‌రెడ్డి, నవ చేతన బుక్ హౌస్ మేనేజర్ ఎర్ర నాగరాజు, వడ్లూరి సుధాకర్, తిరుపతిరెడ్డి, నాంపల్లి లక్ష్మయ్య, రేణికుంట్ల చిరంజీవి తదితరులు పాల్గొన్నారు



హనుమకొండ...

### పేద, బడుగు బలహీనవర్గాలకు స్వాతంత్ర్య ఫలాలు అందాలి

**నస్పూర్ :** మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు సిపిఐ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. షిర్కే సెంటర్‌లో జాతీయ జెండాను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్ ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ పేద, బడుగు బలహీన వర్గాలకు స్వాతంత్ర ఫలాలు అందాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి లింగమ రవి, జిల్లా కార్యవర్గ సభ్యులు కారుకూరి నాగేష్, కొట్టె కిషన్‌రావు, పూజారి రామన్న, ఇలవేణి సారంగపాణి, జోగుల ఆంజనేయులు, నాయకులు తంగళ్లపల్లి సురేష్, వేముల సంతోష్, అల్లా లచ్చిరెడ్డి, కోడి వెంకటేశం, కంచం పోవం, ఏవిఎన్ శాస్త్రీ, భోగే ముత్తన్న, ఆడెపు మధుకర్ పాల్గొన్నారు.

**ఖమ్మం :** ప్రజాస్వామ్యం, హక్కుల పరిరక్షణకు మరో పోరాటం తప్పదని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖమ్మం సిపిఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో జాతీయ జెండాను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, పోటు కళావతి, బిజి క్లెమెంట్, తోట రామాంజనేయులు, రావి శివరామకృష్ణ, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి, రవి, సభ్యులు గాదె లక్ష్మి నారాయణ, తాటి నిర్మల పాల్గొన్నారు.

**కరీంనగర్ :** స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సిపిఐ జిల్లా కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్ వద్ద ఏర్పాటుచేసిన జాతీయ జెండాను సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ ఎగురవేశారు. ఈ సంధర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటస్వామి మాట్లాడుతూ త్యాగధనుల ఆశయాలను లక్ష్యాలను నెరవేర్చాలంటే సిపిఐ పక్షాన నిలబడి పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, పైడిపల్లి రాజు, న్యాలపట్లరాజు, బూడిద సదాశివ, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, ఉమ్మెంతల రవీందర్ రెడ్డి, బామండ్లపెల్లి యుగేందర్, బోనగిరి మహేందర్, బీర్ల పద్మ, కసిబోజుల సంతోష్‌చారి, హేమంత్‌కుమార్, అంబ్రిష్, సందీప్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, సాంబయ్య, సదానందం, సంపత్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

**సూర్యాపేట టౌన్ :** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా కార్యాలయంలోని కామ్రేడ్ ధర్మ బిక్షం భవన్‌లో జాతీయజెండాను సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు అనంతుల మల్లీశ్వరి, పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, నాయకులు బొమ్మగాని శ్రీనివాస్, దంతాల రాంబాబు, నిమ్మల ప్రభాకర్, దీకొండ శ్రీనివాస్, నీలా శ్రీనివాస్, దేశగాని హేమలత, సీనియర్ జర్నలిస్టు తోట నర్సయ్య, యడవెల్లి శ్రీకాంత్, బూర సైదులు, పున్నం రమేష్, వాడపల్లి వెంకన్న, మేస్త్రీ శ్రీను, కప్పల రాము పాల్గొన్నారు.

### రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

### ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

**నల్లగొండ :** లౌకిక ప్రజాస్వామ్య భారతదేశంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్రలు చేస్తున్నారని ప్రజాసామికవాదులు, లౌకికవాదులు, కమ్యూనిస్టులు ఏకమై భారత రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు మరో పోరాటం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు.భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా నల్లగొండ సిపిఐ జిల్లా కార్యాలయం మగ్దుమ్ భవన్‌లో జాతీయ పతాకావిష్కరణ ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్‌రెడ్డి, లోడింగి శ్రవణ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి, పట్టణ కార్యదర్శి కెవిఎస్ రెడ్డి, శాంతి సంఘం జిల్లా కార్యదర్శి జిల్లా యాదయ్య, నాయకులు లెనిన్, ముండ్ల ముత్యాలు, నందం, కోమటిరెడ్డి ప్రద్యుమ్నారెడ్డి, వెంకన్న, దోటిపాండరి, గుండె రవి, అక్కలయ్య, మదర్, యూసుఫ్, పుట్టల సుజా, కౌసల్య, విజయ పాల్గొన్నారు.

**ఆదిలాబాద్ :**జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో స్వతంత్ర దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. త్రివర్ణ పతాకాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి ఎగురవేశారు. కార్యకమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యురాలు ముడులు నలినిరెడ్డి, నాయకులు కుంటల రాములు, అమీనాఖాన్, మహబూబ్ ఖాన్, పట్టణ కార్యదర్శి చంద్రమౌళి, ఖండాల గణేష్, సలీం షేక్ భాషా, పుష్ప, కిష్టయ్య పాల్గొన్నారు.

**నిర్మల్ :** సిపిఐ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి ఎస్.విలాస్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఎస్ఎన్ రెడ్డి, ఎవైఎస్ఎఫ్ కన్వీనర్ కైలాష్, ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

**సిద్దిపేట :** సిద్దిపేట సిపిఐ కార్యాలయం ఎడ్ల గురువారెడ్డి భవన్ వద్ద స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా కార్యదర్శి మంద పవన్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కిష్టపురం లక్ష్మణ్, కనుకుంట్ల శంకర్, జెర్రిపోతుల జనార్దన్. గజ బింకార్ బన్సిలాల్, ఎంకె ఆరీఫ్, కర్నాల చంద్రం, మిట్టపల్లి సుధాకర్, పిట్ల మల్లేశం, బెక్కంటి సంపత్, కనకరాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



కరీంనగర్...





సూర్యాపేట...



అదిలాబాద్...



నిర్మల్...



సిద్దిపేట...



భువనగిరి రూరల్..



మహబూబ్‌నగర్...



హసన్‌పర్తి...



నస్పూర్...



ఖమ్మం...

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## ర్యాంకులు సాధించిన విద్యార్థులకు నగదు అందజేత



**ప్రజాపక్షం/చర్లపల్లి:** చర్లపల్లి డివిజన్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2024–25 సం॥ ఎస్ఎస్‌సి పరీక్షలో ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులు సాధించిన అరుణ్‌కుమార్, ఇస్సాక్, భార్గవి లకు కాప్రా ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థి ఎన్ఆర్ఐ పోల రాజేష్ 20వేల రూపాయల నగదును వారి తల్లిదండ్రులు గోపాల్, అరుణలు అందజేశారు. కుషాయిగూడ శ్రీ సరస్వతి శిశు మందిర్ స్కూల్‌లో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎఎస్‌రావు నగర్ మాజీ కార్పొరేటర్ పావనీరెడ్డి జెండాను ఆవిష్కరించారు. పదవ తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు అనురాధ, చక్రపాణి రెడ్డిలు నగదును అందజేశారు.ఇందులో మాజీ హెచ్‌ఎం, హెచ్‌ఎంలు, టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు నవాబుపేటకు మంత్రులు

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** మండలంలోని చించల్ పేట్ గ్రామంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో నలుగురు మంత్రులు రానున్నట్లు చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవాబ్ పేట్ మండలం చించల్ పేట్ గ్రామంలో రూ.1.45 కోట్లతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనం, ఎస్సీ,బిసి,కమ్యూనిటీ హాల్, ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం, పశువైద్య ఉప కేంద్రం, అంగన్ వాడీ, డ్వాక్రా మహిళా బిల్డింగ్ ప్రారంభోత్సవానికి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమం శాఖ మంత్రి దనసరి సీతక్క, ఎస్సీ, ఎస్టీ ,మైనారిటీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, క్రీడలు, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి,ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి పాల్గొని ప్రారంభించడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని తెలిపారు.



## ఉత్తమ ప్రతిభ కనబర్చిన సిబ్బందికి ప్రశంసా పత్రాలు

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** తూంకుంట మున్సిపల్‌లో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య విధినిర్వహణలో ఉత్తమ సేవలందించిన సిబ్బందికి తూంకుంట మున్సిపల్ కమిషనర్ జ్యోతి గురువారం ప్రశంసా పత్రాలను అందజేశారు. స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని మున్సిపల్ కార్మికులకు నూతన వస్త్రాలను అందజేశారు. అలాగే 100 రోజుల కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. అలాగే కలెక్టరేట్ కార్యాలయంలో ఉత్తమంగా సేవలందించిన తేజ (కంప్యూటర్ ఆపరేటర్), ఆఫీస్ అటెండర్ కృష్ణలకు కలెక్టర్ మనుచౌదరి చేతుల మీదుగా ఉత్తమ అవార్డు లభించింది. ఈ సందర్భంగా కమిషనర్ జ్యోతి ఇద్దరిని అభినందించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ శ్రావణ్‌కుమార్, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రగతిపథంలో మేడ్చల్

* స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు
* కలెక్టరేట్ ప్రాంగణంలో జాతీయ జెండా ఆవిష్కరణ

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శుక్రవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డా.కె.కేశవరావు హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో కీసరలోని బిసి సంక్షేమ శాఖ పాఠశాల, మేడిపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మేడిపల్లిలోని ఎస్సీ సంక్షేమ పాఠశాల, ఉప్పల్ లోని సిరినిటీ స్కూల్‌కు చెందిన విద్యార్థినీ విద్యార్థినులు వివిధ అలంకరణలతో చేసిన నృత్యాలు, వేషధారణలు, సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకొన్నాయి.





స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా వివిధ ప్రభుత్వ శాఖలు జిల్లాలో సాధించిన ప్రగతిని ప్రతిబింబించే విధంగా ఏర్పాటు చేసిన స్టాళ్లు ఆహ్వానితులను అలరించాయి. విధి నిర్వహణల్లో ఉత్తమ ప్రతిభ చూపించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందించారు. జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరితో పాటు అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, రాధికా గుప్తా, డిసిపి కోటిరెడ్డి, మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్‌లు కె.కేశవరావుకు స్వాగతం పలికారు. జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ గీతం ఆలపించారు. పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. ఎందరో మహానుభావుల ప్రాణ త్యాగాలతో దేశానికి స్వతంత్రత సాధించుకొన్నామంటూ వారికి జోహార్లు అర్పించారు. అనంతరం కె.కేశవరావు మాట్లాడుతూ తెలంగాణా రైజింగ్–2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణా ను తీర్చిదిద్దే లక్ష్యంతో, ప్రపంచ వేదికపై తెలంగాణాను సగర్వంగా నిలబెట్టే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతోందని స్పష్టం చేసారు. దీనిలో భాగంగా ప్రజల ఆంకాక్షల మేరకు పలు సంక్షేమ, అభివృద్ధి పథకాలను కొనసాగిస్తోందన్నారు. మహిళల అభ్యున్నతి కోసం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, సౌరవిద్యుత్ ప్లాంట్లు, పెట్రోల్ బంకుల నిర్వహణ, ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్లు, శిల్పారామంలో తమ ఉత్పత్తుల స్టాళ్లు, మహిళా సంఘాల ద్వారా బస్సుల కొనుగోలు కల్పించిందన్నారు. రూ.500లకు వంటగ్యాస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా, ఇందిర మ్మ ఇళ్లులాంటి సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు.





**విద్యార్థులకు నగదు పురస్కారాలు**

స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా గతేడాది 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనపరచిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జానం సోని, చీకటి త్రివేణి, కుర్మ రాజ్‌కుమార్, సాయి విగ్నేష్ లకు కలెక్టర్ అందించారు.

**ప్రజాపక్షం/నాగారం:** నాగారం మున్సిపాలిటీ పరిధిలోని నాగారం,రాంపల్లి సెరినిటీ పాఠశాలలో స్కూల్ ప్రధాన కార్యదర్శి నోముల వసంత 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మువ్వన్నెల జెండాను ఆవిష్కరించారు.పాఠశాలలో విద్యార్థులు వేసిన వేశధారణలు,వారు ఇచ్చిన కళా ప్రదర్శన అందరినీ ఆకట్టుకున్నాయి.కరస్పాండెంట్ నోముల జంగిరెడ్డి ప్రసగిస్తు స్వాతంత్ర్యం కోసం అలుపెరగని పోరాటం చేసిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**సీనియర్ సిటిజన్ ఆధ్వర్యంలో మాజీ సైనికులకు**

## నాగారం సెరినిటీ స్కూల్‌లో ఎగిరిన జాతీయ జెండా



**సన్మానం :** 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నాగారం మున్సిపాలిటీ పరిధిలోని శిల్పా నగర్ పార్కు లో సీనియర్ సిటిజన్ ఆధ్వర్యంలో దేశం కోసం సేవలందించిన ఆర్మీ అధికారులను మాజీ కౌన్సిలర్ కౌకుట్ల అనంత్‌రెడ్డి సన్మానించారు.కాలనీలోని సమస్యలు పరిష్కరిస్తూ సీనియర్ సిటిజన్లకు సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో నడక మిత్రుల సలహాదారు సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**కైసర్‌నగర్‌లో:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 125 డివిజన్ గాజులరామారం పరిధిలోని కైసర్ నగర్ లో ఏర్పాటు చేసిన జెండా వందన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొని జెండాను ఆవిష్కరించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి అనంతరం మాట్లాడుతూ మన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, బలమైన, ఐక్యమైన భారతదేశం కోసం కలిసి ముందుకు సాగుదాం అని తెలిపారు . ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్దనోల్ల సంజీవ రెడ్డి, కందుల ఎల్ల రెడ్డి, మైనారిటీ అధ్యక్షులు సయ్యద్ షఫీ, ఫరీన్ ఖాన్, అజీమ్, రహీమ్, తదితరులు పాల్గొన్నారు.

## ఊరూ వాడా జెండా పండుగ

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి / మల్కాజిగిరి :** జిల్లా వ్యాప్తంగా శుక్రవారం 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రభుత్వ, ప్రయివేట్ కార్యాలయాలు, విద్యా సంస్థలు, రాజకీయ పార్టీ కార్యాలయాలు, బస్తీలు, ఆపార్ట్‌మెంట్లు, కమ్యూనిటీ హాళ్లు, పలు కూడళ్లలో మువ్వన్నెల జెండాను రెపరెపలాడించారు. స్వాతంత్రోద్యమంలో అసువులు బాసిన మహనీయులను స్మరించుకొని వారి చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన జెండావిష్కరణ కార్యక్రమాల్లో అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు పాల్గొని జెండాను ఎగురవేసారు.పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి గేయాలు, నృత్యాలు ఆకట్టుకొన్నాయి. ఆయా ప్రాంతాలన్ని ఉదయం జాతీయగీతాలతో మార్మోగాయి. **ఈసిఐఎల్‌లో...**ఈసిఐఎల్‌లోని నీలం రాజశేఖరరెడ్డిభవన్ వద్ద సిపిఐ ఉప్పల్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు దామోదర్‌రెడ్డి జెండా ఎగురవేసారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు విఎస్ బోస్ స్వతంత్ర పోరాటంలో ప్రాణాలర్పించిన విప్లవ యోధుల ఆంకాక్షలను నెరవేర్చటంలో పాలకులు విఫలమయ్యారని ఆవేదన వ్యక్తం చేసారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.ధర్మేంద్ర, జిల్లా కార్యదర్శి టి.సత్యప్రసాద్, సిపిఐ నియోజకవర్గ సభ్యులు నారా నర్సింహ, మహేష్, అజీమ్, పాషా, సమీర్, పృథ్వీ, సాయి, తదితరులు పాల్గొన్నారు. **కాప్రా డివిజన్‌లో...**డివిజన్‌లోని సాయిబాబానగర్ బ్లాక్ బిలో జెండావిష్కరణలో కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి పరమేశ్వరరెడ్డి ,కాంగ్రెస్ శ్రేణులు నాగసౌమ్య, విఠల్ నాయక్, బాబురావు, మల్లారెడ్డి, శ్రీకాంత్,శ్రీహరి, సత్యనారాయణ,ప్రదీప్‌సింగ్, నాగరాజు, షాబుద్దిన్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు. **మల్కాజిగిరిలో...** వినాయకనగర్ చౌరాస్తాలో ని సిపిఐ పార్టీ కార్యాలయంలో జరిగిన స్వతంత్ర దినోత్సవ వేడుకల్లో పార్టీ మండ కార్యదర్శి టి. యాదయ్య గౌడ్, సహాయ కార్యదర్శి కాసర్ల నాగరాజు, ఏఐటియుసి మండల కార్యదర్శి బి.యాదగిరి, జెన్ను రాములు, బి.లింగం, పి.సత్యనారాయణ, ఆబ్దుల్ గని, ఎ.ప్రభాకర్, రాములు, వినయ్ తదితరులు పాల్గొన్నారు. **మల్కాజిగిరి చౌరాస్తాలో** వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షులు వినయ్ ఆధ్వర్యంలో జరిగిన స్వతంత్ర దినోత్సవ వేడుకల్లో రమేష్,నవీన్, జయహరి, రజిత, పవన్, సరస్వతి, జ్యోతి, సుజాత, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు. సఫిల్ గూడ కృపా కాంప్లెక్స్‌లో జరిగిన వేడుకల్లో టిఎన్‌టియుసి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో యూనియన్ నేతలు పోచంపల్లి యాదగిరి,జనార్ధన్ రెడ్డి,ప్రేమ్ కుమార్, శివ నాగేష్, సుందర్, కృష్ణలు పాల్గొన్నారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్యాలయంలో డిప్యూటి కమిషనర్ జాకియా సుల్తానా, ఓల్డ్ మల్కాజిగిరి హనుమాన్ వ్యాయామ శాల, ఆర్‌కె నగర్ లలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి, మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్, గౌతంనగర్ కార్పొరేటర్ మేకల సునిత, నేరేడ్‌మెట్ లో యాదవ్ సంఘం ఆధ్వర్యంలో బాలేష్ యాదవ్, సుందర్ యాదవ్, ఆశోక్ యాదవ్‌లు జెండావిష్కరణలో పాల్గొన్నా రు. మల్కాజిగిరి ప్రెస్‌క్లబ్‌లో ప్రెస్‌క్లబ్ కార్యదర్శి విశాల్ జెండా ఎగురవేసిన కార్యక్రమంలో పాత్రికేయులు తేజా, మనోహర్,సంగమేష్,రమణారెడ్డి, కృష్ణమూర్తి, పవన్, మహేందర్, శివ, జ్యోతి కుమార్, దుర్గా ప్రసాద్‌లు పాల్గొన్నారు. **చిలుకానగర్ డివిజన్‌లో....**డివిజన్ లోన్లి బీరప్పగడ్డ, అంబేద్కర్‌నగర్, బ్యాంక్ కాలనీ, సాయిరాం నగర్ కాలనీ, న్యూరామ్‌నగర్ తదితర ప్రాంతాల్లో జరిగిన వేడుకల్లో స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత, ఫరీద్, చందులు పాల్గొన్నారు. సూర్యచంద్ర యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో సూర్యచంద్ర, ఎస్వీ నగర్ కాలనీ అధ్యక్షులు రవికుమార్‌లు, ఉప్పల్ భగాయత్‌లో వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు. **చిలుకానగర్ చౌరాస్తాలో** బిఆర్ఎస్ నేత పిట్టల నరేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి జెండా ఎగురవేసారు. **హబ్సిగూడ డివిజన్‌లో...**రామంతాపూర్ డీమార్ట్ వేడకల్లో ఆరుణ్‌పటేల్, కాంగ్రెస్ శ్రేణులు యాదయ్య, శ్రీనివాస్, నర్సింహ, ప్రకాష్, ఆటో యూనియన్ సతీష్, సాయి తదితరులు పాల్గొన్నారు. కాప్రా సర్కిల్ మున్సిపల్ కార్యాలయంలో డిప్యూటి కమిషనర్ జగన్ జెండా ఎగురవేసిన కార్యక్రమంలో కార్పొరేటర్లు గీత, మాజీ కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.













## ప్రపంచ వేదికపై తెలంగాణను
# సగర్వంగా నిలబెట్టేలా ప్రభుత్వం కృషి

స్పీకర్ ప్రసాద్‌కుమార్



**ప్రజాపక్షం/వికారాబాద్:** ప్రపంచ వేదికపై తెలంగాణను సగర్వంగా నిలబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుంది అని తెలంగాణ స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. భారతదేశ 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో జరిగే ఉత్సవాలకు వచ్చిన స్పీకర్ జిల్లా కలెక్టర్‌తో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ చరిత్రలో ఆగస్టు 15వ తేదీకి విశిష్టమైన స్థానం ఉందని రెండు శతాబ్దాల పాటు విదేశీయుల నిరంకుశ పాలనలో నలిగిన మన జాతి స్వేచ్ఛావాయువులు పీల్చిన మహత్తరమైన రోజు ఇదన్నారు. మహానుభావుల నాయకత్వంలో ఎందరో స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం లభించిందన్నారు.

ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత తిరగరాసి అన్నదాతల సంక్షేమానికి ఏడాదిలోనే 1లక్ష13వేల కోట్ల రూపాయలను ఖర్చు చేసింద ని అన్నారు. ఇందిరమ్మ భరోసా కింద ఎకరానికి రూ.12వేలు పెట్టుబడి సాయాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. వికారాబాద్ జిల్లాలో ఈ వానాకాలంలో 2,76,537మంది రైతులకు గాను 363 కోట్ల 10లక్షల రూపాయలు రైతుల ఖాతాలో జమ చేయడం జరిగింది అన్నారు.

ఇందిరమ్మ ఇండ్లు 13,640 ఇళ్లలో ఇప్పటివరకు 10,885 గృహాలు నిర్మించడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. బేస్‌మెంట్ పూర్తిచేసుకున్న వెయ్యి 227 మంది లబ్దిదారులకు 8కోట్ల 58లక్షల రూపాయల చెల్లింపులు జరిగినట్లు తెలిపారు. రూ. 13వేల కోట్ల పదిలక్షల వ్యయంతో సన్నబియ్యం పంపిణీ చేశారు. జిల్లా వ్యాప్తంగా 25,669 కొత్త కార్డులు మంజూరు చేశామన్నారు. 2024–25 సంవత్సరంలో జిల్లాలో 980మంది రైతులకు రూ.5లక్షల చొప్పున జమచేయడం జరిగింది అన్నారు. తాండూర్ పట్టణంలో అభివృద్ధి పనులు, మౌలికవసతుల కల్పనకు 7కోట్ల 32 లక్షల అంచనాలు రూపొందించగా శంకుస్థాపన చేయడం జరిగింది. కొడంగల్‌లో వివిధ అభివృద్ధి పనులకుగాను 197కోట్ల 50లక్షల మంజూరై పనులు కొనసాగుతున్నాయి. భూ భారతిలో 14,000 దరఖాస్తులకుగాను 9,500 దరఖాస్తు లు పరిష్కరించడంజరిగిందన్నారు.కళ్యాణలక్ష్మి పథక అమలుకు 496మందికి 4 కోట్ల 96లక్షలు పంపిణీ, షాదీముబారక్ పథకం కింద 111 మందికి కోటి 11లక్షలు అందజేయడం జరిగింది అన్నారు. కొడంగల్ నియోజకవర్గం అభివృద్ధికి ముఖ్యమంత్రి కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేసి నిధులను మంజూరు చేస్తున్నారని అన్నారు.

2025–26సంవత్సరానికి 150కోట్ల మంజూరు కాగా 713పనులకు గాను 142 కోట్ల పనులకు మంజూరు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిగి, తాండూర్ ఎమ్మెల్యేలు రాంమోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి ,అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సుధీర్, ట్రైనింగ్ కలెక్టర్ హర్ష్‌చౌదరి, డిఆర్‌ఓ మంగీలాల్, ఆర్‌డిఓ వాసుచంద్ర, అధికారులు, తదితరులు పాల్గొ న్నారు.



## కోర్టు ఆవరణలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**ప్రజాపక్షం/వికారాబాద్:** వికారాబాద్ జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సున్నం శ్రీనివాస్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. వికారాబాద్ జిల్లా జెడ్‌పి కార్యాలయంలో వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, జిల్లా ఎస్‌పి నారాయణరెడ్డి, వికారాబాద్ కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ జెండాను అవిష్కరించారు. వికారాబాద్ ఆర్‌డిఓ కార్యాలయంలో ఆర్‌డిఓ వాసుచంద్ర, తహసీల్దార్ కార్యాలయంలో లక్ష్మి నారాయణ, మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్, యంపిడిఓ కార్యాలయంలో వినయ్‌కుమార్, ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వాతంత్ర్య సమర యోధుల త్యాగాల వల్లే స్వాతంత్ర్యం వచ్చిందని వారిని స్మరించుకోవాలని సూచించారు. గాంధీ చూపించిన మార్గంలోనే నడుచుకోవాలని అన్నారు.

## జాతీయ జెండాను ఆవిష్కరించిన టియుడబ్ల్యుజె అధ్యక్షుడు



**ప్రజాపక్షం/దుండిగల్ :** సూరారంలోని కుత్బుల్లాపూర్ ప్రెస్ క్లబ్ ఆవరణలో ఏర్పాటుచేసిన జాతీయ జెండాను మేడ్చల్ జిల్లా జర్నలిస్టు సంఘం టియుడబ్ల్యూజే అధ్యక్షులు గడ్డమీది బాలరాజు ఎగరవేశారు. ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి పి. సాయి బాబా ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు స్వతంత్ర వేడుకల ప్రాముఖ్యత పై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు దయాకర్ రెడ్డి, ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు రాజేందర్, కల్కి మూర్తి, కోశాధికారి శేషారెడ్డి, సీనియర్ జర్నలిస్టులు గ్రంథాలు, మల్లేష్, సైదులు, నాగబాబు, సుగ్రీవుడు, తదితరులు పాల్గొన్నారు.

**నిజాంపేట్‌లో:**79వ భారత స్వాతంత్ర్య దినోత్సవం నిజాంపేట్ వార్డు కార్యాలయం వద్ద సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా లీడర్ కోలన్ నర్సింహారెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఆశీ. యాదయ్య, దస్తగిరి, బాలకృష్ణ, భాగ్యమ్మ, నర్సమ్మ, జీతయ్య, తదితరులు పాల్గొన్నారు.



## ప్రెస్‌క్లబ్ ఆఫీస్ వద్ద జెండా ఎగరవేసిన ఎంఎల్‌ఎ

**పజాపక్షం/చర్లపల్లి:**79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కాప్రా ప్రెస్ క్లబ్ ఆవరణలో నిర్వహించిన వేడుకల్లో ఉప్పల్ శాసన సభ్యులు బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి జెండాను ఆవిష్కరించారు.స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలిపి జర్నలిస్టులు కలసి కట్టుగా ఉంటూ వారి హక్కులను సాధించుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, కాప్రా ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి వేముల శంకర్,వర్కింగ్ ప్రెసిడెంట్ బి విజయ్‌కుమార్, కోశాధికారి రుద్రగోని నర్సింగ్ గౌడ్, సీనియర్ జర్నలిస్టులు సహదేవచారి, కెసి మోహన్, ఎస్ అశోక్, ఎండి అక్బర్, తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేత



**ప్రజాపక్షం/వికారాబాద్ రూరల్:** వికారాబాద్ మండల పరిధిలోని మదన్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 79వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా గత సంవత్సరం పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు వెయ్యి రూపాయలు నగదు బహుమతులు అందజేశారు. ప్రతి తరగతిలో ఉత్తమ హాజరు శా తం కనబరిచిన విద్యార్థుల తల్లిదండ్రులను ఈ సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు యాదయ్య మాట్లాడుతూ స్వాతంత్ర్య సమర యోధుల త్యాగఫలమే మన స్వరాజ్యమని గాంధీజీ కలలు కన్న సమాజంకోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, విద్యార్థులు, ఉన్నత లక్ష్యంతో దేశాభివృద్ధికి తోడ్పడాలని తెలిపారు. విద్యార్థులు భరతమాత, గాంధీ జీ, నెహ్రూ, భగత్ సింగ్, సుభాష్‌చంద్ర బోస్, రుద్రమదేవి, ఝాన్సీ లక్ష్మి బాయి, అల్లూరి సీతారామ రాజు, కొమరంబీమ్ వంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హేమలత, పాండు, తాజోద్దీన్, లక్ష్మ య్య, శ్రీనివాస్‌రెడ్డి, స్వరూప, అర్విండ్, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు హారిక, వరలక్ష్మి , శ్రవణ వేంకటేష్, జ్యోతి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## నవాబుపేట్ మండల అధికారులకు ఉత్తమ అవార్డు పతకాలు



**ప్రజాపక్షం/నవాబుపేట్ :** నవాబుపేట మండలంలో వివిధ శాఖలలో పనిచేస్తున్న ఎనిమిది మంది అధికారులకు స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఉత్తమ సేవ పురస్కార అవార్డులను జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్,ఎస్పీ నారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి చేతుల మీదుగా అందుకోవడం జరిగింది. అవార్డులు అందుకున్న వారిలో నవాబు పేట వివిధ శాఖల అధికారులు రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాజు, మండల వ్యవసాయ అధికారి జ్యోతి, మండల ఓమియో పతి మెడికల్ అధికారి సునీత, ఎల్లకొండ పశువైద్య ఉపకేంద్ర అధికారిని డాక్టర్ శ్రీప్రియ, డీఆర్డీఏ, ఐకెపి దేవయ్య, అక్నాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి చంద్రకళ, మహిళా స్త్రీశక్తి సిసి ఎస్.రవీందర్, అసిస్టెంట్,మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధిహమి,టెక్నీకల్ అసిస్టెంట్ జగదీష్,ఉత్తమ అవార్డులు ప్రశంసా పత్రం వారి చేతులమీదుగా అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఉత్తమ సేవ అవార్డులు అందుకున్న వారిని అధికారులు,తోటి సిబంది, పలువురు అభినందించారు.

**బంట్వారంలో:**బంట్వారం మండల కేంద్రంతో పాటు అయా గ్రామాలలో 79 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఎంతో ఘనంగ నిర్వహించారు. కార్యక్రమంలో బాగంగా స్థానిక పోలీస్టేషనులో ఎస్ఐ విమల, తహసిల్దార్ కార్యలయంలో విజయ్‌కూమార్, మండల పరిషత్తులో కార్యలయంలో ఎంపిడిఓ రాములు, అయా గ్రామ పంచాయతీలలో ప్రత్యేకాధికారులు, తీవర్ణ పతాకాన్ని ఎగరవేసి జాతీయ పండుగను ఎంతో ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా ప్రతానిధులు, నాయకులు కార్యకర్తలు, గ్రామస్తులు అయా శాఖల అధికారులు తదితరులు పాల్గోన్నారు.



# మహానగరి

గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## ఉత్తమ అవార్డులు అందుకున్న అధికారులు



**ప్రజాపక్షం/కొత్తూరు:** షాద్‌నగర్ ఆర్‌డిఓ సరిత, పట్టణ సిఐ విజయ్‌కుయార్, ఫరూఖ్‌నగర్ మండల ప్రత్యేక అధికారి జె.రామరావు, సూపరిండెంట్ ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, గ్రేడ్1 పంచాయతీ కార్యదర్శి (ఎలికట్ట) తేజస్విని, కొత్తూరు తహశీల్దార్ రవీందర్‌రెడ్డి, మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ లక్ష్మి దేవిలు ఉత్తమ అవార్డులు అందుకున్నారు. వివిధ శాఖల అధికారులు ప్రజలకు ఉత్తమ సేవలు అంధించినందుకు గాను అభినంధిస్తూ తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ల చేతుల మీదుగా అధికారులకు అవార్డులను అంధించారు.

## ఇసి సహకారంతో బిజెపి ఎన్నికల కుంభకోణం : ఆప్



**ప్రజాపక్షం /ఖైరతాబాద్ :** ఎన్నికల కమిషన్ సహకారంతో బిజెపి ఎన్నికల కుంభకోణానికి పాల్పడిందని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ఆరోపించారు. శుక్రవారం హైదరాబాద్ లిబర్టీలోని ఆప్ రాష్ట్ర కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ దిడ్డి సుధాకర్ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఆప్ రాష్ట్ర నేతలు బుర్ర రాములు గౌడ్, విజయ్ మల్లంగి, ఎండి మజీద్, నర్సింగ్, యమునాగౌడ్, హేమ, సుధారాణి, దేవిక, రమ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### అగర్వాల్ శిక్షా సమితిలో...



విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని అగర్వాల్ సమాజ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు అనిరుధ్ గుప్తా అన్నారు. శుక్రవారం బషీర్‌బాగ్‌లోని అగర్వాల్ శిక్షా సమితిలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో కేర్ హాస్పిటల్ సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎం.శ్రీనివాస్‌రావు, ప్రమోద్‌కుమార్ కేడియా,డా.శ్యామ్ సుందర్,డా.మోహన్ గుప్తా , సిఎ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## యాచారం మండలానికి అవార్డులు



**ప్రజాపక్షం/యాచారం :** యాచారం మండలానికి రెండు ఉత్తమ అవార్డులు వచ్చాయి, మండల పరిషత్ కార్యాయంలో విదులు నిర్వహిస్తున్న ఎంపిఓ శ్రీలత, నందివనపర్తి పంచాయతి కార్యదర్శి శ్రీనివాస్‌కు ఉత్తమ అవార్డులు అంద్కున్నారు. స్వాతంత్ర దినోత్సవం సంధర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి సలహదారులు వేం నరేంధర్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా అవార్డులను అందుకున్నారు.

# యువతను కాపాడుకుంటేనే భవిష్యత్తు

### సిఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి

### ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** యువతను కాపాడుకుంటేనే తెలంగాణకు భవిష్యత్తు ఉంటుందని, యువత ఉద్యోగ, ఉపాధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ముఖ్యమంత్రి సలహాదారు (ప్రజావ్యవహారాలు) వేం నరేందర్‌రెడ్డి అన్నారు. రంగారెడ్డి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కొంగరకలాన్‌లో శుక్రవారం 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు పండుగ వాతావరణంలో జరిగాయి. ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించి, పుర ప్రముఖులను, అధికార అనధికారులను కలిసి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ప్రగతి నివేదికను వివరిస్తూ ప్రజలనుద్దేశించి మాట్లాడారు. గ్రామాణాభివృద్ధి, అటవీ శాఖ, హౌసింగ్, సంక్షేమ శాఖలు, సివిల్ సప్లయ్, వైద్యఆరోగ్య శాఖ, విద్యాశాఖ, అగ్నిమాపక, ఐసిడిసి శాఖలకు సంబంధించి శకటాలు తిలకించారు. అనంతరం పరిశ్రమలు, గ్రామాణాభివృద్ధి, వ్యవసాయం, ఉద్యానవన, పౌర సరఫరాలు,విద్యుత్ శాఖలకు సంబంధించి ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఉత్తమ సేవలు అందించిన జిల్లా పౌర సంబంధాల అధికారి (డిపిఆర్‌ఓ) పిసి.వెంకటేశం, కార్యాలయ సిబ్బంది అబ్దుల్ అజీజ్ (టైపిస్ట్), లియాకత్ అలీ (ఆఫీసు సబార్డినేట్), ఇతర జిల్లా అధికారులకు, ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. పదవ తరగతి, ఇంటర్‌లో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. పంద్రాగస్టు వేడుక సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరింపజేశాయి. కెజిబివి. స్కూల్ ఆమనగల్, మోడల్ స్కూల్ మహేశ్వరం, ఎవిన్ ఇంటర్నేషనల్ స్కూల్, హయాత్ నగర్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తుక్కుగూడ, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నాదర్ గుల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇబ్రహీంపట్నం విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. వేడుకల్లో ఎంఎల్‌సి ఎవిఎన్ రెడ్డి, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్, టియుఎఫ్ఐడిసి చూర్మన్ చల్లా నర్సింహా రెడ్డి, జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మధుసూదన్‌రెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, మహేశ్వరం డిసిపి సునీతారెడ్డి, జిల్లా రెవిన్యూ అధికారి సంగీత, కలెక్టరేట్ ఎఓ సునీల్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు షూ పంపిణీ



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు షూ పంపిణీ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని మాల్ ఎలికట్ట గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. భగత్‌సింగ్ యూత్ ఆధ్వర్యర్యంలో నిర్వహించిన స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ ఫిషర్మెన్ కమిటి రాష్ట్ర నాయకుడు, మాజీ వార్డు సభ్యుడు బుడ్డ నరసింహ ముదిరాజ్ హాజరై జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా బుడ్డ నరసింహ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కార్పోరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని, తమవంతు సహాయంగా విద్యార్థులకు షూలను పంపిణి చేస్తున్నట్లు తెలిపారు.

## మలి దశ తెలంగాణ ఉద్యమ అమరవీరుడు శ్రీకాంత్ చారి

### ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

**ప్రజాపక్షం /హయత్ నగర్ :** ప్రత్యేక రాష్ట్ర సాధనకై తృణప్రాయంగా తన ప్రాణాలను అర్పించిన తొలి అమరవీరుడు,తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు కాసోజు శ్రీకాంత్ చారి జయంతి సందర్భంగా ఎల్.బి.నగర్ లో ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి శ్రీకాంతా చారి విగ్రహనికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సత్యం చారి, విరమళ్ళ రామ్ నర్సింహా గౌడ్,రవి యాదవ్,రఘు వీర్ రెడ్డి, రవి,జగదీష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## అమరవీరుల త్యాగఫలాలు మరువలేం

### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** అమరవీరుల త్యాగఫలాలను ఎప్పటికి మరువలేమని..సమాజంలో మానవత్వం..సామరస్యం..ఎంతో గొప్పవని..వాటితోనే దేశం ఎంతో అభివృద్ధి సాధించవచ్చునని షాద్‌నగర్ శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం వీరులు చేసిన త్యాగాలను ఎప్పటికి మరువలేమని, అందుకే ప్రతి ఎడాది అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటున్నామని వివరించారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నేతృత్వంలో అనేక పథకాలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. మహాత్మాగాంధీ కన్న కలలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిజం చేస్తున్నారని, గ్రామ స్వారాజ్యాన్ని పేదలకు అందుబాటులోకి తీసుకువచ్చారని గుర్తు చేశారు. ఈ సమావేశంలో మాజీ జడ్పిటిసి సభ్యుడు వెంకట్‌రాంరెడ్డి, నేతలు బాబర్‌ఖాన్, విశ్వం, కొంకళ్ళ చెన్నయ్యలతోపాటు కాంగ్రెస్ శ్రేణులు ఉన్నారు..

# రెపరెపలాడిన మువ్వన్నెల జెండా









ఎల్‌బి నగర్..

**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** శుక్రవారం డివిజన్ లోని పలు కాలనీల్లో కాలనీ వాసులు ఏర్పాటు చేసిన స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పాల్గొని జాతీయ జెండాలను ఆవిష్కరించారు. బిఎన్‌రెడ్డి నగర్ డివిజన కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, జిహెచ్‌ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ బానోతు సుజాత నాయక్, వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి జాతీయ జెండాలను ఆవిష్కిరించారు. ఎల్‌బినగర్ పోలీస్ స్టేషన్‌లో జాతీయ జెండా ఎసిపి కృష్ణయ్య ఆవిష్కరిచారు. కార్యక్రమంలో సైబర్ క్రైమ్ ఎసిపి, ఎల్‌బి నగర్ సర్కిల్ సిఐ వినోద్ కుమార్ పాల్గొన్నారు.

**హయత్‌నగర్:** మన్సూరాబాద్ డివిజన్ వ్యాప్తంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. జిహెచ్‌ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు.

**షాద్‌నగర్ :** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను షాద్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. వాడవాడలో మువ్వన్నెల జాతీయ జెండాను ఎగురవేశారు. శుక్రవారం షాద్‌నగర్ పట్టణంతోపాటు డివిజన్‌లోని కొత్తూరు, నందిగామ, ఫరూఖ్‌నగర్, కేశంపేట, కొందుర్గు, చౌదరిగూడ మండలాల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఆర్‌డిఓ కార్యాలయం వద్ద ఆర్‌డిఓ సరిత, మున్సిపల్ కార్యాలయం వద్ద కమిషనర్ సునీత, వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద చైర్ పర్సన్ సులోచనరెడ్డి పతాకావిష్కరణ చేశారు. షాద్‌నగర్ ఎసీపి కార్యాలయం వద్ద ఏసీపి లక్ష్మి నారాయణ, పోలీసు స్టేషన్ ఆవరణలో సిఐ విజయ్‌కుమార్, ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో ఎక్సైజ్ సిఐ శేఖర్, అదేవిధంగా తహశీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎంపిడిఓ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ జాతీయ జెండాలను ఎగురవేశారు. షాద్‌నగర్ పంచాయతీ రాజ్ డిఈ కార్యాలయం వద్ద, వ్యవసాయ శాఖ ఏడీ కార్యాలయం వద్ద ఏడిఏ రమాదేవి, షాద్‌నగర్ విధుత్య్ శాఖ డిఈ, కేశంపేట రోడ్డులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఎగురవేశారు. డిప్యూటి డిఎంహెచ్‌ఓ ఆఫీస్ వద్ద డాక్టర్ విజయలక్ష్మి, షాద్‌నగర్, ఫరూఖ్‌నగర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద అధికారులు జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యేలు ప్రతాప్‌రెడ్డి, భీష్వ కిష్టయ్య, నాయకులు బాబర్ ఖాన్, కొంకళ్ల చెన్నయ్య, చెంది తిరుపతిరెడ్డి, బిఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మన్ నాయక్, ఎంఎస్ నటరాజన్, మాజీ జడ్పిటిసి సభ్యుడు వెంకట్‌రాంరెడ్డి, అందె బాబయ్య, నెల్లి శ్రీవర్ధర్‌రెడ్డి, పాల్గొన్నారు.

**కొత్తూరు...** స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జెండా పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కొత్తూరు మున్సిపాలిటి వద్ద చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్ జాతీయ జెండాను ఎగురవేశారు. కొత్తూరు తహశీల్దార్ ఆఫీస్ వద్ద డిప్యూటి తహశీల్దార్ జంగయ్య జాతీయ జెండాను ఎగురవేశారు.

**కొందుర్గు :** కొందుర్గు మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలపై జాతీయ జెండాను ఎగురవేసి సెల్యూట్ చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.

**తుర్కయంజాల్:** ఎందరో వీరుల త్యాగఫలం స్వాతంత్ర దినోత్సవం అని తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డి అన్నారు. స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని తుర్కయంజాల్ పురపాలక పరిధిలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కమిషనర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. పతాక ఆవిష్కరణ అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు వర్షాకాలం నేపథ్యంలో రెయిన్ కోట్‌లను అందచేశారు

**గండిపేట:** రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో ఘనంగా పంద్రాగస్టు వేడుకలు జరిగాయి రాజేంద్రనగర్ క్యాంప్ ఆఫీసులో, బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ జాతీయజెండాను ఆవిష్కరించారు. నార్సింగి , మణికొండమున్సిపాలిటీలో కమిషనర్ కృష్ణమోహన్ రెడ్డి, ప్రదీప్ కుమార్, బిఆర్‌ఎస్ మణికొండ అధ్యక్షుడు మర్రిచెట్టు కూడలిలో సీతారాం దూళిపాళ్ల, ఎంజిఐటి కాలేజీలో ప్రిన్సిపాల్ చంద్రమోహన్ రెడ్డి, సిపిఐ ఆధ్వర్యంలో నార్సింగి చౌరస్తాలో బాబురావు, కెపిఆర్ కాలనీలో రామకృష్ణారెడ్డి చిత్రపురి కాలనీలో అనిల్ కుమార్ జెండాలు ఆవిష్కరించారు. బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో సమర్ధవంతమైన సిబ్బందికి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మెమొంటోలు, ప్రశంస పత్రాలు అందజేశారు. ఎఐటియుసి నాయకులు మల్లేష్, మణికొండ మాజీ మున్సిపల్ చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ నరేందర్ రెడ్డి, నార్సింగి మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటేష్ యాదవ్ పాల్గొన్నారు.

**యాచారం :** యాచారం మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎంపిడిఓ కార్యాలయంల పై మండల ప్రత్యేకాధికారి మాధవరావు, తహసీల్దార్ కార్యాయంపై అయ్యప్ప, సహకారసంఘం కార్యాలయంపై చైర్మన్ రాజేంధర్‌రెడ్డి, యాచారం పోలీస్ స్టేషన్‌పై సిఐ నందిశ్వర్‌రెడ్డి, మేడిపల్లి గ్రీన్ ఫార్మాసిటి పోలీస్ స్టేసన్‌పై సిఐ సత్యనారాయణ, వ్యవసాయాధికారి కార్యాలయంపై ఎఒ అర్ రవినాథ్, ఐకెపి కార్యాలయంపై ఎపిఎం రవింధర్, మండల వేటర్నరి కార్యాలయంపై వైధ్యాధికారి రేఖ, మండల సిహెచ్‌సి ఆసుపత్రిలో డాక్టర్ నవీన్ జాతీయ జెండాలను అవిష్కరించారు.

**శంషాబాద్ :** సిపిఐ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కార్మికులు, ప్రజలకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్. యాదగిరి,మండల కార్యదర్శి నర్రగిరి, కార్మిక సంఘ అధ్యక్షుడు అన్యపు ప్రభు, జిల్లా నాయకుడు గీలక రాజు పాల్గొన్నారు.

**రంగారెడ్డి:** స్వాతంత్ర్య దినోత్సవము వేడుకలలో భాగంగా జాతీయ పతాకాన్ని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.మోహనాచారి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షులు, కార్యదర్శి, మోహనాచారి, కె.వి. నరసింహారెడ్డి, కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు బి.మల్లేష్, కార్యదర్శి ఉజ్జిని రత్నాకర్ రావు, ఉపాధ్యక్షులు పాండురంగారావు, టి చక్రధర్, కార్యదర్శులు సత్య కుమార్, ప్రశాంత్ రెడ్డి, జగదీష్, ప్రదీప్, చిన్న కృష్ణారెడ్డి, భాస్కర్ రావు, యాదగిరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఇబ్రహీంపట్నం :** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి జాతీయ జెండా ఆవిష్కరించారు.

**హయత్ నగర్ :** స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా. కామినేని ఆటో యూనియన్, ఎల్‌బి నగర్ చౌరస్తా యువ చైతన్య ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ జెండాలలో టిపిసిసి ప్రతినిధి జక్కిడి ప్రభాకర్ రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పృథ్వీరాజ్, శ్యామల్, రెడ్డి పుల్లయ్య, విటల్ రెడ్డి, జాకీర్, ఆటో యూనియన్ నాయకులు బాలకిషన్, సాయి, రమేష్, వీరారెడ్డి, భూపాల్, రుద్రేశ్, వెంకటయ్య రవి నాయక్, పాండు పాల్గొన్నారు.

**శంకర్‌పల్లి:** మున్సిపల్ పరిధిలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల దగ్గర ఏర్పాటు చేసిన జాతీయ జెండాను ఎమ్మెల్యే కాలే యాదయ్య ఆవిష్కరించారు.

**శేరిలింగంపల్లి :** యోజకవర్గంలోని మాదాపూర్ డివిజన్‌లోని ఇజ్జత్‌నగర్‌లో గల సిపిఐ పార్టి కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ శేరిలింగంపల్లి కార్యదర్శి రామకృష్ణ, సహాయకార్యదర్శి చందుయాదవ్ జాతీయ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కే.సుధాకర్, తుపాకుల రాములు, కె.కాసిం, వెంకటేష్, నారాయణ, రఘు, భాస్కర్, శివకుమార్, నితీష్, నరసమ్మ, కొండలయ్య, దేవేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



రంగారెడ్డి



ఇబ్రహీంపట్నం



శంకర్‌పల్లి...




తుర్కయాంజాల్



యాచారం..





శంషాబాద్



శేరిలింగంపల్లి



గండిపేట...



హయత్‌నగర్..




షాద్‌నగర్...

# రీల్

## భీమవరం టాకీస్ 15 చిత్రాలు ప్రారంభం



భీమవరం టాకీస్ పతాకంపై ఇప్పటికే 114 చిత్రాలను నిర్మించిన ప్రముఖ నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ ప్రపంచ సినిమా చరిత్రలోనే ఒకేసారి 15 చిత్రాలకు శ్రీకారం చుట్టారు. హైదరాబాద్‌లోని సారథి స్టూడియోలో జరిగిన ఈ వేడుకకు తెలుగు చిత్ర పరిశ్రమకు చెందిన అతిరథమహారథులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మురళీమోహన్, రేలంగి నరసింహారావు, సుమన్, శ్రీకాంత్, జె.డి.చక్రవర్తి, తనికెళ్ళ భరణి, 30 ఇయర్స్ పృథ్వి, అజయ్ ఘోష్, సి.కళ్యాణ్, తమ్మారెడ్డి భరద్వాజ, తుమ్మల ప్రసన్నకుమార్, చదలవాడ శ్రీనివాసరావు, భరత్ భూషణ్, వల్లూరిపల్లి రమేష్ బాబు, దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్, ప్రముఖ రచయిత, రాజ్యసభ సభ్యులు విజయేంద్రప్రసాద్, కె.ఎల్.స్టూడియో అధినేత కొంతం లక్ష్మణ్, గజల్ శ్రీనివాస్, చేకోటి ప్రవీణ్, ఇమ్మడి రమేష్, వంశీ రామరాజు, కె.ధర్మారావు, గిడుగు కాంతి కృష్ణ తదితరులు హాజరైయ్యారు. 2025, ఆగస్టు 15న కొబ్బరికాయలు కొట్టిన ఈ 15 చిత్రాలకు 2026 ఆగస్టు 15కి పూర్తి చేసి గుమ్మడికాయలు కొట్టేందుకు అన్ని సన్నాహాలు చేస్తున్నామని రామసత్యనారాయణ పేర్కొన్నారు.




## యుద్ధ వీరుడిగా.. శ్రీ కృష్ణ అవతార్ ఇన్ మహోబా

'అభయ్ చరణ్ ఫౌండేషన్', 'శ్రీజీ ఎంటర్‌టైన్‌మెంట్' సంయుక్తంగా ఒక చారిత్రక మహాకావ్యాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక టైటిల్‌ను ప్రకటించారు. 'శ్రీ కృష్ణ అవతార్ ఇన్ మహోబా' పేరుతో అనిల్ వ్యాస్ నిర్వహణ బాధ్యతలు చూసుకుంటుండగా, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం ముకుంద్ పాండే వహిస్తున్నారు. ఇస్కాన్ ఢిల్లీకి చెందిన సీనియర్ ప్రీచర్ 'జితామిత్ర ప్రభు శ్రీ' ఆశీస్సులతో ఈ నవ్య కావ్యం రూపొందుతోంది. ఇది 11 12వ శతాబ్దాల నాటి 'మహోబా' సాంస్కృతిక వైభవాన్ని, అలాగే భగవాన్ శ్రీ కృష్ణుడి దివ్యత్వాన్ని, ధీరత్వాన్ని, ఆధ్యాత్మిక ప్రభావాన్ని చూపించబోతున్నారు. చలన చిత్ర పరిశ్రమలో తొలిసారిగా శ్రీ కృష్ణుడిని ఒక యుద్ధవీరుడి పాత్రలో చూపించబోయే సినిమా ఇది. 'శ్రీ కృష్ణ అవతార్ ఇన్ మహోబా' ఒక పాన్‌వరల్డ్ ప్రాజెక్ట్‌గా ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకులను ఆకట్టుకునేలా రూపొందుతోంది. ప్రపంచస్థాయి టెక్నీషియన్లతో తెరకెక్కుతున్న ఈ చిత్రం, చరిత్ర, సాంస్కృతిక వారసత్వం, ఆధ్యాత్మికతను కలగలుపుతుంది. నటీనటులు, సాంకేతిక బృందం ఇతర వివరాలు త్వరలో వెల్లడిస్తారు.




## సెప్టెంబరు 5న సైమా అవార్డ్స్

ప్రతిష్ఠాత్మక 'సైమా' 2025 (SIIMA సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్) వేడుక సెప్టెంబరు 5, 6 తేదీల్లో దుబాయ్‌లో అంగరంగవైభవంగా జరగనుంది. ఈ వేడుకలకు సంబంధించిన ప్రెస్ మీట్ హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా నేషనల్ అవార్డ్ విజేతలైన దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాత సాహు గారపాటి(భగవంత్ కేసరి), దర్శకుడు సాయి రాజేష్, సింగర్ రోహిత్ (బేబీ) దర్శకుడు ప్రశాంత్ వర్మ, విజువల్ ఎఫెక్ట్స్ వెంకట్ (హనుమాన్)లని సైమా ఘనంగా సత్కరించింది డైరెక్టర్ అనిల్ రావిపూడి మాట్లాడుతూ భగవంత్ కేసరి నా కెరీర్‌లో చాలా స్పెషల్ ఫిలిం. సినిమాకి జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం చాలా సంతోషాన్ని ఇచ్చింది. నేషనల్ అవార్డు కమిటీకి ప్రత్యేక ధన్యవాదాలు. సినిమాని నిర్మించిన సాహు గారపాటికి, పాయింటెన్ని ఒప్పుకున్న మా బాలకృష్ణకి ధన్యవాదాలు. సైమా విష్ణుతో నాకు చాలా మంచి అనుబంధం ఉంది. నా ఫస్ట్ మూవీ పటాస్ సినిమాకి ఆయన అవార్డు ఇచ్చారు ఇప్పటికీ మర్చిపోలేను. ఆ ఫస్ట్ అవార్డు నాకు ఎప్పటికీ గుర్తుండిపోతుంది. నిర్మాత సాహు గారపాటి మాట్లాడుతూ విష్ణు బృందానికి సైమాకి థాంక్యూ సో మచ్. విష్ణు ముందే చెప్పారు. ఈ సినిమాకి నేషనల్ అవార్డు వస్తుందని. సినిమాపై అంత నమ్మకం ఉంచినందుకు వారికి కృతజ్ఞతలు. డైరెక్టర్ ప్రశాంత్ వర్మ మాట్లాడుతూ నేషనల్ అవార్డు వచ్చిన తర్వాత తొలి సత్కారం. అందరూ నేషనల్ విన్నర్స్‌ని కలవడం చాలా ఆనందంగా ఉంది. . అవార్డు వచ్చిన వారికే కాదు సినిమా కోసం పని చేసిన అందరికి అభినందనలు తెలుపుతున్నాను. సైమా టాలెంట్‌ని సెలబ్రేట్ చేసుకునే చాలా గొప్ప వేదిక. డైరెక్టర్ సాయి రాజేష్ మాట్లాడుతూ నేషనల్ అవార్డు వచ్చిన తర్వాత తొలి గుర్తింపు సైమా ఇచ్చిందే. నా కెరీర్‌లో పది అవార్డులు తీసుకుంటే అందులో ఎనిమిది అరవింద్ చేతుల మీద తీసుకోవడం చాలా ఆనందంగా ఉందని చెప్పారు. ఈ సమావేశంలో హీరో సందీప్ కిషన్, హీరోయిన్ వేదిక, హీరోయిన్ ఫరియా అబ్దుల్లా, హీరోయిన్ మంచు లక్ష్మి పాల్గొన్నారు.

## బ్లడ్ బ్యాంక్‌లో జెండాను ఆవిష్కరించిన చిరంజీవి



భారతదేశ 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు హైదరాబాద్‌లోని చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌లో ఘనంగా జరిగాయి. మెగాస్టార్ చిరంజీవి వేడుకల్లో పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. జెండా వందన కార్యక్రమంలో అల్లు అరవింద్, సాయి ధరమ్ తేజ్, సుస్మిత, మెగా కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెగా స్టార్ చిరంజీవి అందరికీ స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మన పూర్వీకులు ఎంతో విలువైన స్వాతంత్ర్యాన్ని ఆనందంగా జరుపుకుందాం. ఈ స్వేచ్ఛ మన ప్రతిభ, అభివృద్ధికి బలాన్ని ఇచ్చి, మన దేశం ఎప్పటికి ముందుకు సాగడానికి దోహదం చేయాలి అని చిరంజీవి పేర్కొన్నారు.



## వెంకీ, త్రివిక్రమ్ కొత్త ప్రాజెక్ట్ షురూ

విక్టరీ వెంకటేష్, త్రివిక్రమ్ కలయికలో చిత్రం కోసం తెలుగు సినీ అభిమానులంతా ఎంతగానో ఎదురుచూస్తున్నారు. తెలుగు సినిమా రంగంలో తమదైన ముద్ర వేసిన ఈ ఇద్దరు ఎట్టకేలకు కొత్త సినిమా కోసం చేతులు కలిపారు. అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ చిత్రం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. సినీ వర్గాలతో పాటు, ప్రేక్షకులలో కూడా వెంకటేష్, త్రివిక్రమ్ కలయికలో సినిమా పట్ల ఎంతో ఆసక్తి ఉంది. త్రివిక్రమ్ ప్రత్యేకమైన కథా శైలితో రాబోతున్నారు. స్వచ్ఛమైన వినోదం, లోతైన భావోద్వేగాలతో నిండిన కుటుంబ కథా చిత్రాలను అందించడంలో త్రివిక్రమ్ పేరుగాంచారు. ఇప్పుడు త్రివిక్రమ్ మరో ఆకర్షణీయమైన, అన్ని వర్గాల ప్రేక్షకులు మెచ్చే చిత్రాన్ని అందించడానికి సిద్ధమవుతున్నారు. సుప్రసిద్ధ హారిక & హాసిని క్రియేషన్స్ పతాకంపై ప్రముఖ నిర్మాత ఎస్.రాధాకృష్ణ (చినబాబు) ఈ ప్రతిష్ఠాత్మక చిత్రాన్ని నిర్మిస్తున్నారు. చిత్రీకరణ త్వరలో ప్రారంభం కానుంది. ప్రముఖ నిర్మాత సురేష్ బాబు కెమెరా స్విచ్ ఆన్ చేశారు.



తేజ సజ్జా హీరోగా, కార్తీక్ ఘట్టమనేని, టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పాన్ ఇండియా ఫిల్మ్ 'మిరాయ్' హిందీ హక్కులను బాలీవుడ్ లీడింగ్ ఫిల్మ్ మేకర్ కరణ్ జోహార్ ధర్మ ప్రొడక్షన్స్ సొంతం చేసుకుంది.

## కరణ్ చేతికి మిరాయ్ హక్కులు

హనుమాన్ సంచలన విజయంతో దేశవ్యాప్తంగా క్రేజ్ సంపాదించుకున్న హీరో తేజ సజ్జా, ఇప్పుడు కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించిన మూవీ 'మిరాయ్'లో సూపర్ యోధగా అలరించనున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ భారీ స్థాయిలో నిర్మించారు. ఈ సినిమాపై హిందీలోనూ భారీగా అంచనాలు నెలకొనడంతో బాలీవుడ్ లీడింగ్ ఫిల్మ్ మేకర్ కరణ్ జోహార్ 'మిరాయ్' హక్కులను తీసుకున్నారు. తన ప్రతిష్ఠాత్మక బ్యానర్ ధర్మ ప్రొడక్షన్స్, మిరాయ్ హిందీ థియేట్రికల్ డిస్ట్రిబ్యూషన్ రైట్స్ సొంతం చేసుకుంది. మిరాయ్ నార్త్‌లో మ్యాసివ్‌గా రిలీజ్ కానుంది. బాహుబలి, దేవర వంటి తెలుగు బ్లాక్‌బస్టర్‌లతో ధర్మ ప్రొడక్షన్స్‌కు సక్సెస్ ఫుల్ ట్రాక్ రికార్డ్ వుంది. ఈ కొలాబరేషన్ మిరాయ్‌పై మరింత అంచనాలు పెంచుతోంది. మిరాయ్ 2డి, 3డి ఫార్మాట్‌లలో ఎనిమిది భాషల్లో సెప్టెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇది ట్రూ పాన్‌ఇండియన్ విజువల్ వండర్‌గా ఉండబోతుంది.

## సెప్టెంబర్ 5న 'ఆపద్బాంధవుడు'

శ్రీ లక్ష్మి ఎడ్యుకేషనల్ ఛారిటబుల్ ట్రస్ట్, సంతోష్ ఫిలింస్ బ్యానర్స్‌పై పలు బాలల చిత్రాలు రూపొందించి ప్రేక్షకుల ఆదరణతో పాటు ప్రతిష్ఠాత్మక అవార్డులు దక్కించుకున్నారు దర్శక నిర్మాత భీమగాని సుధాకర్ గౌడ్. ఆయన రచనా, దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'ఆపద్బాంధవుడు' శ్రీ పెంచల్ రెడ్డి. డి.లీలావతి నిర్మించారు. ఈ చిత్రంలో పెంచల్ రెడ్డి, సుధాకర్ గౌడ్ ఝాన్సీ, ప్రతిమ, నాగేశ్వరరావు కీలక పాత్రల్లో నటించారు. ఈ చిత్రం ప్రెస్ మీట్‌ను హైదరాబాద్ ఫిలింఛాంబర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా దర్శకుడు భీమగాని సుధాకర్‌గౌడ్ మాట్లాడుతూ వ్యాపారం, కుటుంబం, సమాజ సేవ.. ఈ మూడింటిని సమన్వయం చేసుకుంటూ సేవా రత్నగా గుర్తింపు పొందిన గొప్ప వ్యక్తి పెంచల్ రెడ్డి. ఆయన నాకు ఎంతో కాలంగా తెలుసు. దర్శకులుగా మనం సమాజం నుంచి, మన చుట్టూ ఉన్న వాళ్ల దగ్గర నుంచే స్ఫూర్తి పొందుతాం. అలా మీ జీవితం ఆధారంగా లఘు చిత్రం రూపొందించాలని ఉంది అని అడిగినప్పుడు ఆయన నాకంటే గొప్పవాళ్లు ఎంతోమంది ఉన్నారు, నాకంటే ఎక్కువగా సేవ చేసిన వాళ్లున్నారు అని తిరస్కరించేవారు. చివరిసారి ప్రయత్నం చేసినప్పుడు మాత్రం మౌనంగా ఉండిపోయారు. ఆయన మౌనాన్నే అంగీకారంగా తీసుకుని నేను 'ఆపద్బాంధవుడు' చిత్రాన్ని రూపొందించాను. సెప్టెంబర్ 5న ఈ చిత్రాన్ని రిలీజ్ చేసేందుకు సన్నాహాలు జరుపుతున్నామని అన్నారు.



## 'మటన్ సూప్' టైటిల్ విడుదల



రామకృష్ణ వట్టికూటి సమర్పణలో అలుక్కా స్టూడియోస్, శ్రీ వారాహి ఆర్ట్స్, భవిష్య విహార్ చిత్రాలు బ్యానర్లపై రమణ్, వర్షా విశ్వనాథ్ హీరో హీరోయిన్లుగా రామచంద్ర వట్టికూటి తెరకెక్కిస్తోన్న చిత్రం 'మటన్ సూప్'. 'విట్‌నెస్ ది రియల్ క్రైమ్' ట్యాగ్ లైన్. మల్లిఖార్జున ఎలికా (గోపాల్), అరుణ్ చంద్ర వట్టికూటి, రామకృష్ణ సనపల నిర్మాతలుగా రానున్న ఈ నూతన చిత్రానికి సంబంధించిన టైటిల్ పోస్టర్‌ను ప్రముఖ నిర్మాత కె.ఎస్.రామారావు విడుదల చేశారు. ఇండిపెండెన్స్ డే సందర్భంగా 15న ఈ నూతన సినిమాకు సంబంధించిన టైటిల్ పోస్టర్, మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు.

## రాజ్‌భవన్‌లో 'ఎట్ హోమ్'



ప్రజాపక్షం/హైదరాబాద్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో శుక్రవారం 'ఎట్‌హోమ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఇచ్చిన తేనేటి విందుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క , శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపిలు, ఎంఎల్‌ఎలు,ఎంఎల్‌సిలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ పలువురి వద్దకు వెళ్లి పలుకరించారు.

## ఎపిపి ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణలోని న్యాయవాదులకు రేవంత్ సర్కార్ శుభవార్త చెప్పింది. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఎపిపి) పోస్టుల భర్తీకి తెలంగాణ పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 118 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ప్రకటించింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 285 ఎపిపి పోస్టులు ఉండగా.. వాటిలో 120మంది మాత్రమే సర్వీసులో ఉన్నారు. ఈ నేపథ్యంలో కొత్త నియామకాలకు ప్రభుత్వం అనుమతి తెలపడంతో డిపార్ట్మెంట్ ఆఫ్ ప్రాసిక్యూషన్ (డిఒపి) పెద్దమొత్తంలో పోస్టులు భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసింది. మల్టీ జోన్ 1లో50 ఖాళీలు, మల్టీ జోన్ 2లో 68 ఖాళీలు ఉన్నాయి. ఈ పోస్టులకు అభ్యర్థులు లా డిగ్రీ అర్హత కలిగి ఉండాలి. బార్ కౌన్సిల్లో ఎన్‌రోల్మెంట్ తప్పనిసరి. రాష్ట్రంలోని క్రిమినల్ కోర్టుల్లో కనీసం మూడేళ్ల న్యాయవాదిగా ప్రాక్టీస్ చేసిన అనుభవం ఉండాలి. వయోపరిమితి జూలై 2025 నాటికి 34 ఏళ్లు మించకూడదు. ఒబిసి, ఎస్‌సి, ఎస్‌టి, దివ్యాంగ అభ్యర్థులకు సడలింపులు ఉంటాయి. ఎంపిక చేసేందుకు రాత పరీక్ష నిర్వహించనుంది. పేపర్1 అబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. పేపర్2 డిస్క్రిప్టివ్ విధానంలో నిర్వ హిస్తారు. మెరిట్ ఆధారంగా తుది జాబితాను ప్రకటిస్తారు. జీతం నెలకు రూ. 54,220 నుంచి రూ.1,33,630 ఉంటుంది. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలి. https://www.tgprb.in/వెబ్ సైట్‌ను సందర్శించండి.

## సార్వభౌమాధికారం, సామరస్యానికి పొంచి ఉన్న ముప్పు: విజయన్



తిరువనంతపురం : సార్వభౌమాధికారం, సామాజిక సామరస్యానికి ముప్పు పొంచి ఉందని ముఖ్యమంత్రి పినరయి విజయన్ హెచ్చరించారు. తిరువనంతపురంలో శుక్రవారం జరిగిన స్వాతంత్ర్య వేడకల్లో ఆయన ప్రసంగించారు. దేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీసే బాహ్య సామ్రాజ్యవాద శక్తుల నుంచి, సామాజిక ఐక్యతను దెబ్బతీసే లక్ష్యంతో ఉన్న అంతర్గత ముప్పుల నుంచి దేశం తనను తాను రక్షించుకోవాలన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాలలో సాధించిన విజయాలను అణగారిన వర్గాల జీవన వాస్తవాలను కప్పివేయడానికి వినియోగించకూడదన్నారు. పేదరికం, ఆకలి, బాలకార్మికులు, నిరక్షరాస్యత, కుల వివక్ష, మతపరమైన ద్వేషం, నిరుద్యోగం లేని భారతదేశాన్ని నిర్మించాలన్నారు. మత విద్వేష శక్తులు దేశాన్ని మత, కుల ప్రాతిపదికన విభజించడానికి ప్రయత్నిస్తున్నాయని, భారతదేశ సమైక్యత భావనను సవాలు చేసే ఇటువంటి ప్రయత్నాలు మరింత బలపడ్డాయన్నారు. ఈ విభజనలన్నింటినీ ప్రతిఘటించి ఓడించాలని, అన్ని విభేదాలకు అతీతంగా ఐక్యంగా నిలబడాలని ప్రజలకు సూచించారు. భారత గణతంత్రాన్ని నిర్వచించే స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సోషలిజం అనే రాజ్యాంగ విలువలు కేవలం ఆదర్శాలు కాదని, ఆచరణలో అమలు చేయవలసిన అత్యవసరాలని స్పష్టం చేశారు. మహాత్మాగాంధీ ఆదర్శాలను గుర్తు చేసుకుంటూ, నైతిక బాధ్యతలను గుర్తెరగాలన్నారు.

## జిఎస్‌టి ఛీటింగ్ కేసులో.. అంబికా స్టీల్ మేనేజింగ్ పార్ట్‌నర్ అరెస్ట్

ప్రజాపక్షం/హైదరాబాద్: జిఎస్‌టి చీటింగ్ కేసులో అంబికా స్టీల్ మేనేజింగ్ పార్టర్‌ను హైదరాబాద్ సిసిఎస్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. రాష్ట్ర జిఎస్‌టి అధికారుల ఫిర్యాదు మేరకు సిసిఎస్ పోలీసులు ఇటీవలే అంబికా స్టీల్‌పై కేసు నమోదు చేశారు. పోలీసుల దర్యాప్తులో, నిందితుడు సరుకుల వాస్తవ రవాణా లేకుండా ఈవే బిల్లులు సృష్టించి, నకిలీ ఇన్వాయిస్‌లు జారీచేసి, తప్పుడు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పొందినట్లు తేలింది. ఈ చర్యలు జిఎస్‌టి చట్టానికి విరుద్ధం దీంతో జిఎస్‌టి అధికారులకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సిసిఎస్ పోలీసులు జూలై 30న ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. దర్యాప్తులో ఇప్పటికే అధికారులు స్వాధీనం చేసుకున్న ఎపి29టిఎ7213 నంబరు గల వాహనాన్ని పలువురు పన్ను చెల్లింపుదారులు అనధికారికంగా ఉపయోగించి, సరుకుల రవాణా చేయకుండా అనేక ఈవే బిల్లులు సృష్టించినట్లు వెలుగులోకి వచ్చింది. నిందితులు కేసును రద్దు చేయించుకోవడానికి హైకోర్టును ఆశ్రయించారు. అయితే, హైకోర్టు వారి పిటిషన్‌ను కొట్టివేసింది. అనంతరం, గోవాకు పారిపోవడానికి ప్రయత్నిస్తుండగా పోలీసులు వారిని పట్టుకొని అరెస్ట్ చేశారు. ఈ కేసులో మరికొందరు నిందితులు ఇంకా పరారీలో ఉండగా, వారిని పట్టుకునేందుకు పోలీసులు గాలిస్తున్నారు.

## అతి భారీ వర్షాలు (మొదటి పేజీ తరువాయి)

తీరాలను ఆదనుకొని ఉన్న అల్పపీడన ప్రాంతం కొనసాగుతుందని, దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం సగటు సముద్రమట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించిందన్నారు. దక్షిణదిశగా వొంగి ఉందన్నారు. రాబోయే 24గంటల్లో దక్షిణ ఒడిశా, ఉత్తర కోస్తాంధ్ర మీదుగా పశ్చిమ వాయువ్య దిశగా కదిలే అవకాశాలున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో మూడురోజులు భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని చెప్పారు. శుక్రవారం ఆదిలాబాద్, భూపాలపల్లి, కామారెడ్డి, ఆసిఫాబాద్, మంచిర్యాల, మెదక్, ములుగు, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, వరంగల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్‌ను జారీ చేశామన్నారు. కొత్తగూడెం, హన్మకొండ, జగిత్యాల, జనగాం, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని తెలిపారు. శనివారం ఆదిలాబాద్, కొత్తగూడెం, భూపాలపల్లి, ఆసిఫాబాద్, మంచిర్యాల, ములుగు, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయన్నారు. ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్‌ను జారీ చేయగా, హన్మకొండ, జగిత్యాల, కరీంనగర్, ఖమ్మం, మహబూబాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, వరంగల్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని అంచనగా ఉందన్నారు. ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశామన్నారు. బుధవారం నుంచి గురువారం ఉదయం వరకు అల్పపీడనం కారణంగా రాష్ట్రవ్యాప్తంగా అతి భారీ వర్షాలు నమోదయ్యాయి. గడిచిన 24గంటల్లో ఆదిలాబాద్, వికారాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్ కర్నూల్, సూర్యాపేట, ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిశాయి. నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో 19.8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని అధికారులు వివరించారు. వికారాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, వనపర్తి, సూర్యాపేట, నల్లొండ, ములుగు, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి.

## ఉన్నతమేమీ కాదు (మొదటి పేజీ తరువాయి)

హైకోర్టు రెండూ రాజ్యాంగ న్యాయస్థానాలని, రాజ్యాంగ స్కీమ్ విషయానికి వస్తే, అవి ఒకదానికొకటి తక్కువ లేదా ఉన్నతమైనవి కావని పేర్కొన్నారు. అందువల్ల న్యాయమూర్తుల నియామకంపై మొదటి నిర్ణయం హైకోర్టు కొలీజియం తీసుకోవాలని ఆయన చెప్పారు. మేం కేవలం పేర్లు మాత్రమే హైకోర్టు కొలీజియంకు సిఫారసు చేస్తాం. పేర్లను పరిగణనలోనికి తీసుకోవాలని కోరుతాం. వారు అభ్యర్థులు హోదాకు అర్హులైన వారని సంతృప్తి చెందిన తర్వాత మాత్రమే పేర్లు సుప్రీంకోర్టుకు వస్తాయని సిజెఐ వెల్లడించారు. 'మాజీ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్‌ఖన్నా సారథ్యం వహించినప్పుడు సుప్రీంకోర్టు కొలీజియం అభ్యర్థులతో సంభాషించే పద్ధతిని ప్రారంభించిందని, అది నిజంగా సహాయకారిగా నిరూపించింది' అని గవాయ్ తెలియజేశారు. అభ్యర్థులతో 10 నిమిషాలు లేదా 15 నిమిషాలు లేదా అరగంట సేపు సంభాషించిన తర్వాతే వారు ఏవిధంగా సమాజానికి ఎంతవరకు దోహదపడతారనే విషయాన్ని సుప్రీంకోర్టు కొలీజియం నిర్ణయిస్తుందని భారత ప్రధాన న్యాయమూర్తి బిఆర్.గవాయ్ చెప్పారు. 1855 సంవత్సరంలో జార్ఖండ్‌లోని సంతాల్ (హల్) తిరుగుబాటు మొదలు పశ్చిమ మహారాష్ట్రలోని జ్యోతిరావు పూలే, సావిత్రిభాయి పూలే స్వాతంత్ర్య సమరయోధుల వరకు వారి పోరాటాలను సిజెఐ బిఆర్.గవాయ్ గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్ ఠాగూర్, మహాత్మాగాంధీ, బిఆర్.అంబేద్కర్, మౌలానా అబుల్ కలామ్ ఆజాద్‌ల హితోక్తులను ఆయన జ్ఞప్తి చేశారు. స్వాతంత్ర్య పోరాటం కేవలం ఒక రాజకీయ కదలిక మాత్రమే కాదని, లెక్కలేనంత మంది న్యాయవాదులు కీలకపాత్ర పోషించిన నైతిక, చట్టపరమైన ప్రయత్నమని దేశ చరిత్ర ప్రజలకు నేర్పుతుందని ఆయన అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల వారసత్వం నేటి న్యాయవాదులకు మార్గనిర్దేశం చేయాలని, ఈ సంప్రదాయాన్ని ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. 'న్యాయనిపుణులుగా మీ దృష్టికి అర్థమైన కారణం ఏదీ చిన్నది కాదని మీరు గుర్తించాలి' అని సిజెఐ గవాయ్ హితబోధ చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్, ఇతర సుప్రీంకోర్టు న్యాయవాదులు కూడా హాజరయ్యారు.

## యువత ముందుండాలి

(మొదటి పేజీ తరువాయి)

త్యాగం చేశారని, వారి స్ఫూర్తితో ప్రజా పోరాటాలు చేయాలని అన్నారు.

**రాజ్యాంగ విలువలను పాతరేస్తున్న మోదీ సర్కార్..**

స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ స్వాతంత్ర్య ఫలాలు ఎవరికి చెందుతున్నాయని చాడ వెంకట్ రెడ్డి ప్రశ్నించారు. 11 సంవత్సరాలుగా కేంద్రంలోని బిజెపి, ఎన్‌డిఎ నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగ విలువలు పాతరేయబడుతున్నాయని, ప్రాథమిక హక్కులు, ప్రశ్నించే గొంతులు నొక్కివేయ బడుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో మతాల మధ్య చిచ్చు, కులాల కుట్రల ద్వారా ప్రజలను విభజించే కుట్రలు సాగుతున్నాయన్నారు. 'సేవ్ కానుస్ట్యూషన్, సేవ్ డెమోక్రసీ, సేవ్‌సెక్యూలరిజం' నినాదాలతో యువత ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. పేదలకు ఇళ్లు లేకపోవడం, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు లేకపోవడం, నిరుద్యోగ సమస్య పెనుభూతంగా మారిందని, హక్కులన్నీ హరించబడుతున్న ఇటువంటి తరుణంలో భారత్ వెలిగిపోతుందని బిజెపి నాయకులు చెబుతున్నారని మండిపడ్డారు. దేశంలో సామాన్యుల బతుకు చితికిపోతున్నదని, రిటైర్డ్ ఉద్యోగులకు కూడా పెన్షన్‌లు, ఉద్యోగ విమరమణ అనంతరం అందాల్సిన ప్రయోజనాలు కూడా అందడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.



**పంచవర్ష ప్రణాళిక అమలు చేయించిన ఘనత కమ్యూనిస్టులతే : పశ్య పద్మ**

పశ్యపద్మ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో ఎదురొడ్డి పోరాడి ప్రాణాలు కోల్పోయింది కమ్యూనిస్టులేనని గుర్తు చేశారు. మౌలానా ఆజాద్, స్వామి కుమారనందా, పరిపాలన హక్కుతో పాటు తమకు పూర్తి స్థాయి స్వరాజ్యం కావాలని 1921లో జరిగిన కాంగ్రెస్ మహాసభలో కమ్యూనిస్టులు డిమాండ్ లెవనెత్తిన విషయాన్ని గుర్తు చేశారు. అంబేడ్కర్ రాజ్యాంగం అమల్లోకి రాకముందే రష్యా తరహాలో పంచవర్ష ప్రణాళికను దేశంలో అమలు చేయించిన ఘనత కమ్యూనిస్టులదేనన్నారు. సోషలిజం, సెక్యూలరిజాన్ని కాపాడుకోవాలన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనని బిజెపి, ప్రస్తుతం జరుగుతున్న ప్రదర్శనలలో ఆ పార్టీ నాయకులు జెండార్యాలీలతో ప్రచారం చేసుకుంటుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు పి.ప్రేమ్ పావని, తెలంగాణ గిరిజన సమాఖ్య ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, ఐప్సో సమన్వయ ప్రధానకార్యదర్శి కెవిఎల్, నాయకులు బొమ్మగాని నాగభూషణం, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లే నరసింహ, సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, కార్యవర్గ సభ్యులు నెర్లకంటి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

**గిరిప్రసాద్ భవన్‌లో..**

నాగోల్ బండ్లగూడలో గిరిప్రసాద్ భవన్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. జాతీయ పతాకాన్ని నవచేతన విజ్ఞాన సమితి కార్యదర్శి బిఎస్‌ఆర్ మోహన్ రెడ్డి ఎగురవేశారు. వేడుకల్లో విజ్ఞాన సమితి జనరల్ మేనేజర్ మధుకర్, కోశాధికారి ఉజ్జిని రత్నాకర్ రావు, ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com